ISSN No : 2581-7477

# సాహిత్య ప్రస్థానం

Sahitya Prasthanam

సంపుటి - 2 సంచిక - 8 మే - 2021 ప్లవ పేజీలు 68 వెల రూ. 20



చంద్రకు నివాళి










# ఉత్తేజపూరితంగా ఉక్కు కవనం

విశాఖ నగరం విస్తరణలో, అభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తూ ... వేలాదిమందికి ఉపాధిని కల్పిస్తున్న విశాఖ స్టీల్‌ప్లాంటుని ప్రైవేటీకరించే ప్రయత్నాలను నిరసిస్తూ ... 2021 ఏప్రిల్ 4వ తేదీ ఆదివారం స్టీల్‌ప్లాంటు అంబేద్కర్ ఆడిటోరియంలో సాహితీ స్రవంతి ఆధ్వర్యాన 'ఉక్కు కవనం' ఉత్తేజపూరితంగా జరిగింది. సాహితీ స్రవంతి రాష్ట్ర గౌరవాధ్యక్షులు తెలకపల్లి రవి ప్రారంభోపన్యాసం చేసి, కవనాన్ని ప్రారంభించారు. ఉద్యమాల ఊపిరితో పుట్టి పెరిగిన విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని కాపాడుకోవటం అందరి కర్తవ్యమని పేర్కొన్నారు. కవులు కళాకారులు రచయితలు చైతన్యవంతమైన పాత్ర పోషిస్తూ రచనలు వెలువరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో దాదాపు 150 మంది కవులు కవయిత్రులు పాల్గొని తమ కవితలను వినిపించారు. ఉద్యమాలతో ఆవిర్భవించిన ఉక్కు ఫ్యాక్టరీని కార్పొరేట్లకు ఎలా ధారాదత్తం చేస్తారని కవులు ప్రశ్నించారు. కార్మిక - కర్షక మైత్రితో ఉద్యమం మరింత ఉధృతం కావాలని, ప్రైవేటీకరణను అడ్డుకొని, కార్మికులు, ప్రజలు విజయం సాధించటం ఖాయమని తమ కవితల్లో ఆకాంక్షించారు. ప్రముఖ కవులు అద్దాడ అప్పలనాయుడు, గంటేడ గౌరునాయుడు, డాక్టర్ మాటూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. చీకటి దివాకర్, వెన్నపూస, సత్యాజీ, చింతాడ రామారావు, పాయల మురళీకృష్ణ, రామస్వామి, జలాడి నాయుడు, ఎంప్లాయీస్ సమన్వయకర్తలుగా వ్యవహరించారు. ఆ మర్నాడు విశాఖపట్నంలో జరిగిన శ్రీశ్రీ 110వ జయంత్యుత్సవాల ముగింపు సభలో తెలకపల్లి రవి మాట్లాడారు.

# మలి దఫాతో మరింత ఆందోళన

**చూ**స్తుండగానే కోవిడ్19 సెకండ్ వేవ్ అదుపు తప్పిపోవడం ఆందోళనకరంగా మారింది. రోజుకు మూడున్నర లక్షల కేసులకు మించి పాజిటివ్ నమోదవడం మొదటి దఫా పరిస్థితిని మించిపోయింది. కేసులు ఎక్కువగా వున్నా మరణాలు ఆ స్థాయిలో లేవని మొదట అనుకున్నారు గాని ఆ సంతోషం కూడా ఆవిరైపోయింది. ప్రపంచంలోనే అత్యధికమైన కేసులకు తోడు మరణాలు కూడా రోజుకు మూడు వేలు దాటిపోయాయి. గతంలో మొదటిసారి గనక అర్థం చేసుకోవడానికి సమయం పట్టింది. ఇప్పుడు ఆ అనుభవం వున్నా వాక్సిన్లు రంగంలోకి వచ్చినా కరోనా తాకిడి కలవరం కలిగిస్తున్నదంటే పాలకుల బాధ్యత మరీ ముఖ్యంగా ఇందుకు ఆధ్వర్యం వహిస్తున్న ప్రధాని మోడీ కేంద్ర ప్రభుత్వ బాధ్యత చాలా ఎక్కువగా ఉంది. ఈ విధమైన మలిదఫా విజృంభణ గురించి అప్రమత్తం చేయడంలోనూ, అవగాహన కల్పించడంలోనూ వైఫల్యం కొట్టొచ్చినట్టు కనిపిస్తుంది. కరోనాపై విజయం సాధించేశామన్న హడావుడి మన దేశంలోనే గాక ప్రపంచానికే వాక్సిన్ దాతలమన్న ఆత్మస్తుతి శ్రుతిమించిన ఫలితమిది. చప్పట్లు కొట్టడం, దీపాలు పెట్టడం అంటూ ఏవో ప్రచార ప్రహసనాలు నడిపి ప్యాకేజి విషయంలో నామకార్థంగా ముగించారు. ఇప్పుడు కూడా టీకాలపై ముందస్తు హడావుడికి, వాస్తవంగా వేయాల్సి వచ్చేసరికి జరుగుతున్న దానికి పోలికే లేదు. 18 ఏళ్లు దాటిన వారికి టీకా అనేది మాటల్లో తప్ప ఆచరణలో సాధ్యం కాదని చాలా రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటించాయి. ఇండియా వాక్సిన్ల తయారీలో ఒకప్పుడు అగ్రస్థానమలంకరించింది. అయితే ప్రభుత్వ ఫార్మా రంగాన్ని చేజేతులా దెబ్బతీసుకోవడంతో మన దేశం కూడా ప్రైవేటు చేతుల్లోనే చిక్కుకుపోయింది.

రాష్ట్రాల్లో పాక్షిక ఆంక్షలు, కర్ఫ్యూలు, కొన్నిచోట్ల లాక్‌డౌన్ల వంటివి కూడా అమల్లోకి వస్తుంటే రాకపోకలు మళ్లీ సమస్యగా మారుతున్నాయి. వలస కార్మికుల సమస్య వంటివి పునరావృతమవుతున్నాయి. ఆస్పత్రుల్లో పడకలు, చికిత్స, అన్నిటినీ మించి ఆక్సిజన్ అరకొరగా ఉంటే ... ఖర్చులు మాత్రం విపరీతంగా మండిపోతున్నాయి. కేంద్రం గతంలో చేసిన సాయం కూడా ఇప్పుడు చేయడం లేదు. ఆఖరుకు ఈ వైరస్‌పై పోరాడటానికి కీలకమైన డేటా కూడా సరిగా అందుబాటులో లేదు.

రెమిడిస్‌వేర్ వంటి మందులు గాని వాక్సిన్లుగాని పూర్తిగా ప్రైవేటు రంగంలోనే వుండిపోయాయి. ప్రైవేటును ప్రోత్సహించవచ్చుగాని ప్రాణరక్షణకు సంబంధించిన వైద్య, ఔషధ రంగాలు కూడా వారి చేతుల్లో పెడితే పేద, మధ్య తరగతి వారి ఆరోగ్యానికి భరోసా వుండదు. మాస్కులు, శానిటైజర్ల వంటివాటి విషయంలోనూ పెద్ద మార్పు వచ్చింది లేదు. ప్రజారోగ్యం ప్రథమం అన్న వాతావరణం మారిపోవడం ఇందుకు మూల కారణం. ఇదిగాక కుంభమేళాల వంటివి కూడా మత రాజకీయాలతో మరింత తీవ్ర సమస్యగా మారుతున్నాయి. గత ఏడాది మర్కజ్ అనుభవం మరుగునపడిపోవడం ఆశ్చర్యమే. ఎన్నికల ప్రక్రియ కూడా ప్రజలు గుమికూడటానికి కారణమవుతున్నది. ఒక దశలో విజయవంతంగానే కోవిడ్‌ను ఎదుర్కొన్నట్టు చెప్పుకున్న దేశం తృటిలో మళ్లీ విపత్కర దశకు చేరుతుంటే పాలకులపై దేశ ప్రజలు నిజంగా నమ్మకం పెట్టుకోగల స్థితి లేకుండా పోయింది. వూరికే భయపెట్టవద్దనే మాట నిజమే. ప్రజలు మరింత అప్రమత్తంగా నిబంధనలు పాటించాలన్న మాట కూడానిజమే. కాని అన్నిటికంటే ముఖ్యమైంది సమగ్ర విధానం, సహాయ సంక్షేమ కార్యక్రమాలు. ■

ప్రధాన సంపాదకుడు
తెలకపల్లి రవి
వర్కింగ్ ఎడిటర్
సత్యాజీ

సంపాదకవర్గం
కె.సత్యరంజన్
కెంగార మోహన్ ◆ వొరప్రసాద్
మేనేజర్ : కె.లక్ష్మయ్య

బొమ్మలు
తుంబలి శివాజి
చిదంబరం

Owned, Printed and Published by **V. Krishnaiah** 41-9 -16, 1st Floor, F-3, Ramalayam Street, Near Kalpana Prints, Krishna Lanka, Vijayawada (Urban) - 520013, Krishna District. Andhrapradesh. Printed at Sri Chaitanya Offset Printers, 29-7-36, Vishnuvardhan Rao Street, Suryaraopet, Vijayawada - 520 002, Andhrapradesh. Published at 27-30-4, M.B.Vignanakendram, 3rd Floor, Akulavari Veedhi, Governorpet, Vijayawada - 520 001, Andhrapradesh. Editor : Telakapalli Ravi

## కథలు

సుమనోహరం – యాళ్ల రాజేష్ ............5
నాన్న అప్పు – అనువాద కథ : జిల్లేళ్ల బాలాజీ...26
అతడు – మణి వడ్లమాని .........................36
ముత్యాల దారం – ఎంఆర్ అరుణకుమారి ....... 48

## కవితలు

అక్కడో బడి ఉండేది – సాంబమూర్తి లండ ........... 11
నీడ ... ఏటూరి నాగేంద్రరావు ........................... 14
నానీలు ... డా.ఎ.ఎ నాగేంద్ర, ఒంటరితనం .. వల్లభాపురం జనార్దన 18
మాటల తూటాలు – డా. జడా సుబ్బారావు ............ 21
నీడలు – సిరికి స్వామినాయుడు ..................... 22
ప్రశ్నల సవ్వడి – పద్మావతి రాంభక్త ................. 31
అంకురోదయం – కంచరాన భుజంగరావు ............ 35
మృత్యుఘోష – చిన్ని నారాయణ రావు ..... 39
ద్రవిద్దాం రా! – కవితాశ్రీ .......................... 40
అమ్మ – రవి నన్నపనేని ........................ 43
దేశానికి ఊపిరి ఆడట్లేదు – సృజన ..................... 47
ప్రజాస్వాహేయం – డాక్టర్ పళని ..................... 54
శ్మశానాల ప్రయివేటీకరణకు ప్రకటన – రత్నాల బాలకృష్ణ 55
తల్లివంటే నువ్వు ... – అనువాద : పి శ్రీనివాస్ గౌడ్ ....... 58
ఉక్కు సంకల్పం – వసుమర్తి పద్మజావాణి................ 61

## వ్యాసాలు

సాహిత్య ప్రస్థానం ఏప్రిల్ 2021 పురస్కారాలు ......... 8
ఒక స్వయం ప్రకటిత రెబెల్ కథ – తె.ర .............. 9
ప్రజా జీవితమే సరైన 'పాట'శాల
– సత్యరంజన్ ............................ 12
నవ సినిమా వైతాళికుడు సత్యజిత్ రాయ్
– బాలాజీ కోల్‌కతా ........................15
ఎంవి రమణారెడ్డి టూకీగా ప్రపంచ చరిత్ర
– తెలకపల్లి రవి ........................... 19
చంద్ర స్మరణం : కసికొద్దీ కుంచె పట్టాను ............23
గొంతెండిన సీమ కథలు – కెంగార మోహన్ .. .... 32
సామాజిక పరిణామాల సాక్షి యారాడకొండ
– ఎంవిఎస్ శర్మ ......................... 41
కాటమరాజు కథలు : 3వ సంపుటం
– డా. తోట వెంకటస్వామి .................44
చైతన్య తారకలు నాగావళి నానీలు – ఎం పద్మజ ... 51
వర్తమానం : సోషల్ మీడియా గొంతు నొక్కే యత్నం ...52
మలయాళ సమాజంలో రచయితలకు అపార గౌరవం ...56
మాటకు పట్టం కట్టిన దీర్ఘ కవిత – మోహనరావు ..... 59
ప్రపంచీకరణపై విమర్శ ఖడ్గం – ఎ రవీంద్రబాబు ....62
కఠిన సత్యాల కౌలూరి నానీలు – ఎమ్వీ రామిరెడ్డి ....65

ISSN No: 2581 - 7477
**సాహిత్య ప్రస్థానం మాసపత్రికను ప్రోత్సహించండి. తెలుగు భాష, సాహిత్య వికాసాలకు మీరూ తోడ్పడండి !**
:: రచనలు, చందాలు, విరాళాలు, మనీ ఆర్డర్లు, చెక్కులు, డిడిలు పంపవలసిన చిరునామా ::
సాహిత్య ప్రస్థానం, ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ, తాడేపల్లి - 522501, గుంటూరు జిల్లా. ,
ఫోన్ : 0866-2577248, చందా వివరాలకు : 94900 99057, రచనలకు : 94900 99167
ఇ-మెయిల్ : ssprasthanam@gmail.com, వెబ్‌సైట్ : www.prasthanam.com
1 సంవత్సర చందా రూ. 240 ◆ 5 సంవత్సరాల చందా రూ.1000 ◆ 10 సంవత్సరాల చందా రూ. 2000
Bank A/c Details: A/c Name: PRASTHANAM, SBI, Governorpet, Vijayawada. A/c No. 52001500585, IFSC: SBIN0020343. చెక్కులు, డిడిలపై prasthanam అని రాయగలరు.

# సుమనోహరం



- యాళ్లరాజేష్
97004 67675

ఎత్తుగా పేరుకుని ఉన్న చెక్కుల వరుసను విసుగ్గా చూశాడు రమేష్. తల పైకెత్తి చూస్తే ఎదురుగా ఎత్తైన నోట్ల కట్టలు, ఆ వెనుకే ఇంకా డబ్బులు కట్టడానికి నించున్న మనుషుల తలకాయల వరుస మరింత అసహనాన్ని కలిగించాయి.

ఎంత అసహనం ఉన్నా నిస్సహాయుడే తను. తన క్యాష్ కౌంటర్ పక్కగా ఆఫీసర్ చెక్కుల్ని, పాస్ తను డబ్బులను కట్టించుకుని ఇస్తోన్న చలానాలను పాస్ చేసి సంతకాలు పెడుతూ ఊపిరి సలపనంత వత్తిడిలో ఉన్నాడు. అతనికి అవతలి పక్కగా ఉన్న మరో క్లర్క్ శరత్ కూడా బిజీగా ఉన్నాడు. నెల ప్రారంభంతో పాటు సోమవారం కూడా కావడంతో చాలా రద్దీగా ఉంది. తన పని తనే చేసుకోవాలి తప్ప ఎవ్వరూ సాయం రారు. జీతం తీసుకుంటున్నాడు కాబట్టి ఎంత పనైనా చెయ్యక తప్పదు. మనసులోనే రుసరుసలాడుతూ గట్టిగా ఊపిరి పీల్చుకుని, పనిలో తిరిగి నిమగ్నమయ్యాడు రమేష్. మరో రెండుగంటల తర్వాత కానీ రద్దీ నిమ్మళించలేదు.

'హమ్మయ్య!' అనుకుంటూ సీటులోనుంచి లేవబోతూండగా "రమేష్ గారూ, చిన్న రిసీట్ తీసుకోండి." అంటూ కౌంటర్ అవతల నుంచి అభ్యర్థించాడు ఒకాయన.

మనోహర్!

సుమారు ఏభై అయిదేళ్ల వయసులో ముడతలు పడిన ముఖం, అలసిపోయినట్టున్న కళ్లు, ఎంత విసుక్కున్నా కూడా బదులేమీ చెప్పని ఓర్పుతో ఉండే రోజూ చూసే ముఖమే అతనిది!

'వచ్చాడ్రా బాబూ!' అనుకుంటూ కోపంగా అతని వైపు చూస్తూ, "మీరెప్పుడూ ఇక్కడే ఉంటారుగా! ఒక్క నిమిషం ఆగండి మనోహర్ గారూ!" గొంతు పెద్దదిగా చేసి చెప్పాడు రమేష్.

రమేష్ కోపాన్ని పట్టించుకోకుండా చిరునవ్వుతో చెప్పాడు మనోహర్. "మొదటివారం కదా, బిజీగానే ఉంటుందిలెండి. కూర్చుంటాను." రమేష్‌కి ఎదురుగా ఉన్న కుర్చీలో కూర్చున్నాడు మనోహర్.

పక్కనే ఉన్న మంచినీళ్ల సీసా అందుకుని, గటగటా సగం ఖాళీ చేసి, తన సీట్లోనుంచి లేచి, తలుపు గడియ గట్టిగా బిగించి, శరత్ దగ్గరకు వెళ్లి, "ఇవాళ అదిరిపోతోంది బాస్, కౌంటర్!" అన్నాడు.

"అవును బాస్, చూడు అన్ని పనులూ ఇక్కడే! మనకి సరిపడా స్టాఫ్‌నెప్పుడిస్తారో?" వాపోయాడు శరత్.

"హైదరాబాద్‌లో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీస్‌లో హాయిగా పనిచేసుకునేవాడిని. మా సొంతూరికి దగ్గరని నేరకపోయి వచ్చాను కానీ ఈ బ్రాంచ్‌లో సుఖం లేదు బాసూ! ఆ మాటకొస్తే మన బ్యాంక్ జాబ్‌లోనే సుఖం లేదు. అదుగో జనం వచ్చేస్తున్నారు! మన రోజువారీ తిష్టాసురుడు కూడా కూర్చున్నాడు చూశావా?" విసుగ్గా అడిగాడు రమేష్.

"అవును బాస్! నీ దగ్గర క్యాష్ కట్టాక నేను చెయ్యాల్సిన ఆన్లైన్ ట్రాన్స్ఫర్లిచ్చేశాడు ఆల్రెడీ!" నవ్వాడు శరత్.

"ఇంట్లో పనేం ఉండదనుకుంటాను ఇక్కడికొచ్చి మన ప్రాణాలు తోడేస్తాడీయన!" తిరిగి తన క్యాష్ కౌంటర్లోకి నడిచాడు రమేష్.

కౌంటర్ ముందు నించున్న అతన్ని కొంచెం పక్కకు తప్పుకోమన్నట్టు సైగ చేస్తూ మనోహర్‌ని రమ్మని పిలిచాడు రమేష్. "ఇలా రోజూ బ్యాంకుకొచ్చి డబ్బులు కట్టే బదులు ఆన్లైన్లో ట్రాన్స్ఫర్ చేసుకోవచ్చు కదండీ?" రోజూ అనే మాటే చెప్పాడు రమేష్.

"ఇలా అలవాటైపోయింది బాబూ!" సౌమ్యంగా నవ్వుతూ చెప్పాడు మనోహర్.

'నీ అలవాటు మండిపోనూ!' అని మనసులో తిట్టుకుంటూ మనోహర్ కట్టిన చలానాని పక్కకు జరిపాడు రమేష్.

ఆ తరవాత కూడా రోజంతా రద్దీగానే ఉంది. సాయంత్రం అలసిపోయి ఇంటికి చేరుకున్నాడు.

"ఇంటిగలాయన మీకేమైనా ఫోన్ చేశారా?" కాఫీ అందిస్తూ అడిగింది అతని భార్య పల్లవి.

"లేదే! అద్దె పెంచుతున్నాడా?" కాఫీ తాగడం ఆపి అడిగాడు రమేష్.

"ఉహూ... వాళ్ల అబ్బాయి వాళ్లు ట్రాన్స్ఫర్ అయ్యి వస్తున్నారట. అందుకని మనం వచ్చే నెలకల్లా ఇల్లు ఖాళీ చేసేయాలి అని చెప్పాడు." చల్లగా విషయం చెప్పింది.

"మళ్ళీ ఇల్లు మారాలా? వచ్చిన రెండున్నర ఏళ్లలో మనం మారిన మూడో ఇల్లిది. హమ్మయ్య ఏడాది గడిచింది కదా అనుకుంటే అప్పుడే ఖాళీ చెయ్యమంటున్నాడు ఓనర్. అద్దె పెంచడానికి ఇదో వంకై ఉంటుంది." విసుగ్గా అన్నాడు రమేష్.

"నిజమే అయి ఉంటుందేమోలెండి. మిగతావాళ్లకన్నా ఈయన కొంచెం మంచి వాడే కదా! ఇంతవరకూ అద్దె పెంచలేదు." చెప్పింది పల్లవి.

"సరేలే... రేపటినుంచీ మళ్లీ ఇళ్ల వేటలో పడాలి. అక్కడేమో బ్యాంక్‌లో సున్నంలోకి ఎముకల్లేకుండా ఏరేస్తున్నారు." ఖాళీ చేసిన కాఫీ కప్పును సాసర్లో పెడుతూ నిట్టూర్చాడు.

×××

మరో వారం రోజుల తర్వాత ...

క్లియరింగ్ హౌస్‌లో ఒకరోజు డ్యూటీ వేయడంతో ఒక చెక్కుకు సంబంధించిన విషయం కోసం మరో బ్యాంక్‌కి వెళ్ళాల్సి వచ్చింది రమేష్‌కి. పని పూర్తి చేసుకుని, కౌంటర్ల ముందుంచి నడుస్తోంటే, "నమస్తే రమేష్ గారూ!" అన్న పిలుపు వినపడింది. క్యాష్ కౌంటర్‌కి ఎదురుగా కుర్చీలోనుంచి లేచిన మనోహర్ నవ్వుతూ కనిపించాడు.

"ఏంటీ ఈ బ్యాంక్‌ని కూడా వదలరా మీరు?" పైకి ముఖం మీద నవ్వును బలవంతంగా పూసుకున్నా వెటకారాన్ని మాత్రం వదిలేశాడు రమేష్.

"అవునండీ, ఇక్కడా ఎకౌంట్ ఒకటి ఉంది. అప్పుడప్పుడు వస్తూ ఉంటాను." చెరగని చిరునవ్వుతో జవాబిచ్చాడు మనోహర్.

"సరే. ఉంటాను." ముక్తసరిగా చెప్పి ముందుకు కదిలాడు రమేష్.

"రేపు బ్రాంచ్‌కి వస్తారా?" వెనుకే మనోహర్ వేసిన ప్రశ్నను పట్టించుకోలేదు రమేష్, ఎప్పటిలా విసుగ్గా!

ఆ సాయంత్రం ఇంటికెళుతూనే ఆత్రుతగా అడిగింది పల్లవి. "ఇల్లు దొరికిందా?"

"మనకి దగ్గర్లో ఎక్కడా లేవు. రేపు బ్యాంకు వెనుక ఉన్న కాలనీలో వెదకాలి. ఇవాళ వేరే బ్యాంక్‌కి వెళ్లడంతో లేటైపోయింది." చెప్పాడు కాఫీ అందుకుంటూ.

మరో పది రోజులు గడిచాయి. నెల మధ్యలో కావడంతో కొంచెం తీరుబడి దొరుకుతోంది రమేష్‌కి.

"మీ ఇంటి దగ్గరేమైనా ఇళ్లు ఖాళీ ఉన్నాయా బాస్? మా కాలనీలో చూశాను కానీ దొరకలేదు." శరత్ సీటు దగ్గరికి వెళ్లి అడిగాడు.

"అలాగే బాస్ చెప్తాను. లేదంటే సాయంత్రం మా ఇంటివైపొస్తే ఇద్దరం కలిసి వెతుకుదాం." చెప్పాడు శరత్.

"ఎంతమంది ఉంటారు బాబూ?" అవతలినుంచి వినపడిన ప్రశ్నకు ఇద్దరూ అటు చూశారు. మనోహర్!

ఇద్దరూ ముఖాలు చిట్లించారు.

"ఇద్దరం." ముక్తసరిగా చెప్పాడు రమేష్.

"మన బ్యాంక్ ఎదురుగా ఉన్న వీధిలో కుడివైపు మూడో ఇల్లు మాది. కింద నా షాపు. మధ్యలో మేముంటున్నాం. రెండో అంతస్తు ఖాళీగా ఉంది. సాయంత్రం వస్తే చూపిస్తాను." మనోహర్ మాటలకు అయిష్టంగానే తలూపాడు రమేష్.

ఆ సాయంత్రం మనోహర్ ఇంటికి వెళ్లాలనుకుంటూ బ్యాంక్‌లోనుంచి అడుగు బైట పడగానే కారిడార్లో నవ్వుతూ కనిపించాడు మనోహర్. అతన్ని అనుసరించాడు రమేష్.

"రండి రమేష్ గారూ...!" తాళం తీసి రెండు తలుపులూ తెరిచాడు మనోహర్.

విశాలమైన హాలు, రెండు బెడ్‌రూములతో పొందికగా ఉంది ఇల్లు. వెంటనే దిగిపోవాలన్నంతగా నచ్చింది రమేష్‌కి.

అంతలోనే 'అద్దె కూడా గట్టిగానే ఉంటుంది!' అంటూ అంతరాత్మ హెచ్చరిస్తుండగా, "అద్దె ఎంతండీ?" బెరుకుగా అడిగాడు.

"ఎనిమిది వేలు బాబూ!" నెమ్మదిగా చెప్పిన మనోహర్ జవాబుకి ఆశ్చర్యపోయాడు రమేష్. ఇప్పుడు తను ఇస్తోన్న ఇంటి అద్దె పదివేలు!

"మా మెయింటెనెన్స్‌కొస్తే చాలు బాబూ... చాలాకాలం నుంచి ఇల్లు ఖాళీగానే ఉంచాం. ఈ మధ్య నా బిజినెస్ పెద్దగా నడవడం లేదు... అందుకని." చెప్పాడు మనోహర్.

బంపర్ ఆఫర్‌కి సంతోషపడుతూ "అడ్వాన్స్ రెండు నెలలకివ్వమంటారా? రేపు ఇవ్వొచ్చునా? లేదంటే ఇప్పుడే ఏటీయంలో తీసి ఇస్తాను." ఆత్రుతగా చెప్పాడు రమేష్.

"తొందరేమీ లేదు బాబూ! వేరే ఎవరికీ ఇవ్వను." నవ్వుతూ హామీ ఇచ్చాడు మనోహర్.

సగం మెట్లు దిగాక, "రండి బాబూ, కొంచెం కాఫీ తీసుకుని వెళ్లండి." ఇంట్లోకి పిలిచాడు మనోహర్.

"నమస్తే బాబూ కూర్చోండి." అంటూ ఆహ్వానించింది మనోహర్ భార్య. మొహమాటంగానే ఇంట్లోకి ప్రవేశించాడు రమేష్.

ఎప్పుడు చెప్పాడో తెలీదు కానీ మనోహర్ భార్య అతని కోసం స్వీటూ హాటూ టీపాయ్ మీద పెట్టి సిద్ధంగా ఉంచింది.

''మంచినీళ్ళు తాగుతారా?'' సోఫాలో కూర్చున్నాక అడిగిందామె.

వద్దన్నట్టుగా తల ఊపాడు రమేష్.

"తీసుకోండి. మొహమాటపడకండి. మంచినీళ్లు తెస్తాను." ప్లేటును అతనికందిస్తూ లోపలికి వెళ్లింది ఆమె.

రమేష్ నెమ్మదిగా అవి తింటూంటే నవ్వుతూ అతని వైపు చూస్తున్నాడు మనోహర్. యథాలాపంగా లోపలి గుమ్మం వైపు చూశాడు రమేష్. ఎదురుగా ఒక యువకుడి ఫొటో... దానికి వేళ్లాడదీసి ఉన్న దండ! ఇంచుమించుగా తన వయసులోనే అతను చనిపోయాడన్న విషయం చదివి, "అయ్యో!" అని బాధ పడ్డాడు రమేష్.

"మీ అబ్బాయా? ఎక్కడ పనిచేసేవాడు?" బాధగా అడిగాడు రమేష్.

"మన బ్యాంక్‌లోనే బాబూ! ఒకరోజు ఇంటికి నడిచి వస్తోండగా లారీ గుద్దేసింది." మంచినీళ్ల గ్లాసును టీపాయ్ మీద పెడుతూ చెప్పింది మనోహర్ భార్య.

"అయ్యో చాలా దురదృష్టం." మెల్లగా అన్నాడు రమేష్.

"అవును బాబూ... దురదృష్టవంతులమే! ఉన్న ఒక్కగానొక్క కొడుకునూ పోగొట్టుకున్నాం. అతను కూడా నీలానే క్యాషియర్‌గా పనిచేసేవాడు. నువ్వు గమనించావో లేదో కానీ మా అబ్బాయికీ నీకూ కొన్ని పోలికలున్నాయి బాబూ! అందుకే ఏదో ఒక వంక పెట్టుకుని బ్యాంక్‌కొస్తారు. నీ ఎదురుగా కూర్చుంటారు. నువ్వు రాకపోతే ఆరోజంతా ఆయనకు ఏదో పోగొట్టుకున్నట్టే ఉంటుంది. నీవు రాక మునుపు వేరే బ్యాంక్‌కి వెళ్లి అక్కడ క్యాషియర్‌ని చూస్తూ కూర్చునేవారు." బంగారు పోయిన గొంతుతో చెప్పిందావిడ.

"ఫాస్ట్ మనీ బ్యాంక్?!" ఆ బ్యాంక్‌లో ఒకరోజు తనకు మనోహర్ కనిపించిన విషయం గుర్తు చేసుకుంటూ అడిగాడు రమేష్.

"అవును బాబూ అదే!" ఆమె సమాధానం ఇచ్చింది.

"ఇది వరకు చాలాసార్లు మిమ్మల్ని 'బాబూ ఏంటీ? రమేష్ గారూ అని పిలవండి!' అని విసుక్కున్నాను. నన్ను మన్నించగలరా ప్లీజ్?!" రెండు చేతులూ జోడించి అడిగాడు రమేష్.

అతని కన్నుల్లో కన్నీరు!

"అబ్బే అదేమీ లేదు బాబూ! నాకు నీ మీద అసలు కోపం రాదు. పైగా రేపటినుంచీ నువ్వు మా దగ్గరే ఉంటావుగా?!" చిన్న పిల్లాడిలా నవ్వాడు మనోహర్. ఆ నవ్వు రమేష్‌కిప్పుడు సుమనోహరంగా కనపడుతోంది! ■



**కొన్ని పుస్తకాలు పైపైన చదవాలి. కొన్నింటిని నిశితంగా పరిశీలించి మరీ చదవాలి. కొన్నింటిని నిశితంగా శ్రద్ధగా చదవడంతో పాటు జీర్ణించుకోవాలి.**
**- ప్రఖ్యాత రచయిత బేకన్**

## సాహిత్య ప్రస్థానం ఏప్రిల్ 2021 పురస్కారాలు

**నిజ జీవితాలకు అద్దం పట్టిన కథలు**

*విమర్శకు రూ.500*

వ్యాసకర్త : **కేశవ్, కోల్కతా**

**మానసం**

*కథకు రూ.500*

రచయిత: **కేశిరాజు వెంకట వరదయ్య**

■■■

*కథకు కర్లపాలెం రుక్మిణమ్మ పురస్కారం*

*సాహిత్య విమర్శకు డా॥ ఎద్దుల సిద్ధారెడ్డి స్మారక పురస్కారం చెక్కులు ఈ రచయితలకు అందుతాయి*

■■■

*పాఠకులు తాము చదివిన కవితలు, కథలు, వ్యాసాల్లో నచ్చినవి కారణాలతో సూచించవచ్చు. సీనియర్, ప్రసిద్ధ రచయితల రచనలు కాక ఔత్సాహికులను, ఇటీవల రాస్తున్నవారిని ప్రోత్సహించడమే ఈ పురస్కారాల ఉద్దేశంగా గ్రహించగలరు. తగిన రచనలు లేనప్పుడు పురస్కారాలు ప్రకటించబడవు.*

**- ఎడిటర్**

# విరసంపై నిషేధానికి ఖండన

విప్లవ రచయితల సంఘం (విరసం) సహా 16 ప్రజా సంఘాలను చట్టవ్యతిరేక సంస్థలుగా తెలంగాణ ప్రభుత్వం ప్రకటించడాన్ని విరసం తెలుగు రాష్ట్రాల కమిటీ తీవ్రంగా ఖండించింది. 'రాజ్యాంగంలోని భావ ప్రకటనా స్వేచ్ఛకు, రాజకీయ స్వేచ్ఛకు, సంఘం పెట్టుకొనే హక్కు వ్యతిరేకంగా తెలంగాణ ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నది.' అని పేర్కొంది. తెలంగాణ ప్రజాభద్రతా చట్టం – 1992 ప్రకారం ఈ సంస్థలను చట్ట వ్యతిరేక సంస్థలుగా ప్రకటిస్తున్నానని చెప్పుకున్న ప్రభుత్వం ఆ చట్టం ప్రకారమే పాటించాల్సిన పద్ధతులను ఉల్లంఘించిందని విమర్శించింది. 'చట్ట వ్యతిరేక సంస్థలుగా ఎందుకు ప్రకటించదల్చుకున్నదీ ముందు ఆ సంఘాల బాధ్యులకు తెలియజేయాలి. ప్రభుత్వ ఆరోపణలపై ఆ సంస్థలు తమ వాదనలను, అభ్యంతరాలను వినిపించడానికి ఒక విచారణ కమిటీని హైకోర్టు న్యాయమూర్తులతో ఏర్పాటు చేయాలి. వాదోపవాదాలు జరిగాక ఆ కమిటీ నిర్ధారిస్తేనే చట్టవ్యతిరేక సంస్థలవుతాయి. ఈ మొత్తానికి చట్టం ప్రకారమే మూడు నెలల గడువు ఉంది. అంతేగాని ప్రభువుల వారికి కోపం వచ్చినంత మాత్రాన ప్రజా సంఘాలు చట్ట వ్యతిరేక సంస్థలైపోవు.' అని తెలిపింది. భిన్నాభిప్రాయాలు గల సంస్థలను చట్టవ్యతిరేకమని అనడం రాజ్యాంగ స్ఫూర్తికి వ్యతిరేకమని పేర్కొంది. ఈ నిషేధ ఉత్తర్వులను కూడా ప్రజలు, ప్రగతిశీల మేధావులు, రచయితల మద్దతుతో ఎదుర్కొంటామని, ఈ ఉత్తర్వుల్లోని ఆరోపణలు ఎంత ప్రమాదకరమో సమాజం ఆలోచించాలని, కుట్రపూరిత చట్టవ్యతిరేక ప్రభుత్వ చర్యలను ఖండించాలని కోరింది.

### నిషేధాన్ని వెంటనే ఎత్తేయాలి

విరసంపై ఏడాదిపాటు నిషేధం విధించడాన్ని తెలంగాణ సాహితి అధ్యక్షులు వల్లభాపురం జనార్ధన్, కార్యదర్శి కె ఆనందాచారి ఖండించారు. సాహితీ స్రవంతి రాష్ట్ర కమిటీ తెలంగాణా ప్రభుత్వ చర్యను తీవ్రంగా ఖండించింది. భావస్వేచ్ఛ హక్కును నిరాకరించడం ప్రజాస్వామ్య విధానాలకు పూర్తిగా విరుద్ధమని విమర్శించింది. రచయితలకు, సృజనకారులకు ఉన్న స్వేచ్ఛను అణచివేయడం సరైన చర్య కాదని, విరసంపై నిషేధాన్ని వెంటనే తొలగించాలని డిమాండ్ చేసింది.

# కొత్త పొద్దు

**క**రుదు గట్టిన గ్రీష్మ ప్రతాపంలోనూ
కమ్మని కోయిల గానం
గాయపడ్డ కాయపు అణువుల్లో దూరి
మదనపడుతున్న మనసుకు
మందులావనిచేస్తూ..
కూలుతున్న ఆశల సౌధాలను
కుదురుగా నిలబెడుతున్నట్లు ...
రాలిన ఆకుల కుదుళ్ళలో
రాజుకుంటున్న లేత చిగురుల సోయగం
చెదిరిన కలలకు మళ్ళీ రూపం ఇస్తూ...
ముసిరిన చీకట్లను విసిరే తెగువ
నరనరాలలో పాకి
పడిలేచిన అడుగులకు ప్రాణం పోసినట్లు

నల్లని గొంగళి పురుగులు ఒళ్ళు విరుచుకొని
రంగుల సీతాకోక చిలుకలై ఎగురుతూ....
అవహేళనల్లో ఆకలి మంటల్లో రగిలిన
అధోజగతి బతుకులకు అర్థం వివరించినట్లు

అస్తమించే సూర్యుడు రేపే చీకటి అలజడి
రేపటి పొద్దుతో తొలగుతుందని తెలిసిందే కదా
అదిగో చీకటిని చీల్చుతూ మిణుగురు ఉరకలు
వేస్తుంది
బతుకు మీది భరోసాతో...

**- గన్ రెడ్డి ఆదిరెడ్డి**
**94947 89 731**

## పరామర్శ

# ఒక స్వయం ప్రకటిత రెబెల్ కథ




- తె.ర

రెబెల్ అంటే రాజకీయంగా సామాజికంగా తిరుగుబాటుదారుడు కావచ్చు. వ్యక్తిగత జీవితంలోనూ వ్యవస్థిత విలువలు ఆమోదించలేక ఎదురుతిరిగే వ్యక్తి కావచ్చు. ఈ అర్థాలన్నీ దృష్టిలో పెట్టుకునే హెచ్చార్కె తన ఆత్మకథాత్మక నవలకు రెబెల్ అని పేరు పెట్టుకున్నారు. నవల అని తనే వర్ణన ఇచ్చినా ఆత్మకథ అనడం ఎందుకంటే ఆత్మకు తప్ప తెలియని అత్యంత అంతర్గత విషయాలతో ఈ నవల నిండివుంది కాబట్టి. ఆ సమస్యను అధిగమించడానికే హెచ్చార్కె ఒక చిన్న ముందుమాట రాసి, ఈ నవలా నాయకుడైన పవన్ కుమార్ అమెరికాలో తనకు ఇవన్నీ చెప్పినట్టు రాసి రాత ప్రారంభించారు. గతంలో పివి నరసింహారావు ఇన్‌సైడర్ పేరిట తన గురించి తాను రాసుకున్నది మనకు తెలుసు గాని ఇంకా చాలా మంది ఆ పనిచేశారు. కాకుంటే ఇక్కడ రచయిత తన భావుకతనూ, సందిగ్ధ సన్నివేశాలనూ, సంఘర్షణనూ, శృంగార భావనలనూ కూడా ఆ పాత్రలో పలికించారు గనక ఆత్మకథగా చూడటమే బెటర్.

సీనియర్ కవిగా, రచయితగా, పాత్రికేయుడుగా సుపరిచితుడైన హెచ్చార్కె కర్నూలు జిల్లా గనిలో పుట్టి బాధామయ అనుభవాల మధ్య పెరిగాడు. ఈ నవలలో పవన్ కుమార్ కూడా. తల్లిపై తండ్రి గృహహింసను చూసి చూసి భయంలోనే పెరిగాడు. భయం తన మాతృదేవత అంటాడు. భయమే అతడిని నడిపించింది. భయమే చదివించింది. రాయించింది. ఉద్యోగాల్లో చేర్పించింది. రాజీనామాలు చేయించింది అంటాడు. బళ్లో బ్రాహ్మణ పంతుళ్ల అవహేళనల మధ్య స్వీయాభిలాషతో భాష సాహిత్యం నేర్చుకున్నాడు. విజయవాడ లయోలా కాలేజీ, విశాఖ ఆంధ్రా యూనివర్సిటీలలో చదువుకుంటూ ఒక ఎంఎల్ పార్టీ లేదా నక్సలైట్ గ్రూపు రాజకీయాల వైపు ఆకర్షితుడయ్యాడు. విరసం చర్చల్లో పాల్గొని వివశు డయ్యాడు. అదే భావజాలం గల విజయను పెళ్లి చేసుకున్నాడు. పిడిఎస్‌యులో పనిచేస్తూ ఎమర్జన్సీలో అరెస్టయ్యాడు. బయటకు వచ్చాక ఏదో పత్రికలో చేరబోయి తమ పార్టీ నాయకుడి పిలుపుపై విమోచన పక్షపత్రిక బాధ్యత తీసుకున్నాడు. నిబద్ధత అనే మాట ఆయనకు పెద్దగా సరిపడదు గనక నిజాయితీగా పనిచేశాడు. ఒక దశలో ఇతర బాధ్యతలు నిర్వహించడానికీ ప్రయత్నించాడు. చివరకు వారి అభిప్రాయాలతో కలసి ప్రయాణించలేనని నిర్ణయించుకున్నాక భార్యాభర్తలు అదే విషయం లేఖ రాసి బయటకు వచ్చారు. వచ్చాక ఉదయంలో మొదట చేరి ఏడాది తర్వాత ఈనాడులో సీనియర్‌గా ప్రవేశించారు. ఆ సమయంలో చైర్మన్ రామోజీ ఆయనను అడిగారు, "ఇంతకాలం ఎందుకు రాలేదు" అని. "మీకు నక్సలైట్‌లంటే అలెర్జీ అని విన్నాను గనక రాలేదని, ఇప్పుడు ఉదయం నుంచి వచ్చానని చెప్పి నవ్వించాడు.

అలా ఈనాడులో ఒక పుష్కరకాలంపైగా పనిచేశాక తను వేరే రచనలు చేసుకోవడానికి అక్కడ బత్తిగా అవకాశం లేకపోవడంతో రాజీనామా చేశారు. బాల్యం, పార్టీ, తదుపరి అని తన జీవితంలో మూడు దశలను వర్ణిస్తాడు పవన్‌కుమార్ నవలలో. అదే ఇంకా నడుస్తుందంటాడు.

స్థూలమైన ఈ కథను నవల కాని నవలలో హెచ్చార్కె ఎంతో భావుకతతో చెప్పుకొచ్చారు. పల్లెల్లో కులతత్వాలు, కుటుంబాల్లో ప్రత్యక్ష పరోక్ష హింస, వెంటాడే బ్రాహ్మణీయ ఛాందసాలు, కులపరమైన అహంభావాలు, దురభిప్రాయాలు, స్థానిక తగాదాలు, వదలని పేదరికం, వెంటాడే వివక్ష, ఎడతెగని ఎదురీత బాల్యాన్ని ఆవరించగా ఎలా బయటపడ్డాడో, అందుకు దోహదం చేసిన వ్యక్తులు శక్తులేమిటో చెబుతాడు. కుటుంబంలోనూ బయట కూడా మనుషుల ప్రవర్తనను పరివర్తన చేసే పరిపూర్ణం చేసే అంశాలేమిటో ఎలా పనిచేస్తాయో వివరిస్తాడు. అమ్మతో కుళ్లుమోతు వెధవ అనిపించుకుని, తనను తాను చారిత్రిక అనాథ అనుకున్న పవన్ కుమార్ తనను ఎవరో దొంగతనం చేస్తారని గాక తానెక్కడ దొంగతనం చేసి దొరికిపోతానోనే ఆందోళనతో సాగించిన అనంత ఘర్షణ ఈ కథ. నవలగా రాశారు గనక అనేక చోట్ల మంచి వర్ణనలు, వెంటాడే వాక్యాలు చూస్తాం. అమ్మలు ఎంత ప్రేమ మూర్తులో అంత నిస్సహాయులు, జీవితంలో ఎప్పుడూ అవసరమైన దానికన్నా ఉన్నతమైన ధ్యేయం పెట్టుకోవాలి, వాగు అవతలి గట్టుకు చేరితే యుద్ధం ముగిసినట్టు, కల నిజం కలసిపోయే స్వప్న వాస్తవికత, పేదరికమే బలహీనత, తెలియకపోతేనే వూహలకు వీలు, సముద్రం గొప్పవక్త, శ్రోత, ప్రశ్న కూడా. ఇలాటి మంచి వాక్యాలతో పాటు అప్రధానమైన అంశాలు ఒకటి రెండు బూతులతో సహా రాశాడు.

మామూలుగా ఆత్మకథలు జీవిత కథల్లో సంఘటనలు, వ్యక్తులు ఎక్కువగా చూస్తాం. కాని ఈ పుస్తకంలో హెచ్చార్కె బాల్యం నుంచి ప్రౌఢ వయ:పరిపాకం వరకూ కలిగిన భావస్పందనలను, అవమానాలు అభిమానాలను, అనుభూతులను అధికంగా పొందుపర్చారు. వ్యక్తిత్వమే గాక మనస్తత్వం ఎలా మలచబడిందీ చెప్పారు. తనను ప్రభావితం చేసిన పుస్తకాల కథల నుంచి ప్రణయారాధన భావస్మృతుల వరకూ పూసగుచ్చినట్టు (చెప్పదలుచుకున్న మేరకు) రాసుకొచ్చారు. వొళ్లు మర్చిపోతే అందరూ కథకులే అంటాడు పవన్ కుమార్ ఒకచోట. ఒక మేరకు హెచ్చార్కె ఆ విధంగానే దీన్ని రాశాడని చెప్పాలి. విశాఖలోనూ, కర్నూలులోనూ, విరసంలోనూ తను కలుసుకున్న రచయితలు శ్రీశ్రీ, జ్వాలాముఖి, కాశీపతి ఇంకా చాలామంది గురించి రాశారు. కాని ఎవరినీ బేషరతుగా ఇష్టపడినట్టు కనిపించదు. తన రచనలకు కాళీపట్నం, కాశీపతి కూడా మార్గనిర్దేశనం చేయలేదనే ఫిర్యాదు ఉంటుంది. ఎన్నెస్ ప్రకాశరావు మరణంపై విచారం ఉంటుంది. కొంతమంది నక్సలైట్ నాయకులతో ముఖాముఖి సన్నివేశాలు, వారి ప్రభావాలు ప్రేరణలూ కూడా నమోదు చేశాడు. వాటిలో పెద్దపీట వేసి చాలా సానుభూతిగా రాసుకుంది చంద్రపుల్లారెడ్డి గురించి. జిల్లాలో ఎంఎల్ పార్టీ నేతల గురించి సానుకూలంగా, మరికొందరి గురించి ముక్తసరిగా రాసిన హెచ్చార్కె... సిపిఎం నాయకుడిని గురించి మాత్రం పేరు లేకుండా పెద్ద మనిషి అని సరిపెట్టడం యాదృచ్ఛికమేనా అనుకోవాలా? (ఎందుకంటే ఆయన ఆ జిల్లా కార్యదర్శి.) యూనివర్సిటీలో కూడా కమ్యూనిస్టులమని చెప్పుకునేవారి కన్నా ఆరెస్సెస్ అధ్యాపకులే తనకు ఎక్కువ మేలు చేశారని హెచ్చార్కె (లేదా పవన్ కుమార్) చెప్పడం వింతగానే ఉంటుంది. అయితే కొంతమంది మాజీల వలె తను పనిచేసిన పార్టీ గురించి మాత్రం ఎలాటి ప్రతికూల వ్యాఖ్యలు చేయకపోవడం వరకూ బాగుంది. పార్టీ తను పోగొట్టుకున్న స్వేచ్ఛాటవి అని అభివర్ణిస్తారు. ఈ పుస్తకం మొత్తంలో ఎక్కడా నక్సలైట్ భావజాలంపై పెద్ద విమర్శ గాని; సిపిఐ, సిపిఎం వంటి పార్టీల పట్ల ప్రస్తావన గాని చూడం. (అవీ ప్రాంతీయ పార్టీలే అన్న వ్యాఖ్య తప్ప.) 1985లో ఈనాడులో ఉద్యోగానికి వెళ్లినప్పుడు ఆనాడు ఎన్టీ రామారావు ప్రకటించిన భారతదేశం పార్టీ బాగుందని జవాబు చెప్పి రామోజీని మెప్పించడంతో ఈ కథ ముగుస్తుంది. నవల మొదటి భాగంలో అసహాయురాలైన ఆవేదనామూర్తిగా రచయిత తల్లి, మలి భాగంలో చైతన్యవంతమైన భాగస్వామిగా భార్య విజయ గురించిన భాగాలు ఆకట్టుకుంటాయి. ప్రజల విముక్తి కోసం పనిచేయాలనుకునే నిస్వార్థ యువతీ యువకులను పరిచయం చేస్తాయి. ఒక భిన్నమైన పుస్తకంగా దీన్ని చదవొచ్చు.

■



# అక్కడో బడి ఉండేది!

- సాంబమూర్తి లండ

96427 32008

**ఆ** బడి ఇప్పటికీ
నా స్మృతుల పుస్తకంలో
నెమలీకలా సజీవంగానే ఉంది
నా కనుపాపల మీద
కన్నీటి అద్దమై తడితడిగా మెరుస్తూనే ఉంది

ఎన్ని జీవితాల కొమ్మలకో
వెలుగు పూలై పూసిన బడి
ఎన్ని లేలేత మొక్కలకో నీళ్లుపోసి
బతుకుచెట్లుగా ఎదగనిచ్చిన బడి
ఎన్ని గెలుపు కథా సంపుటాలకో
ప్రేమతో ముందుమాటలు రాసిచ్చిన బడి
ఎన్ని బతుకుపాటలకో
అద్భుత బాణీలు కట్టిన బడి
అమ్మలా నన్ను అక్కునచేర్చుకుని
అక్షరమై నేను కదులుతుంటే
కనిపించకుండా కళ్ళత్తుకున్న బడి

ఎన్ని అల్లరి తూనీగల్ని పిలుచుకొచ్చి
నాలుగు అక్షరాల బెల్లం ముక్కలు చేతికిచ్చి పంపిందో
ఎన్ని తేనెటీగలకు
జ్ఞానపు తేనెల పూలతోటల్లోకి దారి చూపిందో
ఎన్ని సీతాకోకచిలుకల రెక్కలకు
అరుదైన అక్షరాల రంగులద్దిందో
ఎన్ని గువ్వపిల్లల్ని సేదదీర్చి
రెక్కలకింత బలాన్నిచ్చి వెళ్ళిరమ్మందో
ఎన్ని మారాం చేసే రామచిలుకలకింత
వసపట్టి మాటల లోగుట్టు చెవినేసిందో
ఎన్ని పావురాలకు ఎన్ని పాలపిట్టలకు
బతుకు పాఠాల్ని నేర్పి
ఆకాశాల్ని గెలుచుకు రమ్మని దీవించిందో!

ఇప్పుడక్కడ
మూగబోయిన బడిగంటా
బోసిపోయిన నల్లబల్లా
వెలిసిపోయిన నాలుగ్గోడలూ
కాటికి కాళ్ళుజాపుకున్న వరండా
గుట్టలు గుట్టలుగా పోగుపడిన
నిర్లక్ష్యపు ఎండుటాకులూ మిగిలున్నాయి
దుముకుతూ గెంతుతూ నవ్వుతూ అలుగుతూ
బాల్యాన్ని పతంగులుగా ఎగరేసే
అల్లరల్లరి పిచ్చుకల్లేవు!

నిశ్శబ్దమక్కడ అణు విస్ఫోటనమై పేలుతోంది
ఆ నిశ్శబ్దాన్ని గొంతులో నింపుకుని
పాడేందుకొక్క మనిషీ లేడు
ఏ చిట్టిచేతుల్లో ఎదిగిన పాదులో
ఇప్పుడు వృక్షాలై
బడిని కావలించుకుని కన్నీళ్లు తుడుస్తున్నాయి
బడి అలికిడే లేదని చిన్నబుచ్చుకున్న సముద్రం
వెక్కివెక్కి ఏడుస్తూ
వెనక్కి వెనక్కి వెళ్ళిపోతోంది!

బడి మెల్లమెల్లగా
జ్ఞాపకాల లోయల్లోకి జారిపోతూ ఉంది
ఎప్పుడో ఒకప్పుడు
ఏ పురావస్తు నిపుణుడి గునపానికో తగిలి
ఖంగున మోగేదాకో
అక్కడో బడి ఉండేదని
ఎవ్వరికీ తెలియకపోవచ్చు!
నాకూ... ఆ ఒంటరి సముద్రానికీ తప్ప!

**(నేను మొట్టమొదట పనిచేసిన బడి మూత బడిపోయినప్పుడు...)**




# ప్రజా జీవితమే సరైన 'పాట'శాల

- సత్యరంజన్
83419 51645

**సెప్టెంబరు 11, 2001.**

**అ**మెరికాలో ట్విన్ టవర్స్ మీద ఉగ్రవాద దాడి జరిగిన రోజు. ప్రపంచవ్యాప్తంగా ఈ రోజు చాలా ప్రాచుర్యం పొందింది. ఈ దాడుల సాకుతో ఆఫ్ఘనిస్తాన్ మీద అమెరికా దాని మిత్రదేశాల సైనిక దళాలు ఏకపక్షంగా దండెత్తి విలయ విధ్వంసం సృష్టించాయి.

కానీ అంతకు పాతికేళ్ల క్రితం సరిగ్గా అదే సెప్టెంబర్ 11వ తేదీన లాటిన్ అమెరికన్ దేశమైన చిలీలో ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికైన సాల్వడర్ అలెండి ప్రభుత్వాన్ని సైనిక కుట్ర ద్వారా కూలదోయించింది అమెరికా ప్రభుత్వం. అలెండి కమ్యూనిస్టు పార్టీ నాయకుడు. అధ్యక్ష ఎన్నికల్లో మార్క్సిస్టులు, క్రిస్టియన్లు, సోషల్ డెమోక్రాట్లు, అభ్యుదయ స్వతంత్ర అభ్యర్థులు కలిసి ఏర్పడిన సంకీర్ణ కూటమి.. పాపులర్ యూనిటీ అభ్యర్థిగా అలెండి అధ్యక్ష పదవికి ఎన్నిక అయ్యాడు.

ప్రపంచపటంలో చిన్న రిబ్బను పీలిక అంత కనిపిస్తుంది చిలీ. అయితే అప్పటికే రష్యా, చైనా, తూర్పు యూరప్ దేశాలు, క్యూబా, వియత్నాం వంటి దేశాల్లో సాయుధ తిరుగుబాటు ద్వారా సోషలిస్టు ప్రభుత్వాలు ఏర్పడి ప్రపంచవ్యాప్తంగా వలస పాలనకు, సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా స్వాతంత్ర్య ఉద్యమాలు ఉవ్వెత్తున సాగుతున్నాయి. ఆ ప్రభావం అప్పటివరకు అమెరికా పెరటిదొడ్డిగా మారిన లాటిన్ అమెరికా దేశాల్లో కూడా కొనసాగింది. అమెరికాలో అత్యధిక భూభాగం మంచుతో కప్పబడి వ్యవసాయానికి లాయకీ కాకపోవడంతో ఆ దేశం వ్యవసాయ ప్రాథమిక ఉత్పత్తుల కోసం లాటిన్ అమెరికా దేశాలను కొల్లగొట్టసాగింది. ఆయా దేశాల ప్రజానీకాన్ని దుర్భర దారిద్ర్యంలో ముంచి, వారి శ్రమ ద్వారా సృష్టించబడిన ఉత్పత్తులను, సంపదను చౌకగా కొల్లగొట్టుకు పోయేది.

అయితే అలెండీ అధికారంలోకి వచ్చిన వెంటనే వ్యవసాయ క్షేత్రాలను, రాగి గనులను, జౌళి పరిశ్రమలను జాతీయం చేశాడు. అమెరికన్ బహుళజాతి కంపెనీలు అయిన యునైటెడ్ ఫ్రూట్ వ్యవసాయ క్షేత్రాలను తన గుప్పెట్లో ఉంచుకుంటే, అనకొండ, సెర్రో, కెన్నేకాట్.. ఈ మూడు బహుళ జాతి కంపెనీల పిడికిట్లో చిలీ దేశపు రాగి గనులు చిక్కుకుపోయి ఉన్నాయి. రాగి గనులను అలెండీ ప్రభుత్వం జాతీయం చేస్తూ ఈ మూడు కంపెనీలకు నష్ట పరిహారం చెల్లించే క్రమంలో అప్పటివరకు ఆ కంపెనీలు అక్రమంగా సంపాదించిన లాభాలను మినహాయించింది. ఏ సార్వభౌమదేశమైనా తన సహజ వనరులను సంరక్షించడం నేరం ఎలా అవుతుంది? కానీ ఈ పరిణామంతో వాషింగ్టన్ ఉలిక్కి పడింది. అప్పటివరకు ఎలాంటి ప్రతిఘటనా లేకుండా లాటిన్ అమెరికా దేశాల సహజ వనరులను కొల్లగొట్టిన అమెరికన్ బహుళ జాతి సంస్థలు పాలక శక్తులు, సిఐఎ, ఐటిటి కలిసి చిలీకి గుణపాఠం నేర్పించాలని నిర్ణయించుకున్నాయి.

అలెండీ ప్రభుత్వం పిల్లలకు పౌష్టికాహారం అందేలా చూడడం దగ్గర నుంచి కార్మికులకు తగిన వేతనాలు, యాజమాన్యంలో భాగస్వామ్యం కల్పించడం, మహిళలకు అన్ని రంగాల్లో అవకాశాలు కల్పించడం, ప్రజలు తమ విశ్రాంతి సమయాన్ని

కుటుంబాలతో కలిసి ఆనందంగా ఆహ్లాదకరంగా గడిపే వసతులు కల్పించడం, అందరికీ విద్యావకాశాలు కల్పించడం వంటి అనేక ప్రజోపయోగ కార్యక్రమాలు చేపట్టింది. ఇది దేశంలో అప్పటివరకు అధికారం చలాయించిన మితవాద శక్తులకు, అమెరికన్ బహుళ జాతి కంపెనీలకు కంటగింపుగా మారి అనేక కుట్రల ద్వారా అలెండీ ప్రభుత్వాన్ని అత్యంత కిరాతకంగా రక్తపుటేరుల్లో ముంచి మరీ పడగొట్టారు. ఆ పరిణామ క్రమాన్ని విపులంగా చదివి తీరాల్సిందే! ప్రపంచవ్యాప్తంగా ఆసక్తి గొలిపిన చిలీ ప్రజాస్వామిక సోషలిస్టు విప్లవం సాకారం కావడానికి ఆ దేశ సాంస్కృతిక రంగ కృషి ఎలా తోడ్పడిందో తెలుసుకోవాలంటే 'విక్టర్ జారా – ఒక అసంపూర్ణ గీతం' పుస్తకం చదివి తీరాల్సిందే. విక్టర్ జారా సహచరి బ్రిటిష్ దేశస్థురాలైన జోన్ జారా ఇంగ్లీషులో వెలువరించిన పుస్తకాన్ని డాక్టర్ నళిని తెలుగు చేశారు .

విక్టర్ జారా చిలీ దేశపు సాంస్కృతిక సేనాని. సెప్టెంబర్ 11న అధ్యక్ష భవనం మీద బాంబులు కురిపించి, సైనిక ట్యాంకులు నడిపించి అలెండీని హత్య కావించిన సైనిక ప్రభుత్వం విక్టర్ జారాను బంధించి చిత్రహింసలకు గురి చేసి 14వ తేదీకల్లా హత్య కావించిందంటే ఒక పాటగాడి ప్రాముఖ్యత ఏమిటో మనం అర్థం చేసుకోవచ్చు. సంగీతకారులు కొంతమంది సంగీతాన్ని ప్రేమిస్తారు, మరి కొంతమంది ప్రజలను ప్రేమిస్తారు. విక్టర్ జారా రెండో కోవకు చెందిన సంగీతకారుడు. అతగాడేమీ శాస్త్రీయ సంగీత జ్ఞానం ఉన్నవాడు కాదు. అయినా తన దేశంలో ప్రజా వ్యతిరేక, అమెరికన్ బహుళజాతి కంపెనీల తొత్తు ప్రభుత్వాన్ని ప్రజాస్వామిక పోరాటం ద్వారా ఎన్నికల్లో మట్టి కరిపించే చైతన్యం ప్రజలకు తన ఆటాపాటా ద్వారా ఎలా కలిగించాడో తెలియచెప్పే పుస్తకమే ఈ అసంపూర్ణ గీతం.

అతి సామాన్యమైన మనిషి చిలీ దేశపు సాంస్కృతిక రంగ సేనానిగా ఎదగడానికి అతను ఎన్నుకున్న మార్గం, సాంస్కృతిక రంగంపై అతని అవగాహన కీలకంగా మారాయి.

■ నిజమైన ప్రజల సంస్కృతి పరిపక్వత సాధించడానికి సమయం పడుతుంది. దాన్ని మనం ఎక్కడి నుంచో సృష్టించలేం అని అతని నమ్మకం.

■ ప్రజల వ్యక్తీకరణకి ఎక్కువ విలువనిచ్చి ఎంతో గౌరవంతో వారు చెప్పేది వినడానికి ప్రాముఖ్యత నిచ్చేవాడు.

■ కళాకారుడు అంటే మిషను సాఫీగా నడవడానికి పనికొచ్చే నూనె చుక్కలా ఉండాలే తప్ప అతని కళాసృష్టే అంతిమమైనదని భావించకూడదు అంటాడు.

■ మనం ప్రజలను చేరుకోవాలే తప్ప మనం వారి స్థాయికి దిగజారిపోయాం అనుకోకూడదు. వారికి చెందిన సాంస్కృతిక మూలాలను వారికి అందివ్వాలి. సాంస్కృతిక వ్యక్తీకరణ కోసం వారు పడే తపనను మనం తీర్చాలి.

■ మనం ప్రదర్శనలు ఇచ్చిన ప్రతిచోటా సృజనాత్మకత గురించి వర్క్‌షాప్ నిర్వహించాలి అంటాడు విక్టర్ జారా.

జానపద సాహిత్యం అప్పటికే స్తబ్దతకు లోనైందనీ, నాశనమైపోతుందని దాన్ని పురాతనమైనదిగా పరిశోధించి మ్యూజియాల్లో నిక్షిప్తం చేయాలనేది ఒక వాదన. అయితే జానపద సాహిత్యం ఒక సజీవ వ్యక్తీకరణ. అది సమకాలీనమైనది, మార్పుని కోరుకుంటుంది కానీ దాని పునాదులను పెకళించకూడదు అనేది విక్టర్ అవగాహన.

■ జానపద సాహిత్యాన్ని ఉత్ప్రేరితం చేసి దానిలో వ్యక్తీకరణలు పెంపొందించి, మాటల అర్థాలకు సంగీతాన్ని జోడించి పరిపూర్ణ జానపద సాహిత్యాన్ని సృష్టించాలని కృషి చేశాడు.

■ అతని పాటల్లో రచనల్లో వ్యక్తిగత ధోరణి తగ్గి సామూహికత చోటు చేసుకుంది.

■ చిలీ ఉత్తరాది దక్షిణాది ప్రాంతాలు పర్యటించి జానపద సాహిత్యాన్ని సేకరించి పాటగా మలిచి ప్రజాక్షేత్రంలో ప్రాచుర్యంలోకి తెచ్చాడు. నాటకరంగంలో కొత్త కొత్త ప్రయోగాలు తీసుకు వచ్చాడు. అనేక పీలికలుగా ఉన్న సాంస్కృతిక సంస్థలను ఐక్య పరిచాడు.

■ జాతీయ సాంస్కృతిక సంస్థని ఏర్పాటు చేసి ప్రజా ఉద్యమాన్ని ఉత్తేజపరచి, సంఘటితపరచి మార్గదర్శకత్వం వహించేలా దాన్ని తీర్చిదిద్దాలని ఆరాటపడ్డాడు. అయితే సాంస్కృతిక రంగంలో ఒక పద్ధతి, ప్రణాళిక, సాంకేతిక నైపుణ్యం కొరవడటం వల్ల కేవలం ప్రాప్తకాలజ్ఞత రాజ్యమేలడం మూలంగా అది సాధ్యపడలేదు.

ఇంతటి బృహత్తరమైన సాంస్కృతిక కృషి చెయ్యడానికి ప్రజల పట్ల అతనికి ఉన్న ప్రేమ, రాజకీయ నిబద్ధతలే కారణం. "ఇప్పుడు చేస్తున్న పనికి పదింతలు పని చేయాల్సిన అవసరం ఉంది అంటే నేను పదిమంది పెట్టు కాగలగాలి. శాంతియుతంగా సోషలిస్టు సమాజాన్ని నిర్మించగలిగే మహదవకాశాన్ని జారవిడుచుకోకూడదు. మనం ఆ పని సాధించగలమో లేదో అని ప్రపంచం గమనిస్తుంది." అని భవిష్య కర్తవ్యాన్ని నిర్దేశించుకున్న విక్టర్ జారా ఆ కృషిలో తలమునకలుగా ఉన్న కారణానే అలెండి ప్రభుత్వాన్ని కూలదోసి అధికారం చేపట్టిన సైనిక నియంత పాలకుల

చేతిలో చిత్రవధ అనుభవించి మరణించాడు. అతను మరణించినా అతని పాట ఇంకా చిలీలో ఇతర లాటిన్ అమెరికా దేశాల్లో ఈనాటికీ ప్రతిధ్వనిస్తూ ఉంది.

1970 – 80వ దశకంలో సాంస్కృతిక రంగంలో పనిచేసిన నేపథ్యం గల డాక్టర్ నళిని తెలుగు చెయ్యడం మూలంగా ఈ పుస్తకం పఠనీయత సజావుగా సాగుతుంది. సామాజిక రాజకీయ పరిణామాల అధ్యయనం పట్ల ఆసక్తి కలవారు మరీ ముఖ్యంగా సాంస్కృతిక రంగంలో కృషి చేసేవారు చదివి ఆకళింపు చేసుకోవాల్సిన పుస్తకం ఇది. అయితే స్థలకాలాల స్పృహ పాఠకుడి గమనంలో ఉండాలి.

మార్పు నిరంతరాయమైనది (change is constant) అని కదా మార్క్స్ చెప్పాడు. 1970వ దశకంలో చిలీ భూస్వామ్య ఫ్యూడల్ లక్షణాలు కల దేశం. అక్షరాస్యత చాలా తక్కువ. కాబట్టి జానపద పాట, ఆట, నాటకం.. ఇవి ప్రజలతో భావాలు పంచుకునే ప్రధాన వాహకాలుగా ఉండేవి. విక్టర్ జారా ఈ వాహకాలను ప్రజోపయోగంగా మలుచుకోవడంలో అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానాన్ని కూడా శక్తివంతంగా వాడుకోవడం మనం గమనించుకోవచ్చు.

ఒకప్పుడు ఆంధ్రరాష్ట్రంలో నాటకాలు, పాటలు అభ్యుదయ సాంస్కృతిక ఉద్యమాల్లో కీలకమైన పాత్ర పోషించాయి. ఆ దశకాల్లో మన దగ్గర కూడా అక్షరాస్యత శాతం తీసికట్టుగా ఉండేది.

కాలం మారింది. ప్రజల అభిరుచులు మారాయి. ఒకప్పుడు ఒక వెలుగు వెలిగిన పౌరాణిక, జానపద నాటకాలను తోసిరాజని సాంఘిక నాటకాలు ముందుకు వచ్చాయి. అప్పట్లో సుంకర, వాసిరెడ్డి రాసిన మాభూమి నాటకం ఆడుతుంటే ఎక్కడెక్కడి ప్రాంతాల నుంచో జనం ఎడ్లబండ్లు కట్టించుకు వచ్చి చూసేవారు. కానీ ఇవాళ్టి రోజుల్లో అంతటి ప్రభ మనం చూడలేం కదా.

రంగస్థల నాటకాలకు ఆదరణ తగ్గుతున్న క్రమంలో ఇప్టా, షహమాత్ వంటి సంస్థలు వీధి నాటక రూపాలతో ప్రజలకు చేరువ కావడానికి కృషి మొదలుబెట్టాయి. ఈ కృషి కార్మిక, కష్టజీవులు నివసించే పేటలకు, దళితవాడలకు విస్తరించాలి. అన్నిటి కన్నా ముఖ్యంగా కళాకారులు, సంస్థలు ప్రజలకు చేరువ కావాలి. ప్రజల నుంచి నేర్చుకుని ప్రజలకు నేర్పాలి. డాక్టర్ నళిని తెలుగు చేసి అందించిన ఈ పుస్తకం అందుకు ఏ మేరకు తోడ్పడినా ఆమె కృషి ఫలించినట్టే! ■



## నీడ

**స**జీవమైన నీ నీడే
ఓ వస్తువుగా చూడటం
అలవాటై నాకు
మరణం గురించి మాట్లాడేందుకు
మనుషులెవరూ ఉండరేమో!
ప్రతిరోజూ మరణం
అంచునించి విషాదంగా
మనుషులు వస్తువుల్లా
బూడిదవుతున్నప్పుడు
నేనెంత!
నా సంతోషపు వైశాల్యమెంత!
అలసిన కళ్లల్లోకి
జీవితం గులకరాళ్లు వేస్తూ
ఆనంద పడుతుంటుంది.
మనిషే కఠిన వాస్తవమైనప్పుడు
ఎక్కడిక ఏముందని?
అక్కడెవరో తారట్లాడుతున్నారు
ఆర్తితో వాళ్లకోసమైనా
నయావ్యాక్సిన్ అమృతం
పరిశోధింపబడాలని కోరుకుంటున్నాను
ఒక్కరోజైనా నా స్నేహితుడి కళ్లల్లో
నమ్మకాన్ని చూడా లనుకొంటున్నాను
నిజానికి నేను రెండుగా విడిపోయి
నా మరో ఆప్తుడైన వస్తువుకి
దగ్గరగా చెల్లాచెదురైపోయిన
జీవన సంగీతపు తంత్రుల్ని సవరిస్తూ ...

**- ఏటూరి నాగేంద్రరావు**
**74166 65323**



# నవ సినిమా వైతాళికుడు సత్యజిత్ రాయ్

- బాలాజీ (కోల్‌కతా)

:: సత్యజిత్ రాయ్ శత జయంతి (1921 - 2021) ::

**న**వ సినిమా వైతాళికుడు, బహుముఖ ప్రతిభాశాలి సత్యజిత్ రాయ్ శతజయంతి సందర్భం ఇది. 1921, మే 2 న జన్మించాడాయన. మొదటి సినిమా 'పథేర్ పాచాలీ'తోనే గ్రేట్ మాస్టర్స్ సరసకు చేరిన దర్శకుడిగా, తను సృష్టించిన పాత్రలతో తరతరాల పాఠకులను అలరిస్తున్న రచయితగా, కంప్యూటర్ ఫాంట్లు లేని కాలంలో సరికొత్త అక్షరాలను సృష్టించిన కాలిగ్రాఫర్‌గా, వినూత్న రీతిలో గ్రంథాల ముఖచిత్రాలూ, పోస్టర్లూ, లోగోలూ డిజైన్ చేసిన ఇలస్ట్రేటర్‌గా, స్క్రిప్ట్ రైటర్‌గా, సంగీత దర్శకుడిగా, డాక్యుమెంటరీ నిర్మాతగా, పత్రికా సంపాదకుడిగా - ఇలా సత్యజిత్ రాయ్ తను ప్రవేశించిన ప్రతి రంగంలోనూ అసమాన ప్రతిభాపాటవాలు కనబరిచి బహుముఖ ప్రజ్ఞాశాలి అనిపించుకున్నాడు. పద్మభూషణ, భారతరత్న బిరుదులు, దాదా సాహెబ్ ఫాల్కే అవార్డు, ఆస్కారు జీవన సాఫల్య పురస్కారం, అఖిరా కురసోవా జీవన సాఫల్య పురస్కారం, ఫ్రాన్సు దేశపు అత్యుత్తమ పురస్కారం వంటి వ్యక్తిగత అవార్డులతో పాటు, తన వేర్వేరు సినిమాల కోసమూ లెక్కలేనన్ని అవార్డులూ, గౌరవాలూ దక్కించుకున్నారాయన.

సత్యజిత్ వంశవృక్షాన్ని పరిశీలిస్తే, తాత ఉపేంద్ర కిషోర్ రాయ్ చౌదరీ రవీంద్రుడికి చాలా సన్నిహితుడు. బ్రహ్మ సమాజం నాయకుల్లో ఒకడు. భారతదేశపు మొట్టమొదటి పిల్లల పత్రిక 'సందేశ్'ను ప్రారంభించాడు. గూపీ గాయిన్ (గూపీ పాటగాడు), బాఘా బాయిన్ (బాఘా వాద్యకారుడు) పాత్రలు ఈయన సృష్టించినవే. ఈ యన రచయితే కాక, చిత్రకారుడు, వయోలిన్ విద్వాంసుడు కూడా. సత్యజిత్ తండ్రి సుకుమార్ రాయ్ కూడా రచయిత, మేధావి. అతడి కథలూ, 'ఆబొల్ తాబొల్' కవితలూ పిల్లలనే కాదు, పెద్దవారినీ అలరించాయి. ఇంగ్లాండ్‌లోని మాంచెస్టర్ స్కూల్ ఆఫ్ ప్రింటింగ్ టెక్నాలజీలో టాపర్‌గా నెగ్గిన ఆయన హాఫ్టోన్ బ్లాక్-మేకింగ్ అనే కొత్త పద్ధతిని కనుగొన్నాడు. ఉపేంద్ర స్థాపించిన ముద్రణాసంస్థను సమర్థవంతంగా నడిపాడు.

### బాల్యం - విద్యాభ్యాసం

సుకుమార్ రాయ్, సుప్రభా రాయ్‌లకు జన్మించాడు సత్యజిత్ రాయ్. అతడు పుట్టిన రెండున్నర యేళ్లకే తండ్రి సుకుమార్ మరణించాడు. అమ్మ కుట్టుపని నేర్పే ఉద్యోగం చేసి కొంత సంపాదిస్తూ వుండగా మేనమామ ఇంట్లో పెరిగాడు సత్యజిత్. అతడి తెలివితేటల్ని చూసి 'మాణిక్' (మాణిక్యం) అని పిలిచేవారు. సత్యజిత్ రాయ్‌ను చాలామంది 'మాణిక్‌దా' అనే పిలుస్తారు.

బాలీగంజ్ హై స్కూలు, ప్రెసిడెన్సీ కాలేజీ ఎకానమిక్స్ తర్వాత తనకు ఇష్టమైన చిత్రకళ అభ్యసించడానికి రవీంద్రుడు శాంతినికేతన్‌లో నెలకొల్పిన విశ్వభారతీ యూనివర్సిటీలో చేరాడు. అక్కడ నందలాల్ బోస్, బినోద్ బిహారీ ముఖర్జీ లాంటి ప్రఖ్యాత చిత్రకారుల నుండి చాలా విషయాలు నేర్చుకున్నాడు. అజంతా, ఎల్లోరా, ఎలిఫెంటాలను సందర్శించి భారతీయ చిత్ర, శిల్ప కళల గురించి అవగాహన చేసుకున్నాడు. విశ్వభారతీ సినిమా క్రాఫ్టుకు సంబంధించిన లాంటి పుస్తకాలు చదివేవాడు.

### సృజనాత్మక డిజైనింగు

1943లో డి. జె. కీమర్ అనే బ్రిటీషు అడ్వర్టైజ్‌మెంట్ సంస్థలో ఉద్యోగంలో చేరాడు. దాంతోపాటే సిగ్నెట్ ప్రెస్ అనే ప్రచురణ సంస్థకు బొమ్మలు వేసేవాడిగా (ఇలస్ట్రేటర్‌గా) కుదిరాడు. సాధారణంగా ఒక ప్రధాన పాత్రకు లేదా ప్రధాన సంఘటనకు సంబంధించిన బొమ్మతో ముఖచిత్రాలు తయారుచేసేవారు. కానీ సిగ్నెట్ ప్రెస్‌లో పుస్తకాల కవర్లు రూపకల్పన చేసేటప్పుడు సత్యజిత్ అసామాన్య సృజనను కనపరిచాడు. చిత్తోడ్‌గడ్ రాజుల కథల పుస్తకానికి రాజస్థానీ శైలిలో కవరు పేజీని మలిచాడు. నరభక్షక

పులులపై జిమ్ కార్బెట్ రాసిన పుస్తకాన్ని ఒక పులి చర్మంతో కప్పేసినట్టు కవర్ డిజైనింగు చేశాడు. ముందు కవర్లో బుల్లెట్ దూరి వెనక కవర్ నుండి బయటికొస్తున్నట్టు పులివేటను దర్శింప జేశాడు. సినిమా పోస్టర్లు డిజైను చేసినా, ఏవైనా సంస్థల లోగోలు తయారు చేసినా కచ్చితంగా రాయ్ ముద్ర కనిపించేది. ఉదాహరణకు ఐజెన్‌స్టీన్ సినీ క్లబ్ కోసం వేసిన లోగో నాలుగు వృత్తాలు నలువైపులా వ్యాపిస్తున్నట్టు ఉంటుంది. పశ్చిమ బెంగాల్ సినీ కేంద్రం 'నందన్' లోగో బెంగాలీ అక్షరాలతో ఒక లత శాఖోపశాఖలుగా విస్తరిస్తున్నట్టు ఉంటుంది.

బిభూతి భూషణ్ బంధోపాధ్యాయ 'పొథేర్ పాచాలి' ('పాంచాలి' కాదు) నవలను సులభ శైలిలో బాలల సచిత్ర నవలగా తీసుకు రావాలనుకున్నారు ప్రచురణ కర్తలు. దానికి బొమ్మలు వేసే పని సత్యజిత్ రాయ్‌కి అందింది. ఆ పని చేస్తున్నప్పుడే అతడికి దాన్నే సినిమాగా తీయాలనిపించింది. రాయ్‌కి స్క్రిప్టు దశలోనే సన్నివేశాలను స్కెచ్చులుగా వేసుకుని ఉంచుకునే అలవాటు ఉండేది. ఆ అలవాటు ఈ పిల్లల పుస్తకానికి బొమ్మలు వేసినప్పుడే మొదలైంది. మంచి సినిమాల ప్రచారం కోసం చిదానంద దాస్‌గుప్తా తదితరులతో కలిసి 1947లో కలకత్తా ఫిల్మ్ సొసైటీ స్థాపించాడు. ఇంతలో బిజయా దాస్‌తో పెళ్లి జరిగింది. కుమారుడు సందీప్ పుట్టాడు. ప్రఖ్యాత ఫ్రెంచి దర్శకుడు జీన్ రెనర్ తన **'ది రివర్'** సినిమా షూటింగు కోసం కలకత్తా వచ్చినపుడు అతనికి గైడుగా ఉంటూ, షూటింగును పరికిస్తూ దర్శకత్వంలో కిటుకులెన్నో నేర్చుకున్నాడు. డి.జె. కీమర్ కంపెనీ అతడ్ని ఆరు నెలల పాటు లండన్ హెడ్ ఆఫీసుకి పంపించింది. అక్కడ ఇటలీ నవ్య వాస్తవవాద ధోరణిలో విటోరియా డిసికా తీసిన **'ది బైసైకిల్ థీవ్స్'** (1948) అతడ్ని ఎంతగా ఆకట్టుకుందంటే, తన సినిమాను అంతే సహజంగా నిర్మించాలనుకున్నాడు.

**'పొథేర్ పాచాలి'** అంటే 'రహదారి వినిపించే గేయకావ్యం'. ఎనిమిది వేల రూపాయల బ్యాంకు బ్యాలెన్సుతో షూటింగు మొదలు పెట్టారు. ఉద్యోగాలు చేస్తూ వారాంతాల్లో షూటింగు చేయాలని అనుకున్నారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా సినిమా షూటింగు మూడేళ్ల పాటు సాగింది. భార్య నగలూ, అరుదైన రికార్డులూ అమ్మేశారు. ప్రముఖుల పరిచయాలతో నిధులు సేకరించారు. మామ సుబిమల్ రాయ్ ప్రావిడెంట్ ఫండ్ కూడా తగలెట్టేశారు. పశ్చిమ బెంగాలు ప్రభుత్వ సహాయంతో సినిమా పూర్తయింది. విడుదల కాగానే ప్రపంచ సినిమాలో తన స్థానాన్ని ప్రతిష్టించుకుంది. 1955 కాన్స్‌లో 'ఉత్తమ హ్యూమన్ డాక్యుమెంట్' అవార్డు అందుకుంది. ఈ సినిమా విడుదల య్యాక రాయ్ తన ఉద్యోగం వదిలేశాడు.

**అపూ త్రయం:** 'పొథేర్ పాచాలీ' (1955), 'అపొరాజితో' (1956), అపూర్ సొంసార్ (1959) – ఈ మూడు సినిమాల్నీ కలిపి 'అపూ ట్రిలాజీ' (అపూ త్రయం) అంటారు. **'పొథేర్ పాచాలీ' (1955)** బెంగాలు గ్రామంలోని పేద బ్రాహ్మణ పరివారం కథ. భర్త హరిహర్, భార్య సర్బజయా, పిల్లలు దుర్గ, అపూ, బంధువు అయిన ఇందిర్ ఠాక్రూన్ అనే ముసలామెతో చాలీచాలని బతుకు. ఏదో కొంత సంపాదించడానికి భర్త ఊళ్లు తిరుగుతుంటే, కుటుంబ బాధ్యతంతా సర్బజయా చూస్తుంది. దుర్గ, అపూల బాల్య చేష్టలతో సినిమా నడుస్తుంది. జామకాయల దొంగతనం, మిఠాయివాడి వెంటబడడం, రైలుబండిని చూట్టానికి రెల్లుగడ్డిలోంచి పరుగుతీయడం – ఇలా ఎన్నో దృశ్యాలు... మనమా పాత్రలతోనే ఆ ప్రాంతాల్లో తిరుగుతున్నామా అన్నంత సహజంగా చిత్రించాడు దర్శకుడు. బామ్మ మరణం తర్వాత సినిమా ఆఖర్లో దుర్గ మరణం చాలా కలవరపెడుతుంది. **'అపొరాజితో' (1956)**లో హరిహర్ మరణం తర్వాత తల్లీ, కొడుకూ గ్రామానికి రావడం, అపూ చదువులో చురుగ్గా ఉండడంతో స్కాలర్‌షిప్‌తో కలకత్తాలో పెద్ద చదువుకు వెళ్లడం, కొడుకు నిరీక్షణలో తల్లి మరణం వరకు కథ నడుస్తుంది. **అపూర్ సొంసార్ (1959)**లో అపూ వైవాహిక జీవితం, దాని ఒడిదొడుకులూ చోటుచేసుకుంటాయి. పుట్టింటికి వెళ్లిన భార్య సమయంలో చనిపోవడంతో పిచ్చివాడిలా మారిపోతాడు అపూ. చివరికి ఐదేళ్ల తర్వాత కొడుకును చూట్టానికి వెళ్లి, అతడ్ని తన వెంట తీసుకురావడంతో సినిమా ముగుస్తుంది.

**చారులత (1964) :** సత్యజిత్ రాయ్ సినిమాల్లో అతడికి వ్యక్తిగతంగా బాగా నచ్చిన సినిమా 'చారులత'. రవీంద్రుని 'నష్టనీర్' (చెడిన గూడు) కథ ఆధారంగా తీశాడు. తీరిక లేని భర్త, ఒంటరితనంలో బాధ పడే భార్య, ఒక స్నేహితుడిలా దగ్గరైన మరిదిపై అభిమానం హద్దులు దాటుతోంటే చారులత అనుభవించే భావోద్వేగాలనూ, అంతర్మథనాన్నీ అందాల సహజనటి మాధవీ ముఖర్జీ అద్భుతంగా కనపరుస్తుంది. ఒక సున్నితమైన భావనను చాలా మానవీయంగా చిత్రిస్తాడు సత్యజిత్.

## వైవిధ్యమైన అంశాలతో సినిమాలు

రాయ్ మొత్తం 30 సినిమాలు తీశాడు. వాటిలో గ్రామీణులూ, మధ్య తరగతి జనాలు, మేధావులూ, జమీందార్లూ, రాజులూ, డిటెక్టివ్‌ల గురించి వివిధ ఇతివృత్తాలతో కథలున్నాయి. వస్తువులోనూ, కథన విధానంలోనూ దేనికదే ప్రత్యేకం. **'షతరంజ్ కే ఖిలాడీ'** (1977) ఈస్టిండియా కంపెనీ దూసుకొస్తుంటే చదరంగం ఆటల్లో తలమునకలైన మొఘల్ రాజులను చూపుతుంది. జమీందారీ వ్యవస్థ పతనమౌతుంటే తన పాత రాజసాన్ని వదులుకోలేక, కొత్త ధనాఢ్యుల పొగరును జీర్ణించుకోలేని ఒక జమీందారు బాధను చూపుతుంది **'జల్సాఘర్'**

(1958). ఆధునిక భారతంలో పేద బ్రాహ్మణ కుటుంబపు ఈతి బాధల్ని **'అపూ త్రయం'** చూపగా, మూఢ నమ్మకాలతో కోడల్ని అమ్మవారుగా మార్చేస్తుంటే, ఆధునిక హేతువాద భావాలతో దాన్ని ఎదిరించేవాళ్లు తయారౌతున్న వైనాన్ని **'దేవి'** (1960) సినిమా దర్శింపజేస్తుంది. **'చారులత', 'మహానగర్'** (1963) సినిమాల్లో స్త్రీల విముక్తిని చిత్రిస్తే, **'ప్రతిద్వంది'** (1970) లో నిరుద్యోగ సమస్యను వర్ణిస్తుంది. క్రమంగా దిగజారుతున్న లంచగొండి సమాజంలో మధ్య తరగతి నైతిక పతనాన్ని **'జనారణ్య'** (1975) సాక్షాత్కరింపజేస్తుంది. **'ప్రతిద్వంది', 'సీమాబద్ధ'** (1971), **'జనారణ్య'** సినిమాలను కలిపి సత్యజిత్ రే **'కలకత్తా త్రయం'** అని అంటారు. (మృణాల్ సేన్ **'కలకత్తా ట్రిలాజీ'** వేరే ఉంది.) **'గోపీ గాయిన్ – బాగా బాయిన్'** (1968) సంగీతం, హాస్య రసాలతో ఆబాలగోపాలన్నీ అలరించింది. ఇవే క్యారెక్టర్లతో ఇందిరా గాంధీ ఎమెర్జెన్సీపై చురకలా పరోక్ష విమర్శతో **'హిరక్ రాజార్ దేశే'** (హిరక్ రాజు దేశంలో) (1980) సినిమా వచ్చింది. ఇరవై లక్షల మందిని పొట్టన పెట్టుకున్న బెంగాల్ క్షామం మానవుల్ని ఎంత దయనీయ స్థితిలోకి నెడుతుందో చూపుతుంది **'అశని సంకేత్'** (1973).

### డాక్యుమెంటరీలూ – లఘు చిత్రాలూ ...

రాయ్ నిర్మించిన డాక్యుమెంటరీల్లో ముఖ్యమైనవి – విశ్వకవిపై **'రవీంద్రనాథ్ ఠాకూర్'** (1961), చిత్రకారుడు బినోద్ బిహారీ ముఖర్జీపై **'ది ఇన్నర్ ఐ'** (1972), తన తండ్రి జీవితంపై **'సుకుమార్ రాయ్'** (1987), భరతనాట్యం నర్తకి బాలసరస్వతిపై **'బాల'** (1976). సిక్కిం మనదేశంలో అంతర్భాగం కాకమునుపు అక్కడి రాజు ధన సహాయంతో **'సిక్కిం'** (1971) డాక్యుమెంటరీని నిర్మించాడు రాయ్. కానీ, ఇందులో సిక్కిం పేదరికాన్ని చూపారంటూ దీన్ని చాలా ఏళ్లు నిషేధించారు.

**'టూ'** అనే లఘుచిత్రం పేద, ధనిక పిల్లల్లో ఎవరు గొప్ప అనే విషయాన్ని చర్చిస్తుంది. ఠాగూర్ కథలతో తీసిన **'తీన్ కన్యా'** కూడా మూడు లఘుకథల సమాహారమే. **'పికూ'** అనే మరో లఘు సినిమా నిర్మించాడు రాయ్. బెంగాల్ సూపర్‌స్టార్ ఉత్తమ్ కుమార్‌తో తీసిన **'నాయక్'** సినిమా మాట్నీ హీరోల మిరుమిట్లు గొలిపే జీవితంలోని డొల్లతనాన్ని ఎండగడుతుంది. సత్యజిత్ రాయ్ మొదట్లో తన సినిమాలకు పండిత్ రవిశంకర్ తదితరులతో సంగీతం వేయించే వాడు. కానీ తర్వాతి సినిమాల్లో తనే సంగీత దర్శకుడిగా మారాడు.

### చివరి చిత్రాలు

1983లో స్వదేశీ ఉద్యమ నేపథ్యంలో ఒక స్వదేశీ నాయకుడి ద్వంద్వవైఖరిని ఎండగడుతూ **'ఘరే బాయిరే'** సినిమా తీశాడు. ఆ షూటింగు జరుగుతుండగా సత్యజిత్ రాయ్‌కి హార్ట్ ఎటాక్ వచ్చింది. 1987లో కొంత కోలుకున్నాక, ఇండోర్ షూటింగులకే పరిమితమౌతూ మూడు సినిమాలు తీశాడు. ఇబ్సన్ నాటకం ఆధారంగా తీసిన సినిమా **'గణశత్రు'** (ప్రజా శత్రువు). ఇందులో ప్రజారోగ్యం కోసం పరితపిస్తున్న డాక్టర్ను ప్రజాశత్రువుగా ముద్రవేస్తారు స్వార్థపరులు. కొడుకులూ, కూతుర్లూ ఎందరున్నా తన ఆదర్శాన్ని వమ్ముచేయని వారే చివరికి మనశ్శాంతినిస్తారని చెప్పిన సినిమా **'శాఖా ప్రోశాఖా'** (శాఖోపశాఖలు). ఈ సినిమాలో జీవితాంతం నిజాయితీతో బతికిన ఒక వృద్ధుడికి తన ముగ్గురు కుమారులూ అవినీతిలో మునిగారని తెలుస్తుంది. చివరికి మతిస్థిమితం లేని తన నాలుగవ కొడుకు సాంగత్యంలోనే సేద తీరుతాడు ఆ వృద్ధుడు. ఈ నాలుగో కుమారుడి పాత్ర వేసింది కచ్చితంగా రాయ్ మెచ్చిన సౌమిత్ర చటర్జీనే. సౌమిత్ర 14 సత్యజిత్ రాయ్ సినిమాల్లో నటించాడు. 1991లో వచ్చిన రాయ్ ఆఖరు చిత్రం **'ఆగంతుక్'** (అపరిచితుడు)లో సత్యజిత్ రాయ్ తన జీవిత తాత్విక సారాన్నంతా రంగరించాడు. మానవ సభ్యత, నాగరికతలపై చాలా బలమైన చర్చలు ఈ సినిమాలో వున్నాయి.

### సత్యజిత్ రాయ్ సాహిత్య సేవ

1961లో సత్యజిత్ రాయ్ తన తాతయ్య ప్రారంభించిన **'సందేశ్'** పత్రికను పునరుద్ధరించాడు. విజ్ఞానదాయకంగా, వినోదాత్మకంగా ఉండే రచనలు పిల్లల కోసం రాసేవాడు. షెర్లాక్ హెూమ్స్ ప్రేరణతో సృష్టించిన డిటెక్టివ్ ఫెలూదా కథల కోసం పిల్లలు చెవి కోసుకుంటారు. ఫెలూదా కథలతో **'సోనార్ కెల్లా'** (1974), **'జొయ్ బాబా ఫేలూనాథ్'** (1979) సినిమాలు నిర్మించాడు. శాస్త్రవేత్త ప్రొఫెసర్ శంకూ కూడా ఇతడి పాత్రే. పిల్లల కోసం సరదా గేయాలు రాశాడు. 'జొఖొన్ ఛొటో ఛిలామ్' (పిల్లాడిగా ఉన్నప్పుడు)లో చిన్ననాటి స్మృతులు రాశాడు. 'మై డేస్ విత్ అపూ'లో అపూ త్రయం నిర్మాణంలోని సాధక బాధకాలు వివరించాడు. అతడి సినీ సమీక్షలు 'అవర్ ఫిల్మ్స్ – దెయిర్ ఫిల్మ్స్' (మన సినిమాలు – వారి సినిమాలు) పుస్తకం రూపంలో వచ్చాయి. 'బిషొయ్ చలన్‌చిత్రొ' (చలనచిత్రాల గురించి), 'ఎకేయ్ బొలే షూటింగ్' (దీన్నే షూటింగంటారు) మొదలైనవి సినిమాలపై ఆయన రాసిన గ్రంథాలు.

1992లో ఆసుపత్రి బెడ్డు నుండి ఆయన ఆస్కారు జీవన సాఫల్య గౌరవ పురస్కారం అందుకున్నాడు. శాటిలైట్ టెలివిజన్ ద్వారా ఆస్కారు అవార్డుల సభను సంబోధించాడు. ***'చలన చిత్రాల కళపై అతని అరుదైన పాండిత్యానికీ, ప్రపంచవ్యాప్తంగా ఉన్న చిత్రనిర్మాతలు, ప్రేక్షకులపై చెరగని ప్రభావాన్ని చూపిన అతని లోతైన మానవతా దృక్పథానికీ గుర్తింపుగా'*** ఈ గౌరవం ఇస్తున్నట్టు అకాడమీ అవార్డు కమిటీ తన సైటేషన్లో పేర్కొంది.

■



## నానీలు

- డాక్టర్ ఎ.ఎ.నాగేంద్ర
94901 88263

1
సీమ ధైర్యశాలి
వేరుశనగ
కరువుకు
ఎదురొడ్డింది

2
పట్టుకోండి
అమ్మనాన్నను
కొట్టుకుపోతున్నారు
'మమ్మీ, 'డాడీ' ప్రవాహంలో

3
పిల్లలంతా
సాంకేతిక బానిసలు
ట్విట్టర్, ఫేస్‌బుక్‌ల
సమయం మోస్తూ ...

4
ఆమె
నవ్వు నామీద విసిరింది
ఇద్దామని వెళ్లా
మనసు లాగేసుకుంది

5
సీరియల్
వినోద రాక్షసి
చుట్టేసుకుంది
ఇంటిల్లిపాదిని

6
మేఘానికి రాతిగుండె
సీమరైతు ఘోష వినదు?
క'న్నీరు'
అసలు 'రాల్చదు'!

7
మూర్ఖుడా ...?
రాసే కలాలను
చంపొచ్చేమో ...
ఉదయించే ప్రశ్నను కాదు


8
అరే....!
ఎంత పనిచేస్తున్నావ్
మార్కుల కత్తెరతో
పిల్లల గొంతులు కోస్తావా?

9
కార్పొరేట్ విద్య
ఏమిటి నీ మిథ్య
ఒత్తిడితో
విద్యార్థిని చంపడమేగా! ■

## ఒంటరితనం

ఒంటరి తనం
నన్ను ముట్టుకోకు నామాల కాకి కాదు
సమూహంలో సరిపడనితనం
చిరునామా వెతుక్కోవడం
అది గుండె లోపలి మూగ సంగీతమూ
భావగర్భిత మనసు యుగళ గీతం కూడా
ఏకాంతరాగంలో జంటరాగం పలికిస్తుంది
జావళిని పాడిస్తుంది
ఒంటరితనం
నిద్రభంగి మాత్రమే కాదు
ముద్ర భంగి కూడా
సామూహిక మౌనరాగం
ఆవేదన– సంవేదనల రహదారి
ఒంటరితనం బతుకులో చూపు
పరిసరాల అవగాహన ప్రయోగం
పరిశోధన అడుగు
ఒంటరితనం ఒక ప్రశ్న మనుగడకు సమాధానం
ఒక వారధి
ఒక జలపాతం
విడి చినుకు వలపోత సంభాషణ
ఒక ఎడారి ఇసుకదిబ్బ
సాగుబడికి రాని పొలం
తోచని పరుగుపందెం
కూలబడిపోవడం నిలబడడం
ఒంటరితనం బయటపడని
అంతరంగ స్మృతులకు తాళం వేసిన పేటిక
ఒంటరితనం ఒంటరికాదు
సమూహంకోసం కదలిక
అభిరుచుల వంతెన కూలితే
ఒంటరితనం
భావనల నదులు కలిస్తే ఒంటరితనం మాయం
ఒంటరితనం శాపం కాదు
శిక్ష కాదు
సమూహంకోసం చేసే వ్యాయామం

- వల్లభాపురం జనార్దన
94401 63687




మానవ ఆవిర్భావం, సుదీర్ఘ మహాప్రస్థానంపై
సమగ్ర సంపుటాలు


# ఎంవి రమణారెడ్డి టూకీగా ప్రపంచ చరిత్ర

**- తెలకపల్లి రవి**

'ఈ మానవ రూపం కోసం జరిగిన పరిణామం ఎంతో' అని కవి అన్నట్టు మనిషి ఆవిర్భావం, మానవ సమాజ పరిణామం, ప్రపంచ చరిత్ర వేల లక్షల సంవత్సరాల వ్యవహారం. దీన్ని మొత్తంగా ఆకళింపు చేసుకోవడం కుదిరే పని కాదు. అదే సమయంలో రేఖామాత్రంగానైనా అది అర్థం కాకపోతే మనిషికి తన గురించి, తన చుట్టూ వున్న ప్రపంచం గురించి బోధపడదు. సమస్తాన్ని దేవుడు సృష్టించాడని నమ్మే పరమ భక్తులైనా సరే విద్య, వైద్యం, దైనందిన జీవితం వంటి అంశాల్లో చరిత్రనూ, శాస్త్రాన్ని అనుసరించకతప్పదు. అందుకే దశావతారాల గురించి పాడుకునే ఈ దేశంలో నరావతారం వంటి పుస్తకాలు అవసరమయ్యాయి. ఇంగ్లీషులో హెచ్‌జివెల్స్, తెలుగులో కొడవటిగంటి కుటుంబరావు, రావూరి భరద్వాజ, నండూరి రామమోహనరావు, ఎస్.వెంకట్రావ్ వంటి వారు మానవ పరిణామ క్రమం గురించి, విశ్వనిర్మాణం గురించి ఎన్నో పుస్తకాలు రాశారు. ఒకప్పటి సోవియట్ యూనియన్‌లో ఇలిన్, సెగాల్ అనే రచయితలు ఇదే ఇతివృత్తంపై అమోఘమైన గ్రంథాలు వెలువరించారు.

శాస్త్ర విజ్ఞానం నిత్యనూతనమైంది. నిరంతర పరిశోధనలు జరుగుతూనే వుంటాయి. నూతన ఆవిష్కరణలూ వెలుగుచూస్తుంటాయి. ఈ క్రమంలోనే మానవ చరిత్రనూ, పరిణామ క్రమాన్ని మళ్లీ మళ్లీ చెప్పుకోవల్సిన అవసరం పెరుగుతుంటుంది. ఆ అవసరాన్ని గుర్తించబట్టే ప్రముఖ రచయిత, అనువాదకుడూ డా.ఎంవి రమణారెడ్డి *టూకీగా ప్రపంచ చరిత్ర* పేరిట నాలుగు సంపుటాలు వెలువరించారు. టూకీగా అంటూనే నాలుగు సంపుటాలైందంటేనే ఈ పరిణామం, చరిత్ర ఎంత సుదీర్ఘమైనవో తెలుస్తుంది. స్వతహాగా వైద్యుడు గనక స్వతహాగా సంబంధిత పరిజ్ఞానం, రచయితగా విస్తారమైన అనుభవం, మంచి తెలుగు భాషా ప్రయోగంతో పాటు అనువాదకుడుగా పారిభాషిక పదసృష్టిలోనూ పట్టు వున్న ఎంవిఆర్ ఈ పని చాలా జయప్రదంగా ఫలప్రదంగా చేయగలిగారు. మానవ పరిణామం, ఆధునిక ప్రపంచ ఆవిర్భావాన్ని శాస్త్ర విజ్ఞాన దృక్పథంతో అత్యంత పఠనీయంగా అక్షరీకరించారు. ప్రపంచం దానిమీద మనిషి ఆవిర్భావం నుంచి నేటివరకూ నడచిన కథ గనకనే ప్రపంచ చరిత్ర అని పుస్తకానికి పేరు పెట్టడం సమంజసంగా ఉంది. చరిత్ర అనేది సమస్త శాస్త్రాలనూ, సాహిత్యాన్నీ సరిహద్దుల్లో ఇమడనంత సమాజాన్ని చంకలో ఇరికించుకునే భారీ స్వరూపం అని ఆయన ముందుమాటలో ఇచ్చిన నిర్వచనం ఇందుకు అద్దం పడుతుంది. ముంగిలి అన్న మొదటి అధ్యాయం మొదటి పేరాలోనే ఆయన 'చరిత్ర గురించి ఆలోచించడం చేతయ్యేది ఒక్క మనిషికి మాత్రమే' అని చెప్పి అనంత చరిత్రలోకి మనతో అడుగులు వేయించడం మొదలెట్టారు. ముంగిలి, మొగసాల, తొలి గడప, లోగిలి,

చుట్టరికాలు, నెగడు, వెనక తరాలు, కొత్త దొంతర, కులాసాలు, నాగరికత, ఆడమగ, జాతులూ నుడికారాలు ... ఇలాటి అలతి అలతి పదాలతో అధ్యాయాలుగా విభజించి ఆయా దశలను అంశాలను చక్కటి తెలుగులో కళ్లకు కట్టారు. ఈ చెప్పే క్రమం లో కేవలం విజ్ఞానశాస్త్రం, చరిత్ర మాత్రమే గాక పురాణాలు ఇతిహాసాలు సాహిత్యం వంటివాటి నుంచి కూడా సందర్భోచిత మైన పోలికలు, పదాలు తెలిసినవీ తెలియనివి పొందు పరిచారు. అందుకే ఈ పుస్తకం చదువుతుంటే చాలా విషయాలు తెలుసుకున్న భావన వస్తుంది. ఇది రచయిత శ్రమకూ శ్రద్ధకూ నిదర్శనం. ఉదాహరణకు భూమి గుండ్రంగా వుందని తెలుసుకునేంత పరిజ్ఞానం ఆ రోజుల్లో లేదు గనక ఇలాతలం, భూవలయం వంటి పదాలే మనకు కనిపిస్తాయం టారు. తొలినాటి భౌతిక రసాయనిక ప్రక్రియలను వివరిస్తూ ఇప్పటివరకూ ఏర్పడిన రసాయనిక సంయోగాలన్నిటిలోనూ అత్యంత క్లిష్టమైంది ప్రాణం అని తేల్చేశారు. హరగోవింద్ ఖురానా జీవ పదార్థం తయారు చేయడంతో గత సందేహాలన్నీ పటాపంచలైనాయంటాడు. జీవుల పుట్టుక, సృష్టి వంటి విషయాల్లో మానవాళి తొలి ఊహలు ఒకేలా ఉండేవనడానికి ఉదాహరణగా రుగ్వేదం, జెండా అవస్తే, ఓల్డ్ టెస్టమెంట్‌లను ఉటంకిస్తారు. క్రీ.పూ. 5000 ప్రాంతంలో తొలి మానవ సమూహాలు ఏర్పడ్డాకే పరిసరాలను బట్టి పదాల పుట్టుక ఎలా జరిగిందో చెబుతారు. ఉదాహరణకు పదహారవ శతాబ్ది ముందరి పాశ్చాత్య సాహిత్యంలో పులి అన్న మాటే వుండదు! రాతి యుగం చివరి దశ చిత్రాల్లో కూడా వేటాడే జంతువులే కనిపిస్తాయి తప్ప ప్రకృతి ఉండదు. ఇవన్నీ ఆ దశల్లో జీవన సరళిని సూచిస్తాయి. మనిషిలో భయం మొదలైనాక దానితో పాటే విశ్వాసాలు పెరిగాక క్రతువులు రూపొందాయి. మలి వేదాల్లోనూ, బైబిల్‌లోనూ కాలాన్ని విభజించే ప్రయత్నం కనిపిస్తుంది. కాని ప్రాచీన భారతంలో తిథులు తప్ప వారాలు లేవు. మహాభారతంలో ముహూర్తాల ప్రస్తావన ఉండదంటారు. విశ్వాసాలు ఎలా పెరిగాయో చెబుతూ హిందూ నాగరికతలో క్రీ.శ. 4వ శతాబ్దం దాకా ఉత్తర భారతంలో దేవాలయం జాడలేదని గుర్తుచేస్తారు. 8వ శతాబ్ది దాకా నగరాలు లేవంటా రు. జనపదాలతో సహా ఆనాటి జీవన సంప్రదాయాలను సుబోధకంగా చెబుతారు. భారతదేశంతో పాటు ఈజిప్టు, మెసపుటేమియా, అస్సీరియా, పర్షియా, చైనా వంటి ప్రాచీన నాగరికతల పరిణామం చూస్తాం. వేకువ అన్న అధ్యాయంలో




ప్రాచీన భారత సమాజం, మతాలు, వర్ణాలు, మగధ సామ్రాజ్యం పుట్టుక వంటివి చెప్పారు. విశేషమేమంటే ఇదంతా కూడా అలవోకగా సహజ కథనంగా నడిచిపోతుంది గాని ఏదో చరిత్రనో శాస్త్రాన్నో చదివినట్టు ఉండదు. ఇలాటి పుస్తకాల్లో మామూలుగా ఊహించిన ఎన్నో అచ్చ తెలుగు పదాలూ సహజ ప్రయోగాలు ఆకట్టుకుంటాయి.

రెండో భాగానికి ప్రముఖ చరిత్రకారులు వకుళాభరణం రామకృష్ణ ముందుమాట రాస్తూ... జరిగిన సంఘటనలతో పాటు వాటి ప్రకంపనలు మానవ మేధస్సుపై ప్రసరించిన ప్రభావాన్ని పొందుపర్చారని అభినందించారు. సోక్రటిస్, ప్లాటో, అరిస్టాటిల్, అలెగ్జాండర్, గౌతమ బుద్ధుడు, జీసస్ క్రైస్ట్, మహమ్మద్ ప్రవక్త వంటివారిని వారి ప్రబోధాలు, ప్రభావాలను ఈ భాగంలో చూస్తాం. గ్రీకువీరుడు అన్న అధ్యాయంతో మొదలై అలెగ్జాండర్ రాజ్యవిస్తరణ రోమన్, గ్రీకు సామ్రాజ్యాల ప్రాభవం, అశోకుడు వంటివాటిని సందర్శిస్తాం. ఈ భాగంలో కొన్ని దీర్ఘంగానూ, కొన్ని క్లుప్తంగానూ వున్నా ఆసక్తికరంగా చదివించేలా చేస్తారు రచయత. అసలు ఇన్ని అంశాలు ఒక చోట చదవడమే గొప్ప అనుభవం. ఇవన్నీ సేకరించడానికి, క్రోడీకరించ డానికి రచయిత ఎంత కష్టపడివుంటారో ఊహించుకోవడం కూడా కష్టమే! పైగా ఎంవిఆర్ చాలా కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. మూడో భాగం వెలువరిస్తూ రాసిన చిన్న ముందుమాటలో రచయిత ఈ పోరాటాన్ని తానే చెప్పుకున్నారు. రాయడానికి వెచ్చించే సమయం కంటే సంబంధిత సమాచార సేకరణకు వందరెట్లు అధికంగా శ్రమ పడాల్సివచ్చినట్టు చెప్పారు. ఆధునిక ప్రపంచ

చరిత్రలో మూల మలుపుల్లాంటి పరిణామాలను, యుద్ధా లను, నూతన సమాజ ఆవిర్భావాలను వివరించే నాల్గవ భాగం రాయగలనో లేదో అన్న సందేహం వెలిబుచ్చారు. అయితే అంతులేని పట్టుదలే తోడుగా ఆ భాగాన్ని కూడా వెలువరించడం సంతృప్తి కలిగించే విషయం. పారిశ్రామిక విప్లవంతో మొదలుపెట్టి రెండవ ప్రపంచ యుద్ధంలో జర్మనీ ఓటమి, సోవియట్ యూనియన్, చైనా ప్రజా రిపబ్లిక్‌ల ఆవిర్భావం, దేశాలకు స్వాతంత్ర్యం వంటి అంశాలను పొందుపర్చారు. జపాన్‌పై అమెరికా బాంబుప్రయోగంతో ముగిస్తూ మరో మూడు అధ్యాయాలు రాయాల్సి వున్నా అనారోగ్యం వల్ల ఆ పని చేయలేకపోయినట్టు తన పరిస్థితిని నివేదించారు. నాల్గవ భాగానికి రాసిన ఈ మాట చూస్తే రచన కోసం ఆయన ఎంతగా తపించిందీ అర్థమవుతుంది. ఇంతటి శ్రమ పడి ఈ నాలుగు సంపుటాలు అందించినందుకు, మానవ మహాప్రస్థాన సందర్శనం చేయించినందుకు ఎంవి రమణారెడ్డిని ఎంతైనా అభినందించవచ్చు. ఈ నాలుగు సంపుటాలను సమగ్రంగా పరిచయం చేయాలంటే ప్రత్యేకంగా ఇక్కడ సమయం, స్థలం కూడా చాలవు.

విరసం రాజకీయాలు తర్వాత తెలుగుదేశం ఎంఎల్ఎ, ఆ పైన రాయలసీమ ఉద్యమం, తెలుగు భాషా ఉద్యమం, ఇతర వాదవివాదాలు ఎన్ని వున్నా రచనా రంగంలో డా.ఎంవి రమణారెడ్డిది ప్రత్యేక పాత్ర. జైలులో ఉండగా ఆయన అనువదించిన గ్రంథం పురోగమనం. పాపియాన్ అనే ప్రపంచ ప్రసిద్ధ నవలను రెక్కలు జాచిన *పంజరం* పేరిట రెండు భాగాలుగా హృద్యంగా అనువదించారు. *ఆయుధం పట్టని యోధుడు* పేరిట మార్టిన్ లూథర్ కింగ్ జీవితం తెలుగులో తీసుకొచ్చారు. గాన్ విత్ విండ్ కూడా అనువదించారు. తెలుగు భాషపై నిరంతర వ్యాసాలు రాస్తూనే వచ్చారు. ఇవన్నీ రమణారెడ్డి రచనాసక్తికి, శక్తికి నిదర్శనాలుగా నిలవడమే గాక విభిన్న ముద్ర వేశాయి. ప్రజా ఉద్యమాలు, పాలక వర్గ రాజకీయాలు, పాక్షన్ నీలినీడలు అన్నీ చూసిన ఒక పూర్వ ప్రజాప్రతినిధి ఇంత పరిణామంలో, ప్రమాణంలో రచనా వ్యాసంగం సాగించడం అరుదనే చెప్పాలి. తను రాయడమే గాక రచనలను, రచయితలను ప్రోత్సహించే ఎంవి రమణారెడ్డి సాహితీస్రవంతి శ్రేయోభిలాషిగానూ ఎంతో సహకరించడం ఇక్కడ తప్పక చెప్పుకోవలసిన విషయం. ఆయన ఆరోగ్య సమస్యలను అధిగమిస్తూ అక్షర సేవ కొనసాగిస్తారని ఆశిద్దాం. ■



## మాటల తూటాలు!

**- డా. జడా సుబ్బారావు**

*మాటలు*
*మౌనాన్ని బద్దలు కొట్టే తూటాలని*
*వాళ్లను చూసే వరకూ తెలియదు!*
*మాటలు*
*అణుబాంబు కంటే అతి ప్రమాదమని*
*వాళ్లను చూస్తే కాని తెలియలేదు!*
*అరుగుదల ఎరగని దేహాలన్నీ అలసిపోయేదాకా*
*వీధి అరుగులపై విషాన్ని చిమ్ముకుని*
*తెరల చాటున తనివితీరా కౌగలించుకుంటాయ్!*
*వ్యాపార భాగస్వాములైన తోడేళ్లన్నీ*
*ప్రజల బుర్రల్ని మలినం చేసి*
*వాస్తవాలకు మసిపూసి మాయచేస్తుంటాయి!*

*రెచ్చగొట్టే మాటలు*
*కల్లోలాలు సృష్టించే ప్రసంగాలు*
*బూతు దండకాలు, అసత్య ప్రచారాలు*
*అలవోకగా అల్లేసే కట్టుకథలు*
*మైకు విరవడాలు, కుర్చీలు విసరడాలు*
*తదితర భయానక బీభత్సాది రసావిష్కరణలన్నీ*
*అంగుళాల తెరలపై అవిశ్రాంతంగా ప్రసారమవుతుంటాయి!*
*నాలుక చివర దాచిన విషమేదో*
*ఎదుటివాడి దేహంలోని నరనరాల్లోనూ పాకుతుంది*
*నోటినిండా దాచిన అబద్ధాల అశుద్ధం*
*విలువైన జీవితాలను నిట్టనిలువునా కూల్చేస్తుంది!*
*మాటలంటే మనసుకు ఓదార్పు*
*బతుక్కి భరోసా అనుకున్నానిన్నాళ్ళు!*
*ఆయుధాలు అక్కర్లేని కురుక్షేత్రమని*
*రక్తపాతం కనిపించని రణరంగమని*
*ఇప్పుడే తెలుసుకున్నాను!* ■



# నీడలు

- సిరికి స్వామినాయుడు

79897 89893

నీడలు ..
మర్రిచెట్టులా ఊడలు దించే నీడలు!
తెర వెనుక నుంచి దేశాన్ని తోలుబొమ్మలాడిస్తున్న
నీడలు!
పీఠాల మీద పాదుకల్ని బెట్టి పాలనజేస్తున్న నీడలు !
కోట్లాది బతుకుల్ని గాలిపటాల్నిజేసి ఎగరేస్తున్న నీడలు !
అడవుల మీద నీడలు
సముద్రాల మీద నీడలు
అగాధంలో నీడలు
అంతరిక్షంలో నీడలు
పచ్చని మైదానాల మీద
పెట్టుబడుల నీడలు
పసిడి వెలుగుల పల్లెల మీద పిశాచాల నీడలు
అవినీతి జాడలు విధ్వంసపు ఊడలు

నీడలు ..
చాలు మీద నాగళ్లను సమాధిజేసే నీడలు
పేదల గుడిసెలమీద పిడుగులు కురిపించే నీడలు
ఆడదాన్ని బజారు బొమ్మని జేసీ
కాసుల ర్యాంపులమీద నడిపించే కార్పొరేట్ నీడలు
దేవుడ్ని వశపరచుకొని ఆశ్రమాల పీఠాల మాటున
కర్మసిద్ధాంతాల కాషాయ నీడలు
దలాల్ వీధుల్లో .. రంకెలేసే రాకాసి నీడలు
దేశానికి పట్టిన పీడలు
చీకటి ఓడలు గాలిలో మేడలు !

నీడలు .. నల్లచట్టాలగూడలతో
దేశసంపదను తోడుకుపోతున్న నీడలు !
కాలంలోని క్షణాలన్నీ నీడల పాదాలమీద రూపాయి పూలు
నీడల ప్రగతే ఇవాళ దేశప్రగతి
నీడల విజయాలే దేశ విజయాలు
నీలిమేఘాల్లో నీడల వేడుకలే నెట్టింట పండగలు
నీడల వారసులే నట్టింట రంగుల తెరమీద ఆరాధ్య దైవాలు
పేదల్ని పెట్టుబడి మింగేసాక
దేశం వైకుంఠపాళీ మీద నిచ్చెనలెక్కే నీడలు

ఆదానీ నీడలు అంబానీ నీడలు
బిర్లా నీడలు
క్రోనీ కేపటలిస్టుల కర్కశపాదాల క్రీనీడలు !
చట్టాలు చేస్తాయి నీడలు ! అతిక్రమిస్తాయి నీడలు !
భ్రమల్ని కల్పిస్తాయి నీడలు !
కళ్లముందు రంగుల కలల్ని వేలాడదీస్తాయి నీడలు !
తమ వెలుగులకోసం
పూరిగుడిసెల్లోని బుడ్డీలార్పేస్తాయి నీడలు !
ప్రగతి మాటున బుసలుకొట్టే అనకొండ జాడలు !

కానీ ..
చీలికపేలికల చింకిబొంతల్లాంటి జెండాల్ని పక్కనబెట్టి
నడి ఆకాశం నిప్పులజెండా ఎత్తేవేళ
జనం కాళ్లకింద నలిగిపోయేవీ నీడలే .. !!

# కసికొద్దీ కుంచె పట్టాను!



ప్రసిద్ధ చిత్రకారుడు, రచయిత, నటుడు, దర్శకుడు చంద్ర (73) దీర్ఘకాలంగా అనారోగ్యంతో పోరాడుతూ కన్నుమూశారు. సాహితీ లోకానికి, కళా ప్రపంచానికి సుపరిచితుడైన చంద్ర సాహిత్య ప్రస్థానంకు కూడా ఎంతో చేయూతనిచ్చారు. ఎన్నో చిత్రాలు గీసి ఇచ్చారు. కొన్ని సమీక్షలు రాశారు. ఆయనకు సాహిత్య ప్రస్థానం జోహారులర్పిస్తున్నది. ఆయన కుటుంబానికి, బంధుమిత్రులకు ప్రగాఢ సంతాపం తెల్పుతున్నది. చంద్ర సంస్మరణగా షష్టిపూర్తి తరుణంలో తన గురించి తనే రాసుకున్న కథనం పునర్ముద్రిస్తున్నాం.

◆ ◆ ◆

**అమెరికాలోని అట్లాంటాలో ఓ చిత్ర ప్రదర్శన జరుగుతోంది. ఓ పత్రికా ప్రతినిధి అక్కడికెళ్లాడు. ఒక్కో బొమ్మ చూస్తూ ముందుకెళ్తున్నాడు. కార్టూన్లు, పోర్ట్రెయిట్స్, గ్రాఫిక్స్, పెయింటింగ్స్, ఇలస్ట్రేషన్స్... అన్నీ చూశాడు. అక్కడున్న చిత్రకారుడిని "ఇవన్నీ మీరే వేశారా?" అనడిగాడు. "అవునని" నవ్వుతూ చెప్పారాయన. మరుసటిరోజు పత్రికలో ఓ పేజీని ఆ అంశానికే కేటాయించారు. ముప్పావు భాగం ఫొటో... మిగతా పావుభాగంలో కథనం. అదిలా మొదలైంది : 'అన్ని రకాల చిత్రాలు గీయడమంటే మాటలు కాదు. ఆ చిత్రకారుడు అబద్ధాలు చెప్పుండాలి... లేదా అద్భుతాలు చేసుండాలి.'**

**రెండో మాటే నిజం! కుంచెతో అద్భుతాలు చేసే ఆ చిత్రకారుడు చంద్ర. బొమ్మ అనగానే బాపూ తర్వాత గుర్తొచ్చే పేరు! గీతల్లో మాత్రం ఆయన తీరే వేరు! షష్టిపూర్తి చేసుకుంటున్న ఆ కాన్వాస్ చంద్రుడి జీవితంలో పున్నములు, అమావాస్యలు ఆయన మాటల్లోనే ...**

**బం**డెనక బండి.. ఏడెనిమిది ఎడ్లబళ్లు కేసముద్రం నుంచి వర్ధన్నపేట వైపు వెళ్తున్నాయి. మధ్య బండిలో అమ్మకు పురిటి నొప్పులు. కొద్ది దూరం వెళ్లాక బండి ఆగింది. 'చంద్రుడు పుట్టాడు' అంటూ ఆనందంతో మావయ్య కేక.

ఆరోజు పున్నమి. పుట్టింది నేను.

వరంగల్ జిల్లా ధన్నాసరి మా ఊరు.

బూతుబొమ్మ నేను వేసిన తొలి బొమ్మ. ఎక్కడో చూసుంటాను. బొగ్గుతో బాత్రూమ్‌లో గీశాను. నాన్న చూశాడు. వీపు చీరేశాడు. అమ్మ తిట్టింది. నిజానికి బొమ్మ అంటే ఏమిటో తెలియని వయసది. బూతు అంటే కూడా తెలియదు.

మా క్లాసులో ఇద్దరు హీరోలు ఉండేవారు.. ప్రభాకర్, ఎల్లయ్య. పంద్రాగస్టు, జనవరి 26 .. ఇలా ఏ పండగొచ్చినా మాబడిని అలంకరించేవాళ్లం. గోడలకు అతికించడానికి చార్టులేసేవాళ్లం. అన్ని బొమ్మలూ ప్రభాకరే గీసేవాడు. అక్బర్, ఔరంగజేబు, హర్షవర్ధనుడు... పాఠ్యపుస్తకంలోని బొమ్మల్ని చూసి చార్టుపై పెద్దగా వేసేవాడు. అంత అద్భుతంగా ఎలా గీసేవాడో ఇప్పటికి నాకు అర్థం కాదు. అచ్చుగుద్దినట్లు పుస్తకంలో ఉన్నట్టే ఉండేవి. మరో హీరో ఎల్లయ్య. చిరుగుల నిక్కరు. మాసిన చొక్కా. దగ్గరికెళ్తే కంపు వాసన. ఎల్లయ్యది పందులు కాసే కుటుంబం. వాడి అక్షరాలు మాత్రం ముత్యాలు. నోటు పుస్తకం ముత్యాల సరం! మా డ్రాయింగ్ సార్ పేరు రామానుజాచార్యులు. ఎత్తిన చెయ్యి దించకుండా బొమ్మలేసేవారు. అప్పట్లో నా దృష్టిలో ఆయన గీతలతో ప్రాణం పోసే సృష్టికర్త. నాకు బొమ్మలంటే ఎందుకంత ఇష్టమేర్పడిందో ఇప్పటికీ తెలియదు. నాన్న చిత్రకారుడేం కాదు. ఐదో తరగతి దాకా చదివాడు. వరంగల్ ఆజాంజాహీ మిల్స్ ఉద్యోగి. అమ్మ చదువుకోలేదు.

◆ ◆ ◆

తాతముత్తాతల నుంచి మాది వ్యవసాయ కుటుంబమే. కొన్ని కారణాల వల్ల నాన్న ఉద్యోగానికి రాజీనామా చేశాడు. దీంతో మా కుటుంబం వరంగల్ నుంచి హైదరాబాద్ వచ్చింది. నాన్న ఆప్కోలో చేరాడు. పల్లా దుర్గయ్య గారి ఇంట్లో అద్దెకు దిగాం. ఆయన ఉస్మానియాలో తెలుగు ప్రొఫెసర్. ఆ ఇల్లు కళాకారుల లోగిలి. పట్టికోట ఆళ్వారు స్వామి, శాసన పరిశోధకుడు బి.ఎన్.శాస్త్రి, దాశరథి, పాత్రికేయులు చక్రవర్తి రంగస్వామి... వీరంతా మా పొరుగువారు. ఆ గాలి సోకి నా ఆలోచనా పరిధి పెరిగింది. అప్పుడే సుల్తాన్‌పూర్ స్కూలు లైబ్రరీలో 'ఆంధ్రపత్రిక' పరిచయమైంది. వాటిలోని బాపు బొమ్మలు నాకు చిత్రలేఖన పాఠాలు. ఆ ప్రభావం నాపై చాలా కాలం ఉంది. కార్టూన్లు గీయడమన్నా నాకు ఇష్టమే.

♦ ♦ ♦

అప్పుడు నేను పీయూసీ చదువుతున్నాను. ఓ రోజు క్లాసు జరుగుతుండగా... గుమస్తా వచ్చి అంటే 'సార్ పిలుస్తుండు.. రా' అంటూ ప్రిన్సిపాల్ గదికి తీసుకెళ్లాడు. నలుగురైదుగురు పెద్ద మనుషులు కూర్చుని ఉన్నారు. వెళ్లగానే ప్రిన్సిపాల్ "నువ్వు కాలేజీ పెయింటింగ్ పోటీల్లో పాల్గొన్నావా?" అనడిగారు. 'అవును' అన్నాను. "నీ పెయింటింగ్ పేరు?" అడిగారు. "సెట్ ఇన్ డి లైట్స్..." చెప్పాను. 'అది నీది కాదు. ఎవరిదో దొంగిలించి, నీ పేరు పెట్టుకున్నావు?" అభాండం వేశారు ప్రిన్సిపాల్. కాదన్నాను. బొమ్మ నాదేనని వాదించాను. వినేదెవరు? తన పెయింటింగ్‌ని దొంగిలించి నేను పోటీకి పంపానని న్యాయనిర్ణేతగా వచ్చిన ఓ చిత్రకారుడి ఫిర్యాదు. ఆయన గొప్పవాడే. కాదనను. వాళ్లబ్బాయి నా స్నేహితుడు. వాళ్లింటికెళ్లినపుడు ఆయన బొమ్మలు వేస్తుంటే కళ్లప్పగించి చూసేవాడిని. మెలకువలు గ్రహించేవాడిని. కానీ దొంగిలించడం... ఛీ ఛీ... ఆ పనెందుకు చేస్తాను. ఆ అపనిందని మరచిపోలేకపోయాను. 'నన్ను అవమానించిన ఈ చిత్రకారుడితోనే శభాష్ అనిపించుకుంటాను. వేలెత్తి చూపిన చేతులతోనే దండలు వేయించుకుంటాను'. ఇది నా శపథం. దాన్ని నిజం చేసుకునేందుకు డాక్టరు కోర్సును వదులుకున్నాను. పీయూసీ రెండో సంవత్సరం పాసైతే .. బలవంతంగా అయినా మెడిసిన్లో చేర్పిస్తారన్న భయంతో చివరి రోజు పరీక్షలో అన్ని జవాబులు తెలిసినా ఒక్కటీ రాయలేదు.

♦ ♦ ♦

అనుకున్నట్లే పరీక్ష తప్పాను. అప్పటికి నా వయసు పందొమ్మిది. మా పొరుగింట్లో ఓ అమ్మాయి ఉండేది. టీచర్. తనంటే నాకు ఇష్టం. పెళ్లి చేసుకుంటానన్నాను.. ఆమె తొలుత అభ్యంతరం చెప్పింది. ఎందుకంటే నాకంటే ఆమె పెద్దది. చివరికి నా మాటే నెగ్గింది. ఇంట్లో వాళ్ళు కాదన్నారు. ఓ ఇల్లు అద్దెకు తీసుకుని కాపురం పెట్టాం.. కాలేజీలో బ్యాచిలర్ డిగ్రీ చదువుతూనే 'యువ' పత్రికకు బొమ్మలేసేవాడిని. కొడుకు నెత్తుకుని కాలేజీకి వెళ్లిన రోజులున్నాయి. 'యువ', 'జ్యోతి, జ్యోత్స్న, పేరున్న పత్రికలన్నింటికీ నేనే ఆస్థాన చిత్రకారుడిని. రంగనాయకమ్మ, తురగా కృష్ణమోహన్, నెల్లూరు కేశవరావు వంటి పేరున్న రచయితల కథలకు బొమ్మలేసే భాగ్యం దక్కింది. వారి రచనలతో పాటు నా బొమ్మలూ జనంలోకి వెళ్లాయి. అలా నేను పాపులర్ అయ్యాను. అది నా అదృష్టం. ఆ సమయానికి ప్రొఫెషనల్ ఆర్టిస్టులూ పెద్దగా లేరు. 'సరాగం' చిత్రకారులు ఏ.ఎస్. మూర్తి రామారావు, గంగాధర్ విడిపోయారు. శంకర్, చిత్ర చందమామకే పరిమితమ య్యారు. శీలా వీర్రాజు అడిగినవారికే బమ్మలేసి ఇచ్చేవారు. ఆ పరిస్థితుల్లో బాపు తర్వాతి స్థానం ఎవరిది? అన్న ప్రశ్నకు జవాబు నేనే అయ్యాను.

♦ ♦ ♦

ఓ దశలో కమ్యూనిజం నన్ను ఆకర్షించింది. జన చైతన్యానికి కళను ఓ ఆయుధంగా మలచుకోవాలనుకున్నాను. విరసం సభ్యుడిని అయ్యాను. 'చంద్ర చిన్నచిన్న గీతల్లో లోతైన భావాల్ని నింపగలడు' అని శ్రీశ్రీ నన్ను మెచ్చుకున్నారు. బెంగాల్లో చిత్తప్రసాద్‌ని మినహాయిస్తే.. విప్లవానికి అండగా నిలిచిన చిత్రకారుడిని నేనొక్కడినే!

ఓసారి ఏదో సదస్సులో నా చిత్రాల ప్రదర్శనను ఏర్పాటు చేయాలనుకున్నాం. కానీ నాకు వెళ్లడం కుదరలేదు. నేను గీసిన పెయింటింగులు మిత్రులకిచ్చి పంపాను. వాళ్ళు కట్టగట్టి వాటిని బస్సుపైన వేశారు. కొద్దిదూరం వెళ్లాక ఈదురు గాలి.. నా బొమ్మలన్నీ చెల్లాచెదురైపోయాయి. రోడ్డుపై పడ్డాయి. అది చూసిన రైతు కూలీలు బస్సు ఆపారు. మట్టిని తుడిచి నా స్నేహితుల చేతుల్లో పెట్టారు. "ఈ బొమ్మల్ని చూస్తే మీకేమనిపిస్తోంది?" అని అడిగాడు ఆ మిత్రుడు ఆ కూలీల్ని. వారు ఏవో సమాధానాలు చెప్పారు. ఈ విషయాలన్నీ నాకు తర్వాత తెలిశాయి. 'శ్రామికులు ఏమన్నారు?' తరచి తరచి మిత్రుల్ని అడిగాను. ఆ సమాధానాల్ని మళ్లీ మళ్లీ విన్నాను. విశ్లేషించుకున్నాను. నేను ఎవరికోసం ఈ బొమ్మలు గీతానో.. వారికి నా భావాలు చేరలేకపోయాయి. చిత్రకారుడిగా ఇది నా వైఫల్యం. ఉ ద్యమానికి నేను చేసింది శూన్యం. ఇంకా అక్కడెందుకు? అందుకే విరసం నుంచి తప్పుకున్నాను.

♦ ♦ ♦

మూడున్నర దశాబ్దాల క్రితం... కలల్లో విహరించే కథను జనం మధ్యకు లాక్కొచ్చిన న్యూ వేవ్ రైటర్లలో నేనూ ఒకడ్ని. 150కి పైగా కథలు రాశాను. యర్రంశెట్టి శాయి, వీరభద్రరావు పమ్మిలతో కలసి గొలుసు నవలా రాశాను. వాటన్నిటినీ ఓ పుస్తకంగా తీసుకురావాలి. కానీ ఒక్క కథా నా దగ్గర లేదు. 'చిల్లర దేవుళ్లు', 'చలి చీమలు', 'తరం మారింది'. 'ఓ అమ్మ కథ', 'మంచు పల్లకి', 'డిటెక్టివ్ నారద... ఇలా పాతిక చిత్రాలకు కళాదర్శకుడిగా పనిచేశాను.

♦ ♦ ♦

నలభై ఏళ్ల వయసులో అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో ఆర్టిస్ట్‌గా చేరాను. అదీ మా అవిన పోరు పడలేకే. ఓసారి ఢిల్లీ జవహర్లాల్ యూనివర్సిటీ నుంచి ఓ విద్యార్థి వచ్చాడు. కళలపై పరిశోధన చేస్తున్నాడట. పరిచయాలు, చాయ్, సిగరెట్లు అయ్యాక చర్చ మొదలైంది. "చిత్రకారుడు తన ఊహలకు ప్రాణం పోసే ప్రయత్నం చేస్తాడు. ఊహ ఎప్పుడూ చిత్రం కంటే అందంగా ఉంటుంది కదా..' అంటూ మొదలుపెట్టాడా కుర్రాడు. 'లేదు.. ఏ చిత్రకారుడైనా ఈ మాట అంటే అది ఆత్మవంచనే' అవుతుంది. ఆర్టిస్ట్ తన చిత్రం తుది రూపాన్ని ముందే ఊహించలేదు. అది అసాధ్యం. ఓ బొమ్మకు ప్రాణం పోస్తున్న ప్రయత్నంలో మధ్యలో కొన్ని ఆలోచనలు తోడవుతాయి. అవి కొన్నిసార్లు అద్భుతంగా ఉ ండొచ్చు. మా ఆవిడ రోజూ పప్పుచారు చేస్తుంది. కొన్నిసార్లు చాలా రుచిగా ఉంటుంది. అది ముందుగానే రుచిగా చేయాలని అనుకుని చేయడం కాదు. అలా కుదురుతుందంతే! ఇది చిత్రాలకూ వర్తిస్తుంది' అని తేల్చి చెప్పాన్నేను. 'నేను తప్పు చేశాను. చాలా పెద్ద తప్పు చేశాను. అందరికంటే ముందు మిమ్మల్ని కలవాల్సింది. ఎందుకంటే.. నా థీసీస్‌లో బలం లేదని ఇప్పుడు తేలిపోయింది' అంటూ దండం పెట్టి వెళ్లిపోయాడు.

♦ ♦ ♦

నాకు అరవై ఏళ్లు నిండాయి. షష్టిపూర్తి చేసుకుంటున్నా. నేను చేయాల్సిన పనులు మాత్రం ఇంకా పూర్తి కాలేదు. ఇంకో అరవై ఏళ్లు బొమ్మలేస్తూనే బతకాలనిపిస్తోంది. 'ఒక తరమో, రెండు తరాలో చంద్ర అనే చిత్రకారుడు ఉండేవాడు.' అని గుర్తుపెట్టుకుంటే చాలు. అంతకంటే కీర్తికిరీటాలు అక్కర్లేదు.

**(2006 ఆగస్టు 20 నాటి ఈనాడు ఆదివారం అనుబంధం నుంచి)**

■

## యుద్ధమూ శాంతి

**మ**నిషికి మనిషికి యుద్ధం
ప్రాణాల్ని బలిగొనడమే విజయం
మానవ మనుగడ రెండు విభిన్న సంఘర్షణలు
తాసుకేలాడాదీసినట్టు
ఎవడి పోరాటం వాడిదే
చివరకు మిగిలేది దుఃఖం
ఎన్నో జీవితాలు దిక్కులేని అనాథలయ్యి రోడ్డునపడడమే
గెలుపు పొందిందెవరో తెలియదు
కొందరికి మోదం ఇంకొందరికి ఖేదం
జీవనగమనం గాడినపడేందుకు మళ్ళీ ఓ జీవితకాలం
యుద్ధం ఏమిచ్చిందో కోల్పోయిన మనుషులనడుగు
గెలిచినవాడికి తెలుసు మరణం మళ్ళీ ఎటువైపు దాడిచేస్తోందని
యుద్ధంలో మరో చావో...పుట్టుకో..?
యుద్ధం చేసేవాడి అంతరంగం చదివినవాడెవడు!?
ఎంతమంది హృదయ గాయాలు
ఎన్ని కన్నీటి సంద్రాలు నింపాయో?
ప్రతి యుద్ధం ఎన్ని గుండెల్లో
చావు చిత్రాలు ముద్రించిందో..?
నిశ్శబ్దం బద్దలవ్వని మూగభావాలెన్నో..
కాలమేదైనా కాయం ఎన్ని సంతోష స్వప్నాలతో
ఊహలమేడలు కట్టుకున్నదో?
మనిషో మానవ బాంబుగా మౌనంగా బలైన జీవితాలెన్నో?
యుద్ధ సృష్టించిన నష్టం ఎరుకున్న తరమే కదా ఇది
గతాన్నొక్కసారి గమనిస్తే
అడుగేయగలమా ఆ వైపు?
వినాశనమెంత ఘోరంగా
విశ్వం విలవిలాడిందో
గడ్డికూడా మొలకెత్తనంతగ పుడమి అవిటిదైపోయింది
చర్చించు మళ్ళీ చర్చించు
జయమే అంతిమంగా
జాతులు వేరేం కాదు అంతా మనిషి జాతే
మనిషి మనిషితోనే సావాసం చేయాలి
మమతానురాగాల మనసును నిర్మించుకొని
శాంతి వనాలు వికసించేలా
పుడమి అంతా శాంతి ఎదతో పులకించాలి!

**- సి.శేఖర్ (సియస్సార్),**
**90104 80557**



# నాన్న అప్ప

తమిళ మూలం : 'తామరై'
అనువాదం : **జిల్లేళ్ళ బాలాజీ**

**"నా**న్నోయ్..." అని గట్టిగా అరుచుకుంటూ రవి ఇంటి దగ్గరకు వచ్చేసరికి ఇల్లు నిశ్శబ్దంగా ఉంది. అలవాటు ప్రకారం నాన్న గుమ్మం దగ్గరికొచ్చి ఆహ్వానించలేదు. రవికి తాను మోసపోయినట్టుగా అనిపించింది.

ఇంటి అరుగుమీదికెక్కి కుడిపక్కనున్న కిటికీ చువ్వపైన కాలుపెట్టి మెల్లగా ముందుకు తొయ్యగానే అది తెరుచుకుంది. లోపల త్రిభుజాకారంలోని దీపం గూట్లోకి చెయ్యి పోనిస్తుండగా కాలు జారింది. "నాన్నోయ్..." అని మళ్లీ అరిచి కిటికీ చువ్వను గట్టిగా పట్టుకున్నాడు. కింద పడిపోకుండా తప్పించుకున్నాడు.

అంతలో లోపల శబ్దం వినిపించింది. "రవీ, కన్నా... ఇదిగో వచ్చేశా..." అది నాన్న గొంతే... రవికి ఎంతో ప్రశాంతంగా అనిపించింది. తలుపు తెరవగానే, భుజానికున్న పుస్తకాల సంచీని అలాగే అరుగుమీదికి విసిరేసి లోపలికి పరుగెత్తాడు. నాన్న ఒళ్లోకి ఎగిరి దూకాడు. చక్రాల కుర్చీలో ఉన్న కణ్ణప్పన్ వాణ్ణి పట్టుకోవటానికి కష్టపడ్డాడు. "జాగ్రత్త... జాగ్రత్త... మెల్లగా రవీ. నాన్నకు నొప్పి కలుగుతుందిగా?" చక్రాల కుర్చీ వెనక్కు జరిగింది. వరండా స్తంభానికి గుద్దుకుని ఆగింది.

"రవీ... సంచీ ఏదీ?" అని అడిగిన ప్రశ్నకు రవీ గుమ్మం వైపు చెయ్యి చూపించాడు. "నాన్నా ఇవ్వాళ మాస్కూలు వెనకున్న వేపచెట్టు పైకెక్కాం. సెంధిల్ కిందపడ్డాడు. మందు రాశారు." అని చేతులూపుతూ చెప్పేసరికి కణ్ణప్పన్‌కు దిగులేసింది. మొరటు పిల్లవాడుగా ఉన్నాడే!

"రవీ... చూడూ... పుస్తకాల సంచీని ఇలాగంతా బయటే పడేసి రాకూడదని చెప్పానుగా... అమ్మ చూసిందంటే ఇక అంతే! చచ్చాం... వెళ్లూ... మొదట దాన్ని తీసుకొచ్చి కొక్కేనికి తగిలించెయ్. కాళ్లూ చేతులూ కడుక్కుని రా... ఇద్దరమూ కాఫీ తాగుదాం... సరేనా?" అనగానే రవి కొంతసేపు ఆలోచించాడు.

"నాన్నా... తొందరగా తాగేసి ఇయ్యాలా కిరికెట్ ఆడదామా నాన్నా? అమ్మ వొచ్చేలోగా..." వాడి గొంతు అభ్యర్థించింది.

కణ్ణప్పన్ మనసు ద్రవించింది. "ఆడదాం రా కన్నా... కానీ, నేను చెప్పినట్టు వినాలి. మంచి పిల్లవాడిగా ఉంటేనే అన్నీనూ, ఏం?" "అలాగే నాన్నా" అంటూ తండ్రి ఒళ్లో నుంచి దిగి అరుగు దగ్గరికి పరుగెత్తాడు. గబుక్కున వాడు కిందికి దిగటంతో కణ్ణప్పన్‌కు కట్టుకట్టిన కాల్లో నొప్పి కలుక్కుమంది. పళ్లు గిట్టకరుచుకుని ఓర్చుకున్నాడు.

ఎండలు తీవ్రతరమయ్యాయి. నాలుగున్నర గంటలైనా ఇంకా ఎండ దంచేస్తున్నా ఇంకో అర్ధగంటలో చప్పున సాయంత్రమై పోతుంది. ఉదయం నుంచి ఇంట్లో అలుముకున్న నిశ్శబ్దం ఇప్పుడు దూరమైనప్పటికీ లోపల గది గోడల్లో ఆ మౌనం ఇంకా భయాన్ని కలిగిస్తోంది. మల్లికా బస్సు మారి ఇంటికి రావటానికి ఇంకా గంట పడుతుంది. ఆరుగంటలలోపు ఇంటికి రావటానికి ఆమెకు వీలుకావటం లేదు. అందులోనూ ఓవర్ టైమ్ అంటే ఇంకా సమయం పడుతుంది. బస్టాండులో వెలుతురు ఉన్నప్పటికీ నడిచొచ్చే దారంతా చీకటే. సమయం మించి వచ్చే భార్యను వెళ్లి తీసుకురావటానికి వీల్లేని పరిస్థితి; ఎంతటి బాధాకరం!

అముదా స్కూలు అయిపోగానే టైప్ రైటింగ్ క్లాసుకు వెళు తుంది. బస్టాండుకు దగ్గరే. కొన్నిసార్లు అమ్మాకూతుళ్లిద్దరూ కలిసి వస్తారు. వాళ్లు వచ్చేంతవరకూ రవిని చూసుకోవాలి. చాలా మొరటువాడిగా ఉన్నాడు. చాలా రోజుల తర్వాత పుట్టే బిడ్డలు ఇలాగే చాలా చురుగ్గా ఉంటారు కాబోలు.

మల్లికా వచ్చేసరికే అలసి నీరసించిపోయి వస్తుంది. కోపమూ అసహనమూ కలిసి రుసరుసలాడుతుంది. ఆమెను తప్పు పట్టటంలో న్యాయం లేదు. అదీకాక భర్త ఆరోగ్యం చెడి, గుండె ఆపరేషను, చక్కెర వ్యాధితో అజాగ్రత్తగా ఉండి ఒక కాలును తీసేసి ఇంటికే పరిమితమై చక్రాల కుర్చీలో ఉండటం, బయటికే వెళ్లని వ్యక్తిపైన ఉన్నట్టుండి ఇంటి బాధ్యతలన్నీ పడితే..! ఒంటి మనిషి ఆమె మాత్రం ఏం చెయ్యగలుగుతుంది? మధ్య తరగతి కుటుంబంలో ఇన్ని పరీక్షలు తట్టుకోగలరా?

కణ్ణప్పన్ పనిచేసిన కంపెనీ ఆదరించటంతో కుటుంబం ఈ మాత్రమైనా నిలదొక్కుకో గలుగుతోంది. మల్లికా ఎప్పుడో చదివిన ఎస్సెస్సెల్సీకి పట్టిన అదృష్టం – బూజు పట్టిన సర్టిఫికెట్ సరిపోతుందని కంపెనీ ఇచ్చిన గుమస్తా ఉద్యోగం ఒక గొప్ప వరం.

కోయంబత్తూర్ జిహెచ్‌లో ఆపరేషన్ పూర్తయ్యి ఇంటికొచ్చాక వెయ్యి హెచ్చరికలు. చక్కెర విషయంలో ఎంతో నియంత్రణ, సమయానికి మందులు మాత్రలు, ఎప్పుడూ విశ్రాంతి, కష్టపడకూడదు. దెబ్బలు తగలకూడదు.

కానీ అదెలా సాధ్యం? ఆడుతూ పాడుతూ పనిచేసిన కాళ్లు ఊరికే ఉండటానికి వీలవుతాయా? కాళ్లు కావు, కాలే... ఇంకా ఆ పుండు ఆరలేదు. భార్య బయటికెళ్లి ఉద్యోగం చెయ్యటం వల్ల, ఇంట్లో పనులైనా చేసిపెడితే ఆమెకెంతో ఉపయోగకరంగా ఉంటుందనుకుని... చక్రాల కుర్చీని జరుపుకుంటూ చిన్న చిన్న పనులు చేసేవాడు. ఇంటిని అరకొరగా చిమ్మి, వరండాలో ఆరే బట్టల్ని కూర్చున్నచోటు నుంచే కర్రను చాపి లాక్కొని మడిచి అల్మైరాలో పెట్టి, ఉదయం పడేసిపోయిన పాత్రలను కడిగి, సర్ది... వంటగదిలోకి వెళ్లటమే కష్టం. కాస్త ఎత్తుగా ఉండే మెట్టును దాటేలోపు ప్రాణం పొయ్యి వచ్చేది. మల్లికా, "మీరేమీ చెయ్యకండి. విశ్రాంతి తీసుకోండి చాలు. ఏదైనా చెయ్యబోయి మళ్లీ మీకేదైనా అయితే నేను తట్టుకోలేను." అనేది.

భయం! న్యాయమైన భయం. ఏదో పేరుకోసం భర్త ఉంటే చాలు. నడవకపోయినా పర్లేదు. ప్రాణమూ, శరీరంతో కదులుతూ ఉంటే చాలు. ఎంత కష్టమైనా పడటానికి తయారు. కానీ పూర్తిగా భర్తే లేకపోతే వచ్చే కష్టానికి తయారుగా లేదు.

అముదా తెలివైంది. స్కూలు నుంచి ఇంటికి రాగానే నాన్నకు అవసరమైన వాటిని చేసిన తర్వాతే బట్టలు మార్చుకోవటం మొదలు మిగతావన్నీ. కానీ అతిగా ఉండే ఆరేళ్ల పిల్లవాణ్ణి ఎలా నియంత్రించటం? ఎప్పుడూ ఆటలే. అరుగు మీదికెక్కి కిటికీ మీద కాలుపెట్టి దభీమని వీథిలోకి దూకటం.

మల్లికా మొదటి భయం రవే. విశ్రాంతి తీసుకోవల్సిన భర్తను విసిగిస్తున్నాడే అని! ఎప్పుడూ 'నాన్నా, దొంగా పోలీస్ ఆడదామా? నాన్నా మేడమీదికి వెళ్ళిపోదాం నాన్నా, నాన్నా అత్తికాయల్ని కోద్దాం నాన్నా...' వాడి నుంచి ఆయనను ఎలా రక్షించటం? ఉదయం తను వెంటబెట్టుకుని బడికి తీసుకెళ్లిపోవచ్చు. మధ్యాహ్నం ఇంటికి రాకుండా టిఫిన్ బాక్స్. కానీ సాయంత్రం బడి అయిపోగానే ఇంటికి పరుగెత్తుకొచ్చే పిల్లవాణ్ణి ఏం చెయ్యగలం?

నియంత్రించి చూసింది. తిట్లూ కొట్లూ స్వీకరించి వాడు మళ్లీ అవే చేస్తున్నాడు.

'నష్టజాతకుడా... అప్పులోడా...' అంటూ రోజుకు వందసార్లయినా తిట్టించుకునేవాడు. కణ్ణప్పన్‌ను అర్థించింది : "మీరైనా జాగ్రత్తగా ఉండండి. అతిగా ముద్దు చెయ్యకండి.. దగ్గరకు రానివ్వకండి.. రెండు అదిలింపులు అరిచి దూరంగా ఉంచండి. మీ కాళ్లకు మొక్కుతా..."

చెప్పటమే కాక ఆయన కాళ్ల మీద పడి ఏడ్చింది. కూతురూ ఏడ్చింది. అమ్మా, అక్కా ఏడవటం చూసి రవి కూడా ఏడ్చాడు. "నీవల్లే రా కుట్టి పిశాచీ, ఇన్ని కష్టాలూనూ..." అని అక్క గొణగటం వినబడినా రవికి అర్థం కాలేదు.

కణ్ణప్పన్ ఎంత జాగ్రత్తగా ఉన్నప్పటికీ బిడ్డను నిజంగా కసురుకోవటానికి వీలుకావటం లేదు. వచ్చి పైన పడేవాణ్ణి 'దూరంగా పో' అని నెట్టెయ్యలేకపోతున్నాడు. మిగతా సమయాల్లో కఠినంగా ఉన్నట్టు కనిపించినప్పటికీ మల్లికా ఇంట్లో లేని ఆ సాయంకాలం రెండు గంటల సమయంలో రవికి ఏ ఆజ్ఞా వెయ్యలేకపోతున్నాడు.

పాత కాలపు ఇల్లు, పెద్ద ఇల్లు. కణ్ణప్పన్ తండ్రి ఇచ్చిపోయిన ఆస్తి. వరండా, నాలుగు వైపులా వేర్వేరుగా గదులూ, వంట గది, పెరడు, వరండా లోపలి నుంచి పైకి వంపులు తిరుగుతూ వెళ్లే మేడమెట్లు, పైన చిన్న మేడగది ఉంటాయి. అలాంటి ఇంట్లో పరుగెత్తి ఆడుకోకూడదు అంటూ ఆ చిన్నపిల్లవాడిని శాసించటం ఎంత ఘోరం!

దొంగా – పోలీస్ ఆడబోయి చక్రాల కుర్చీ గోడకు గుద్దుకుని కిందపడి కాలికి దెబ్బ తగిలి రక్తం కారటం ప్రారంభమై... మల్లికా

'జాగ్రత్త... జాగ్రత్త...' అని ఎందుకు అంతగా హెచ్చరిస్తుందో అది జరగనే జరిగింది. రక్తం ఆగకుండా కారసాగింది. కింద పడిపోయి ఇరుగు పొరుగున ఎవరినీ పిలవలేక అలాగే ఉండిపోయి, రక్తం బాగా కారిపోయి, ఆఫీసు ముగించుకొని ఇంట్లోకి అడుగుపెట్టిన మల్లికా పరిస్థితిని చూసి కేకలు పెట్టి ఆ అదురుకు స్పృహ తప్పి... మళ్లీ కాలయాపన జరిగి...

ఆరోజు ఎంతో అదృష్టం. పక్కింటి బంధువులు ఎవరో కార్లో వచ్చారు. వెంటనే భర్తను కార్లో వేసుకుని తుడియలూరులో ఒక నర్సింగ్ హోంలో ప్రాథమిక చికిత్స చెయ్యించి, తర్వాత జిహెచ్‌లో చేర్పించి... కణ్ణప్పన్ ప్రమాదస్థితి నుంచి బయటపడ్డం ఆశ్చర్యమే! (ఇంటికొచ్చాక చేతికి దొరికిన స్కేలుతో రవిని వాతలు తేలేలా కొట్టింది మల్లికా)

కణ్ణప్పన్ చాలా రోజుల తర్వాత ఆసుపత్రి నుంచి ఇంటికి రాగానే, "ఆయనుండే గదిలోకి కాలు పెట్టావంటే కాలిని విరిచేసి పొయ్యిలో పెట్టేస్తాను." అని భయం పెట్టింది. దానికంతా భయపడి కాస్త అణకువగా ఉన్న రవి, ఆయన ఆరోగ్యం కాస్త కుదుటపడేసరికి మునుపటిలాగానే ఉత్సాహంతో తుళ్లిపడటం మొదలుపెట్టాడు.

మల్లికా పడుతున్న కష్టాలను చూసి ఆవేదన చెందీ కణ్ణప్పన్‌కు మనసు మూగపోయింది. అర్థం లేని ఈ జీవితం తొందరగా ముగిసిపోవాలని ఎందుకో అనిపించసాగింది. ఈలోపు రవిని కంట్రోల్ చెయ్యాలని మునుపెన్నడూ లేనంత కోరిక...

కొద్ది రోజులుగా బళ్లో క్రికెట్ ఆట నేర్చుకొచ్చి రోజూ ఇంట్లో దాన్ని ఆడాలని మొండికేస్తున్నాడు. కణ్ణప్పన్, మల్లికాకు తెలియకుండా పక్కింటి పిల్లవాడితో చెప్పి ఒక ప్లాస్టిక్ బ్యాటూ బంతీ తెప్పించాడు. దాన్ని దాచటానికే గొప్ప ఆలోచన చెయ్యాల్సి వచ్చింది. రవి ఆట వస్తువులన్నింటినీ మల్లికా నిజంగానే పొయ్యిలో వేసి కాల్చేసింది. 'ఏదైనా ఆట ఆడతానని నాన్న మీద పడిందో చంపేస్తాను అప్పుడోడా.' అంది. ఈ ఇంట్లో మల్లికా కంటికి కనిపించకుండా ఈ బ్యాటునూ బంతినీ ఎక్కడ దాచిపెట్టాలి?

రవినే ఒక అద్భుతమైన చోటును కనిపెట్టాడు. చీకటిగా ఉన్న మేడమెట్ల మలుపులో పైగదికి తిరిగే చోట ఎడమ పక్కన ఒక చిన్న చెక్కపెట్టె ఉంది. ఒకవైపు గోడకు కలిపి ఉండటం వల్ల మరోవైపు తెరుస్తూ మూసే విధంగా ఏర్పాటు చెయ్యబడింది. క్రికెట్ బ్యాటూ బంతీ అక్కడ దాక్కున్నాయి.

సాయంత్రం కాగానే దాన్ని తీసుకొచ్చి నాన్న దగ్గరకిచ్చి తనివితీరా ఆట్లాడుకోవటమూ, అమ్మ వచ్చేముందు ఎంతో జాగ్రత్తగా మేడ మలుపులో వాటిని దాచిపెట్టటమూ జరుగుతోంది.

పెట్టటమే కాకుండా, నాన్న దగ్గరికొచ్చి కళ్లను మాత్రం తిప్పుతూ 'దాచేశాను' అన్నట్టుగా తలాడించేవాడు. గుర్తుగా 'రేపు మళ్లీ ఆటాడుదామా... నువ్వు ఈరోజు క్యాచ్ ఇవ్వనేలేదు.' అనేవాడు. ఇంత చిన్నపిల్లవాడికి ఎన్ని ఆలోచనలు ..!

ఆడుతూ ఉంటే... మల్లికా వచ్చే శబ్దం వినబడగానే ఆట అంతటితో ముగిసేది. కానీ రహస్యంగా రాత్రి నిద్రపోయేంతవరకూ, "నాన్నా నువ్వు నాకు క్యాచ్ ఇవ్వనేలేదు." అని చెబుతూనే ఉండేవాడు. నిద్రలో చేతుల్ని ఎత్తి బ్యాట్‌ను ఊపేవాడు. "క్యాచ్, క్యాచ్..." అంటూ గొణిగేవాడు.

రవి బళ్లో నేర్చుకొచ్చిన లెక్కలేనన్ని సాంకేతిక పదాల్లో 'క్యాచ్' కూడా ఒకటి. క్రికెట్ భాష. మొదటే బ్యాట్ చేసేవాడు. రోజూ ఈ ఆటకోసమే బడి వదిలిపెట్టగానే పరుగు పరుగున వచ్చేవాడు. సరాసరి మేడమీదికెళ్లి బ్యాట్‌ను ఎత్తుకొచ్చేవాడు.

"నాన్నోయ్ వచ్చేశా..." అని అరుస్తూ వచ్చినవాడు కాళ్లూ చేతులూ కడుక్కుని తొందర తొందరగా కాఫీ తాగేసి బ్యాట్‌నూ బంతినీ తీసుకొచ్చాడు. ఆట మొదలైంది. అర్ధగంట అయ్యాక కణ్ణప్పన్‌కు వీలుకాలేదు. ఊపిరి కష్టమైంది. చెమటలు పట్టటం మొదలైంది. 'ప్రమాదం' అంటూ అంతరాత్మ హెచ్చరించింది. మెల్లగా ఆటను ఆపాడు. రవి మొండికేస్తాడని తెలిసి, "అమ్మ తొందరగా వస్తున్నట్టుంది. తొందరగా పరుగెత్తుకెళ్లి బ్యాట్‌ను పెట్టేసి వచ్చేయ్"... అని తొందరపెట్టేసరికి, రవి గబగబా మెట్లెక్కి రహస్య స్థలంలో వాటిని దాచేసి ఏమీ ఎరగనట్టుగా కిందికి దిగొచ్చి నాన్న పక్కన నిలబడ్డాడు. కానీ అమ్మ రాలేదు, మోసం!

"ఏంటి నాన్నా... అమ్మ రాలేదు. నువ్వు ఔట్ కాగానే నేనే బ్యాటింగ్ చెయ్యాలి, అంతలో ఎందుకు ఆపావు?"

"కన్నా, అమ్మ వస్తున్నట్టుగా శబ్దం వినిపించింది. అందుకే, ఉన్నట్టుండి వచ్చేసిందంటే ఏం చెయ్యగలం? తర్వాత తెలియకుండా ఆడటమూ ఆగిపోతుంది... బ్యాట్‌లన్నీ పొయ్యిలోకి వెళ్లిపోతాయి. నీకు దెబ్బలు పడతాయిగా? అందుకనే జాగ్రత్తగా ఉండాలని అలా చెప్పాను."

కణ్ణప్పన్ బుజ్జగించటంతో కాస్త ఓదార్పు పొందాడు. ఆ వెంటనే "నాన్నా ఐస్ నెంబర్ ఆట్లాడదామా నాన్నా." అని మొదలుపెట్టాడు. సరిపోయింది. మల్లికా వచ్చేంతవరకూ వీణ్ణెలా తట్టుకోను? మాటలు కలుపుతూ వాణ్ణి పట్టి ఉంచాలి.

"వద్దు కన్నా... మనిద్దరమూ కొంతసేపు మాట్లాడుకుంటూ ఉందాం. ఇవ్వాళ స్కూల్లో ఏం చెప్పారు?"

"తీసివేతల లెక్కలు చెప్పించారు – మా లెక్కల టీచరు. రిజిష్టర్‌లో ఇంక్ పోసినందుకు గాను పెరుమాళ్‌ను కొట్టారు.

అప్పులోడా, ఇకమీదట ఇంక్‌పై చెయ్యి వేస్తావా? అంటూ తిట్టారు."

"నాన్నా, అప్పులోడంటే ఏమిటి నాన్నా?"

"అప్పులోడంటే – మనం ఎవరి దగ్గరైనా ఏదైనా తీసుకొని ఉంటే వెంటనే తిరిగిచ్చేయాలి. అలా ఇవ్వకపోతే వాళ్లచ్చి మళ్లీ మనల్ని అడుగుతారు. ఇవ్వకుండా ఉండిపోతే మనం అప్పులోళ్లం అయిపోతాం."

"ఆ రోజు మీసాల మామ వచ్చి మీ దగ్గర అప్పును తిరిగివ్వమని అడిగాడే, ఆ అప్పా?"

మొత్తం చూసినట్టున్నాడు. ఇంటిమీద తీసుకున్న అప్పు, వడ్డీ నెలనెలా కడుతున్నా అసలు తిరిగివ్వమని అడుగుతున్నారు శెట్టిగారు."ఔను కన్నా... నాన్నకు ఒంట్లో బాగాలేదు. ఆయన దగ్గర అప్పు తీసుకున్నాం. తిరిగివ్వాలిగా? దాన్నే అడుగుతున్నారు."

"ఎందుకు నాన్నా తిరిగివ్వలేదు.?"

మొదలయ్యాయి పిల్లల ప్రశ్నలు. లెక్కలేనన్ని ప్రశ్నలు. ఒకటి చెబితే దాన్నుంచి ఇంకో కొత్త ప్రశ్న... మనం ఊహించి కూడా చూడలేని ప్రశ్నలన్నీ ఎలా ఆ చిన్ని తలలో నుంచి పుట్టుకొస్తాయో?

"మన దగ్గర ఇప్పుడు లేదు... అందుకే ఇవ్వలేదు..."

"ఇవ్వకుండానే పొమ్మని తరిమేద్దామా నాన్నా?"

"అయ్యయ్యో... అలా చెయ్యకూడదు. తీసుకున్న అప్పును సక్రమంగా తిరిగిచ్చేవాళ్లే చాలా మంచివాళ్లు. మన దగ్గర ఉంటే మనమే తీసుకెళ్లి తిరిగిచ్చెయ్యాలి అప్పును. వాళ్లు అడిగేంతవరకూ పెట్టుకోకూడదు."

"నువ్వు మంచివాడివా నాన్నా?"

కణ్ణప్పన్‌కు కళ్లు తడి అయ్యాయి. ఎవరు మంచివాడు, ఎవరు చెడ్డవాడు?

అన్నీ మంచిగా ఉన్నప్పుడు మంచివాడుగా ఉండటానికి వీలవుతుంది. తారుమారైనప్పుడు అన్నీ మారిపోతాయి. వినకూడని మాటల్ని ఎదుటివాళ్ల నోటినుంచి వస్తున్నప్పుడు... ఒకవేళ చెడ్డవాడై పొయ్యామా? జీవితం చెడినవాడు చెడ్డవాడా?

"మనమంతా చాలా మంచివాళ్లం కన్నా. కచ్చితంగా అప్పును తిరిగిచ్చేద్దాం. నువ్వు దిగులు పడొద్దు, ఏం కన్నా?"

"లేదు నాన్నా. చెడ్డవాళ్లు అయితే దేవుడొచ్చి రాత్రి కళ్లు పొడిచేస్తాడట... మా టీచర్ చెప్పింది. నాన్నా, నేను మంచివాణ్ణేనా నాన్నా?" బిడ్డ ప్రశ్నలో ఒక అర్థింపు కనిపించింది. వెంటనే బదులు చెప్పకపోతే దేవుడు, ఎదుట శూలం పట్టుకొని కళ్లు పొడవటానికి తయారుగా ఉన్న భయంతో కళ్లను విప్పార్చి చూస్తున్నాడు.

"ఇప్పుడే చెప్పాను. మనమంతా మంచివాళ్లం. నువ్వు మంచివాడివి. అమ్మ మంచిది, అముదా మంచిది..."

"అయితే ఎందుకు అమ్మ ఊరకూరకే నన్ను అప్పులోడా అని తిడుతూంటుంది? నేను అప్పేమీ అమ్మ దగ్గర తీసుకోలేదు నాన్నా" ఇలా అంటున్నప్పుడు వాడిలో ఏడుపు.

"అందుకు కాదు కన్నా... అమ్మ ఊరకే కోపంలో అలా అంటుందంతే!"

"కానీ నేను అప్పు తీసుకోలేదు నాన్నా... నిజంగా!"

"అప్పంటే డబ్బేనా? రేపు నువ్వు పెద్దవాడివై అమ్మకు ఇల్లు, కారు అన్నీ తీసివ్వాలిగా.. అందుకే ఇప్పటినుంచే ఉత్తినే అలా చెప్పి పెడుతుంటుంది..."

తర్వాతి ప్రశ్నకు వాడు నోరు తెరిచేలోపు గుమ్మం దగ్గర చెప్పుల శబ్దం వినిపించింది. రవి నోరూ మూతబడింది. కణ్ణప్పన్ వాణ్ణి ఒళ్లో నుంచి దింపి, నోటిమీద వేలిని పెట్టి, "బుద్ధిగా ఉండాలి. నా దగ్గరికి రాకూడదు. వెళ్లి తలుపు తెరిచి అమ్మ సంచీని తీసుకొని రా..." అని రహస్యం చెబుతున్నట్టుగా చెప్పాడు.

రవి పరుగెత్తాడు. ఇల్లంతా ప్రశాంతంగా ఉండటాన్ని ఆశ్చర్యంగా చూస్తూ లోపలికి వచ్చింది మల్లికా. నేరుగా కణ్ణప్పన్ దగ్గరికెళ్లింది. "రవి ఏమైనా తొందరపెట్టాడా? మీకు ఒంట్లో ఎలా ఉంది? బాగుంది కదూ?" అని ప్రశ్నలడిగింది.

"ఊ... బాగానే ఉన్నాను. కాస్త నీరసంగా ఉన్నట్టుంది. మాత్రలవీ సరిగ్గానే వేసుకున్నాను. కానీ ఇప్పుడు కొంత కష్టంగా ఉన్నట్టుంది." అన్నాడు.

ఆరాత్రి ఆయనను నిద్ర పట్టనీయకుండా కాలి నొప్పి తీవ్రమైంది. పళ్లు గిట్టకరుచుకుని పక్కకు తిరిగి పడుకున్నాడు. మల్లికా లేచి నొప్పి తగ్గటానికి మాత్ర ఇచ్చింది.

తర్వాతి మూడు రోజులూ అముదా స్కూలికి వెళ్లలేదు. నాన్న దగ్గరే ఉంది. మల్లికా ఒకరోజు లీవు పెట్టి భర్తకు తోడుగా ఉండిపోయింది. ఆటలు అని అడుగుతూ రవి తండ్రి దగ్గరకు వెళ్లటానికి వీలు కాలేకపోయింది.

ఒకవారంలోనే కణ్ణప్పన్‌ను ఆసుపత్రిలో చేర్చే పరిస్థితి ఏర్పడింది. పదవరోజు కథ ముగిసింది. శవాన్ని ఇంటికి కూడా తీసుకురాకుండా ఆసుపత్రి నుంచే శ్మశానానికి తీసుకెళ్లేలా అయిపోయింది పరిస్థితి!

ఇల్లంతా గుంపు చేరారు. బంధుజనులమయం. ఏడుపులు. ఎందుకో రవికి అర్థం కాలేదు. అందరూ వాణ్ణి దగ్గరకు తీసుకుని ఏడ్చారు. నాన్న ఎందుకు ఇంటికి రాలేదో తెలియటం లేదు. ఎప్పుడు ఆసుపత్రికెళ్లినా కొన్నాళ్లయ్యాక కట్టుతోనో, చక్రాల

కుర్చీతోనో తిరిగొచ్చేసేవాడు. ఈసారి ఇంకా రాలేదు. అడిగితే "నాన్న చనిపోయారు. ఇక రారు." అనే అందరూ చెప్పారు.

రవి దాన్ని నమ్మలేకపోయాడు. అదెలా, నాన్న రాకుండా ఎలా ఉండగలడు? కచ్చితంగా వస్తాడు. ఎప్పుడూ కొట్టే అమ్మ దగ్గర నన్ను వదిలిపెట్టి వెళ్లనే వెళ్లడు.

తీసుకున్న అప్పంతా తీర్చటానికి ఇంటిని శెట్టిగారికే అమ్మేసి, వేరే చిన్న ఇంట్లోకి వెళ్లాలని నిర్ణయమయ్యాక రవి దాన్ని ఇంట్లో ఎక్కడా వెంటనే పెట్టలేనంతగా ఇంటి సామాన్లు కొద్దికొద్దిగా మూటలు కట్టసాగారు.

శెట్టిగారికి చేతులు జోడించి తాళం చెవిని ఇచ్చేసి, సామాన్లన్నీ ఎక్కించిన ఎడ్లబండ్లో చివరి ట్రిప్‌లో ఎక్కి కూర్చున్న మల్లికా, అముదా, రవిని ఎక్కమన్నప్పుడు వాడు గట్టిగా ఏడ్చి అన్నాడు. "నేను రాను... నాన్న వస్తాడు..."

"ఇప్పటికే సగం చచ్చిపోయాను రా.. ఇంకా ఎందుకురా నన్నిలా బాధపెడుతున్నావు... గాడిదా" అంటూ రెండు దెబ్బలు వాడి వీపుమీద వేసి బండ్లోకి లాక్కొంది మల్లికా.

బండి వీధి మలుపు తిరుగుతున్నప్పుడు, ఎవరూ ఊహించని విధంగా, గబాలున కిందికి దూకి ఇంటికేసి పరుగెత్తాడు రవి. శెట్టిగారు పక్కింటి ముందు నిలబడి మాట్లాడుతున్నాడు.

లోపలికి పరుగెత్తినవాడు సరాసరి మేడ మెట్లెక్కాడు. 'నాన్న వొస్తే ఇక్కడికే వస్తాడు. ఆయనకు ఈచోటు బాగా తెలుసు. ఇంకెవరూ కనిపెట్టలేరు. రాడంటగా. అదెలా? నాన్న మంచివాడని చెప్పారే. అప్పు తీసుకుంటే మనమే తిరిగిచ్చెయ్యాలని చెప్పాడే. నాకు క్యాచ్‌లు అప్పు పెట్టేసి వెళ్లాడు. తిరిగివ్వటానికి వస్తాడు. నేను ఈ ఇంట్లో లేకపోయినా ఇక్కడికొచ్చి చూసి నేరుగా ఇంకో ఇంటికి వస్తాడు.' అన్న ఆలోచనలు వాడిలో రేగాయి..

తండ్రికి కొడుక్కి మాత్రమే తెలిసిన ఆ రహస్య ప్రదేశంలో రహస్య చిరునామా కాగితం దాచిపెట్టాడు.

వెనకే పరుగెత్తుకొచ్చిన అముదా, వాడి చేతిని పట్టుకొని లాక్కుంటూ వెళ్లి బండ్లోకి ఎక్కించింది. 'ఎక్కడికిరా వెళ్లావు? ఎందుకురా నా ప్రాణం తీస్తున్నావు, అప్పులోడా?" అని మల్లికా లాగి వాడి వీపుమీద దబీదబీమంటూ నాలుగు బాదింది.

"ఓ" అంటూ వాడు గట్టిగా ఏడుస్తూ... "నేనేం అప్పులోణ్ణికాను. నాన్నే అప్పులోడు." అని గట్టిగా వాడు అరిచేసరికి బదులుగా ఇంకో రెండు దెబ్బలేసింది వాడి వీపు మీద.

■



## వాన జ్ఞాపకం

**చూ**రు కింద కూర్చుని
చిటపటలాడుతూ పడుతున్న
చిరు చినుకులను చూస్తూ
చిందులేసిన బాల్యం..
చెంగు చెంగున దుకుతూ
చినుకు సవ్వడికి
తాళమేసిన పాదాలు
జారిపడితే తగిలిన గాయాలు..
నిశ్శబ్ద నీరవంలో
ఉన్నట్టుండి ఆకాశం ఒళ్లు విరిచి చేసే
ఉరుముల ఉత్సవానికి
ఉలిక్కిపడి లేచిన రాత్రులు..
నిరర్ధకమైన కాగితానికి
నిండైన రూపం ఇస్తూ
ప్రవాహంలో జారవిడిచిన
కాగితపు పడవలు

వేకువ జామునో, సంధ్య వేలో
కిటికీ బయట నుంచి
ఆడుకుందాం రమ్మని
పిలిచే నీటి తుంపరలు
బాల్యాన్ని దాటి వచ్చేసినా
మనసును తడిపే
మధురమైన జ్ఞాపకాలు..

- సునీత పేరిచర్ల
83094 20900

కవిత





# ప్రశ్నల సవ్వడి

వెలుతురు కిరణం వైపు
ఎదురుచూస్తున్న చూపులు
దిగులు గుమ్మాలకు వేళ్ళాడుతున్నాయి
పోచపోచ పోగేసుకుని నిర్మించుకుంటున్న
ధైర్యపుగూళ్ళు కూలిపోతున్నాయి
ఇన్నాళ్ళ నాలుగుగోడల ఖైదు నట్టేట్లో మునిగిపోతోంది
వేలసంఖ్యలో అంకెలు అంచనాల గీతలు దాటుతూ
కట్టడి లేనితనంతో
మరణాలను ముద్దాడడానికి చేరువవుతున్నాయి

చిట్టచివరి ఊపిరితో వలసపక్షి
సరిహద్దుల ముళ్ళకంపల మధ్య
ఎండిన పెదవులను తడుపుకుంది
ఊరిలో ముసలిప్రాణాలు
తెగుతున్న పేగులను బాధతో మీటుకుంటున్నాయి
చావు బతుకుల నడుమ ఎన్నో ప్రాణాలు
నిశ్శబ్దంగా మూలుగుతున్నాయి
క్రమశిక్షణలన్నీ గాల్లో కలిసిపోయి
తెరుచుకున్న తలుపుల మీదకి
గుంపులు ఎగబడ్డాయి

ఆకలిచావులు దుఃఖంతో పిక్కటిల్లుతూ
భూమిలో కూరుకుపోతున్నాయి
సముద్రంలో పడవలన్నీ
దారీతెన్నూ లేక తల్లడిల్లుతున్నాయి

ఎంత వింత పరిస్థితి!
మరెంత కాలమీ అనిశ్చితస్థితి
తెగిన పనిచేతులు ఎప్పటికి అతుక్కుంటాయి
శ్రమస్వేదాలు ఎప్పుడు మళ్ళీ నవ్వుతాయి
నావ తీరం చేరుతుందా అసలు
జవాబు లేని ప్రశ్నల సవ్వడి
మనసును రోజూ కొరుక్కుతింటోంది
సందేహాలను తీర్చే నాధుడే ఇప్పుడు కరువు!

**- పద్మావతి రాంభక్త**
**99663 07777**




# గొంతెండిన సీమ కథలు

- కెంగార మోహన్
9493375447

**గుక్కెడు నీళ్ళు లేక ఊళ్ళకు ఊళ్ళు వలసెళ్లిపోవడం రాయలసీమలో నిత్యకృత్యం. దశాబ్దాలు తరబడి పాలకులు చేసిన అన్యాయం, చూపిన నిర్లక్ష్యం రాయలసీమ కరువుసీమగా మార్చాయి. ఈ విపత్కర స్థితిలో కవులు కళాకారులు సీమ ప్రజలను చైతన్యపరిచేందుకు తమ వంతుగా ప్రయత్నాలు ఆరంభించారు. ఈ నేపథ్యంలో వచ్చిన కథలే రాయలసీమ ప్రచురణలు ప్రచురించిన సిద్ధేశ్వరం అడుగు కథలు.**

అలుగు అంటే రాతి కట్టడం. దీన్ని ప్రాజెక్టులా నిర్మించాల్సిన అవసరం లేదు. అతి తక్కువ బడ్జెట్‌తో అలుగును నిర్మించవచ్చు. సిద్ధేశ్వరం అనే గ్రామం కర్నూలు జిల్లా కొత్తపల్లె మండలంలో ఉంది. ఈ గ్రామం సమీపంలో అలుగు కడితే దాదాపు 50 టిఎంసీల నీరు నిలువ ఉంటుంది. దీంతో రాయలసీమలో కొంతమేరకైనా కరువును పారదోలి వలసల్ని, రైతు ఆత్మహత్యల్ని ఆపవచ్చు. కానీ, దశాబ్దాల తరబడి సిద్ధేశ్వరం అలుగు నిర్మాణం జరగకుండా అడుగడుగునా మోసం జరిగింది.

రాయలసీమ ప్రచురణలు వేసిన రెండో కథల సంకలనమిది. మొదటి సంకలనం **నీళ్ళింకని నేల రాయలసీమ కథలు** సీమరైతు కష్టాల్ని పరిచయం చేస్తే.. రెండో సంకలనం ప్రత్యేకంగా సిద్ధేశ్వరం అలుగు నిర్మాణం కోసమే ఉద్యమాన్ని బలపరిచేలా రచయితలు కలం పట్టారు. ఇది మొట్టమొదటి రాయలసీమ ఉద్యమ కథల సంకలనం. **రెండు సందర్భాలు** అనే కథతో ఈ సంకలనం ఆరంభించారు. కథలో సిద్ధేశ్వరం అలుగు ప్రజాశంకుస్థాపనకు బయల్దేరే ఒక బృందం అనుభవాలు చెప్తుంది. ఇక్కడి మట్టి ఎంత సారవంతంగా ఉంటుందో చెబుతూ కథను ప్రారంభిస్తుంది రచయిత్రి కె.సుభాషిణి. **నల్లటి ఒండ్రుమట్టి, నోరూరించే వాసన, నల్లటి మైదానం, చుట్టూ కొండలు** అంటూ ఆ ప్రాంతాన్ని వర్ణిస్తుంది. ఈ బృందం శ్రీశైలం బ్యాక్ వాటర్ వల్ల మునిగిపోయి భౌగోళిక చిత్రపటంలో కనుమరుగైన ఊళ్ళు.. అక్కడి రైతుల వ్యథల గాథలు తెలుసుకుంటూనే ప్రయాణం సాగిస్తారు. పోలీసు వాళ్ళు ఆ ఉద్యమ స్థలికి వెళ్ళకుండా ఆపుతారు. కారులో ఉన్న స్త్రీలను చూసి వదిలేస్తారు. తరువాత శ్రీశైలం ముంపువల్ల రిజర్వాయర్ నిర్మాణంతో కనుమరుగైన వాగులు, వాళ్ళ భూముల్ని ఎలా గుర్తుపట్టారో చెబుతుంది రచయిత్రి. **డ్యాంలో నీళ్ళుంటే వాగు కనబడదు. యిట్లాంటప్పుడే కనిపించేది. కాకపోతే ఎండిపోయి కనిపిస్తుంది. వర్షాకాలంలో వంకపారేటప్పుడు మనం చూడలేము. డ్యాం నీళ్ళలో కల్సిపోతాది** అని చెప్తుంది. తమ జీవనాధారం అయిన పొలాలను డ్యాంకు అప్పగిస్తే వూర్లు లేవు నీళ్ళు లేవు అని ఆవేదన వ్యక్తం చేస్తుంది. దారిలో మళ్ళీ పోలీసులాపుతారు. ఎస్సైకి జ్ఞానబోధ చేసి ప్రయాణం కొనసాగిస్తారు. ఈ ఖాకీ డ్రస్సు లేకుంటే నేను ఉద్యమంలో పాల్గనేవాణ్ణని అతడు చెప్పేలా చేస్తారు. ఇదే అవకాశంగా అక్కడ చేరిన వారిని ఉద్దేశించి ప్రయాణం చేస్తున్న శ్రీలత మాట్లాడుతుంది. సిద్ధేశ్వరం అలుగు నిర్మాణం ఆవశ్యకత చెబుతుంది. కొంతదూరమెళ్లాక

ఆకలైతుంది. అక్కడ కొబ్బరి చిప్పలమ్మే ఆమెను కొబ్బరి చిప్పల్ని ఇవ్వమని డబ్బులిస్తాను అనడుగుతుంది. **చిప్పలు అమ్ముతాం కానీ నువ్వు నోరు తెరిచి అడిగినావు. ఆ మాత్రం యియ్యలేనా డబ్బు వద్దమ్మా** అని చెప్పే ఆ పాత్రలో సీమవాసుల మానవత్వం వెల్లివిరుస్తుంది. ఆ ఉద్యమం దగ్గరికి వచ్చిన వాళ్ళకు రైతులే చందాలేసుకుని అన్నం వండి పెడతారు. అన్ని వేల మందికి వండి పెట్టడం మామూలు విషయం కాదు. ఈ కథలో బృందం ప్రయాణిస్తున్న కారు డ్రైవర్‌తో జరిపే సంభాషణ సీమకు జరుగుతున్న అన్యాయం డ్రైవర్ ఉడికిపోయి తరతరాల బాధ, కోపం ధ్వనిస్తాయి. ఈ కథలో చివరాఖరకు అలుగు శంకుస్థాపనకొచ్చిన అరవై ఏళు ళ్ళ పైబడ్డ ముసలి రైతు **'ఈడ అలుగు పడితే నీళ్ళు వస్తాయంట కదా.. సూద్దామని వస్తిమి. రైతులం మేము.. ఏందో ఆశ. పసులకు యింత పచ్చగడ్డి, మాకు యిన్ని తిండి గింజలు పండించుకోవచ్చు అని సెప్తే యిట్ల దోవపడ్తిమి. మాబోటి సదువురానోళ్ళు అంతకంటే యింగేమి ఆశిచ్చారు ఆకయా.."** అంటాడు. అలుగు కడితే తీరే కష్టాలన్నీ ఈ పాత్ర ఆకాంక్షతో రచయిత్రి చెబుతుంది.

కవితాత్మకంగా సాగే కథ 'ఇన్ మోషన్'. తెలుగు కవిత్వం బాగా చదివేవాళ్ళు, చిక్కనైన కవిత్వం రాసేవాళ్ళు, సాహిత్య స్పృహ, సామాజిక చైతన్యం కలిగిన ఉద్యమ కవులు మాత్రమే రాసే కథ ఇది. ఇది కూడా సిద్ధేశ్వరం అలుగు నిర్మాణం కోసం చేసే ఉద్యమం చుట్టూనే తిరుగుతుంది. చెంచుల చరిత్ర గురించి ప్రొఫెసర్‌తో సుదీర్ఘ చర్చ చేసి అక్కడి నుంచి పరిశోధన నిమిత్తం నల్లమల ప్రాంతానికి వెళతాడు రచయిత. రాత్రి అశ్వర్థ రెడ్డి ఇంట్లో నిదురపోయి వేకువనే గిరిజన చెంచుగూడేలు సందర్శించాలి. ఆ రాత్రి అశ్వర్థరెడ్డి చిన్నాయన బిడ్డ పిచ్చిదై తిరుగుతుంటుంది. వాళ్లకు నలభై ఎకరాల పొలం ఉంటుంది. కాలువలు తవ్వారు కాని నీళ్ళు లేవు. ప్రతి ఏడు కరువే. ఆమె భర్త అప్పులకు వడ్డీలు కట్టలేని స్థితిలో ఆత్మహత్య చేసుకుంటాడు. కథకుడు ఈ కథను చాలా కవితాత్మకంగా రాశారు. తను పడుకొని ఉంటే **ఏవో పొలాలు నెర్రెలు వారుతున్నట్లు, పంట తగలబడిపోతున్నట్లు, భయ విహ్వాలంతో మంటలను తప్పించడానికి పొలాల్లోంచి ఎవరో పరుగెడుతున్నట్లు కేకలు, అరుపులు, ఏడుపులు ఇలా ఆలోచిస్తుంటాడు.. వాళ్ళలో పిచ్చిదైన ప్రమీల కూడా ఉందా?** అనుకుంటాడు. **నీళ్ళులేక శిథిలమైన కాలువగట్టు మీద సగం వంగిన చెట్టుకు మొగుడి శవం వేలాడుతూ కనిపించింది.** ఇలాంటి హృదయ విదారక అభివ్యక్తి చాలా కథల్లో కనిపిస్తుంది. ఉదయాన్నే ఇద్దరూ ప్రయాణమవుతారు. అదే రోజు సిద్ధేశ్వరం అలుగు శంకుస్థాపన జరుగుతుంటుంది. తండోపతండాలుగా వచ్చిన జనంతో మాటలు కలుపుతారు. అందరూ సిద్ధేశ్వరం అలుగు సాధించాలన్న తపన కలిగి పోరాట పటిమతో వొచ్చినోళ్లు. **'శ్రీశైలం రిజర్వాయర్‌లో ఒక అలుగు కడితేగాని మనకు నీళ్ళు రావు. ఇది కావాలని జనాలకు ఇప్పుడు బోధపడింది. వాళ్ళేమో గేట్లు ఎత్తి పై నుంచి వచ్చిన నీళ్ళు వచ్చినట్లు తీసుకు పోతున్నారు. రైతులే శంకుస్థాపన చేయడానికి ఈ పొద్దు పోతున్నారు. ఏమౌతుందో.. ఇది కడితే రిజర్వాయర్‌లో నీళ్ళు నిలబడతాయి. మా కాలువకు కూడా నీళ్ళస్తాయి.'** ఇలా అనుకుంటూ సిద్ధేశ్వరం అలుగు శంకుస్థాపనకు వెళతారు. పోరాటాన్ని నడిపించే నాయకుణ్ణి అరెస్టు చేసి ఆత్మకూరుకు తరలిస్తారు. మిగిలినవారు ఉద్యమాన్ని ఆపకుండా చేయి చేయి కలిపి శంకుస్థాపన చేస్తారు.

పశ్చిమ ప్రాంత మాండలికానికి పెట్టింది పేరైనా మారుతి పౌరోహితం **కాల్వ** అనే కథ ఈ సంకలనంలో రాశారు. పల్లెటూరి నుంచి పట్నానికి వెళ్ళి చిన్న ఉద్యోగం చేస్తూ స్థిరపడిన గువ్వలదొడ్డి అనుమేశప్ప సొంతూరికి తన తల్లి అనారోగ్యంతో ఉందని తెలిసి వస్తాడు. ఊరి జ్ఞాపకాల్ని నెమరువేసుకుంటూ వచ్చిన అతడు బస్సు దిగిన వెంటనే నీళ్ళులేక జీవశ్చవంలా పడున్న కాల్వను చూస్తాడు. అది ఒకప్పుడు ఆ ఊరి గొంతులో నాల్గు మెతుకుల్ని తడిపిన కాల్వ. **'ఇంగ ఇప్పుడు ఆ కాల్వని సూస్తే ఏడుపొస్తాంది. మొత్తం పూడి పొయ్యిడి సేద్య. కల్వంతా పరంగి సెట్లు మొలిసేవ్య. మా వూర్లో ఐదో తరగతి వరకే ఇస్కూలు ఉంద్య. సదువుకొనేకి కాయాస ఉన్నోళ్ళు ఆరోతరగతికి గోనిగండ్లకి, ఎమ్మినూరుకి ఫోతుండ్రి. ఎమ్మిగనూర్లో గ్యాని, గోనిగండ్లలో గ్యాని బసెక్కి కాల్వ అనిడిస్తే సరిపాయ. టికట్టు కొడతావుండ్రి. అప్పుడు మా కాల్వ అంత ఫ్యామస్సు. రోడ్డు మీద కాల్వ మోరికి రాసింది ఈపొద్దుకి నాకి బాగా గురుతుండాది. "అనేక కోట్లు ఎచ్చించి యయ ప్రయాసలతో అందజేసిన నీటిని పొదుపుగా వాడుకోండి" అని రాసిండిరి. అప్పుడు ఆ మోరిలేదు. ఆ నీళ్ళు లేవు..** అని వాపోతాడు. తరువాత తన చిన్ననాటి స్నేహితుడి వద్ద కాల్వ సంగతి ప్రస్తావిస్తాడు. దానికి తన చిన్ననాటి స్నేహితుడు **"కర్నాటకంలోన పైన వున్న నాకొడుకలు గుత్తకి సేన్లు తీసుకుని**

**పై కాల్వకి గాలి పైపులు ఏసికాసి నీళ్ళు దొంగులుకుంటుంటే యాడ వస్తాయి నీళ్ళు కిందికి? అనుకొంటా తలకి సుట్టుకున్న టవాలు తీసి ఇదిరిచ్చుకుంటా "ఇంగ కాల్వకి రిపేరు ల్యాగిపేర్లుల్యా యానా కొడుకన్నా పట్టిచ్చుకునేదనా? కాల్వ ఎండిపోయినంక మోర్లు కూడా ఎండిపాయ. ఊరంతా నాశనం అయ్యిడిస్య. ఎమోల్యాప్పా మా దరిద్రం ఇట్లుండాది"** అని కాల్వ ఎలా నాశనం అయ్యింది స్పష్టంగా చెబుతాడు. మాటల సందర్భంలోనే తన జతగాడి పిల్లల గురించి అనుమేశప్ప వాకబు చేస్తాడు. కూతురుకి పెళ్ళి చేశానని.. కర్నూలుకెళ్ళి చదువుకునే కొడుకు **సిద్ధేశ్వరమని.. నీటివాటాలో అన్యాయమని** ఇలా చెప్పి జీవితాన్ని నాశనం చేసుకుంటున్నాడని చెప్తాడు. వాళ్ళేడిగేది కరెక్టని మన కాల్వ స్థితి చూస్తే తెలుస్తుందంటాడు అనుమేశప్ప. నీ కొడుకు చేతగాని వాడు కాదు.. మనం చేతగానివాళ్ళం.. అలాంటి ప్రాజెక్టుల కోసం పోరాడుతున్నాడంటే మన బతుకుల కోసం కొట్లాడుతున్నాడని అర్థమని హితోపదేశం చేస్తాడు. ఇలా సిద్ధేశ్వరం అలుగు ఉద్యమ ప్రభావం పశ్చిమ ప్రాంతానికి పాకిన వైనాన్ని చక్కగా మాండలికంలో ఆవిష్కరిస్తారు మారుతి పౌరోహితం.

ఈ సంకలనంలో ఆఖరి కథ రెండో వీరగల్లు. శ్రీకృష్ణదేవరాయల కాలంలో గ్రామాల్లో వీరులుండేవారు. వాళ్ళు చనిపోతే ఆ గ్రామంలో వాళ్ళకు గుర్తుగా వీరుల ప్రతిమలను ప్రతిష్ఠించేవారు. వాటినే వీరగల్లు అంటారు. ఈ కథలో పన్నెండేళ్ళ కుర్రాడిని ఉద్యమ సంకేతంగా పాత్రోచితం చేశారు వెంకటకృష్ణ. ఇందులో అశాస్త్రీయంశాలుగా కొన్ని ఘటనలు ఉన్నా అది ఉద్యమస్ఫూర్తిని రగిలించే క్రమంలో చెప్పబడ్డవిగానే పరిగణించాలి. స్థూలంగా కథ విషయానికొస్తే... పూజారి నారాయణ ఊర్లో పనుల్లేక వలస వెళ్ళేందుకు సిద్ధమై ఉంటాడు. వెళ్ళేముందొకసారి తన ఊర్లో పనిచేసిన ఉపాధి హామీ కూలీ డబ్బులడిగి వెళ్దామనుకుంటాడు. ఫీల్డ్ అసిస్టెంట్ దగ్గరికెళ్ళి అడుగుతాడు. గవర్నమెంటుతో డబ్బుల్లేవు వచ్చినాంక నీ అకౌంట్‌లో వేస్తామని చెప్తూ 'అయినా గుంటూరుకు వలసెందుకు పోతావు.. ఈ ఉళ్ళోనే పనులు కల్పిస్తున్నాం కదా' అంటాడు. 'లేదు ఈడ వందరోజులే కదా మిగతా రోజులెట్లా బతకల్ల వెళ్ళాలం'టాడు. దానికి ఫీల్డ్ అసిస్టెంట్ **"మన హంద్రినీవా పొంగి పొర్లుతుందిలేన్నా. ఆడ పట్టిసీమనో వట్టిసీమనో కట్టిండ్యా.. యింగిప్పుడు కృష్ణనీళ్ళు ఎనికెనిక్కి ఎక్కొచ్చి. శ్రీశైలం దాటుకోని మనూర్లకు వస్తాయిలేన్నా.."** అని వెటకారంగా అంటాడు. **"ఆ హంద్రీ కాలువలోకి నీళ్ళిచ్చినట్టే వుంది సారూ మీరు దుడ్లు ఇచ్చేది. లెట్రిన్లు కట్టుకోమంటిరి. పొలాల్లో గుంతలు పెట్టుకోమంటిరి. దుడ్లు మాత్రం అప్పుడొస్తాయి, ఇప్పుడొస్తాయి అంటారు."** అంటాడు నారాయణ. వీళ్ళిద్దరి మధ్య సంభాషణ సీమ నీటి కష్టాలు ప్రతిబింబిస్తుంది. నారాయణ కొడుకు పన్నెండేళ్ల పిల్లవాణ్ణి వీరత్వానికి సంకేతంగా చూపిస్తారు. వాన నీటిలో కొట్టుకొచ్చిన వీరగల్లు విగ్రహం తన తాతదే అని.. తాతతో తను మాట్లాడటం.. ఇప్పటి నీటికష్టాలు, పంటల దుస్థితి అంతా తాతకు చెప్పడం.. **నన్ను సిద్ధేశ్వరం దగ్గరకు తీసుకుపోతే నేనే కాపలాగా ఉంటానని.. ఆ కాలంలో ఎలా కాపలా కాశానో ఇప్పుడు అలా కాపాడతానని చెప్తాడు.** మనమడి మాట తొలుత వినకున్నా పదిమందికి నీళ్ళస్తే మంచిదే అన్నట్లు ఆ విగ్రహాన్ని సిద్ధేశ్వరం దగ్గరకు మోసుకుపోతాడు నారాయణ. ఆ పిల్లాడికి చేతులు మొలుస్తూనే ఉంటాయి. చేతులు మొలవడమంటే ఉద్యమ సంకేతమనే అర్థం చేసుకోవాలి. ఈ నాల్గు కథలు సిద్ధేశ్వరం అలుగు నిర్మాణాన్ని కలలు కంటాయి. ఆ కల సఫలమవ్వాలని మనకు ఉద్యమ స్ఫూర్తినిస్తాయి. ■

## పురస్కారాల కోసం రచయితలకు ఆహ్వానం

శ్రీ మక్కెన రామ సుబ్బయ్య ఫౌండేషన్, విజయవాడ వారు నిర్వహిస్తున్న పుస్తక పురస్కారాల కోసం తెలుగు రచయతల నుంచి పుస్తకాలను ఆహ్వానిస్తున్నాం. 2020లో ప్రచురించబడిన కథల సంపుటికి 'శ్రీ మక్కెన రామ సుబ్బయ్య కథా పురస్కారం, కవితా సంపుటికి 'ఆచార్య నెల్లుట్ల కవితా పురస్కారం'; 2018 – 2021 మధ్య ప్రచురించబడిన మినీ కవిత్వం /గజల్స్ /నానీలు/ నానోలు/ రెక్కలు .. తదితరాలకు డా. కె వి రావు సాహితీ పురస్కారం అందజేస్తాము. రచయతలు, కవులు తమ పుస్తకాలను మూడేసి ప్రతులను ఈ కింది చిరునామాకు పంపాలి. ఒక్కో పురస్కార గ్రహీతకు రూ. 7,000 నగదు, జ్ఞాపిక, ప్రశంసా పత్రంతో పాటు సత్కారం ఉంటుంది. **మే 15, 2021లోగా** పుస్తకాలు పంపాల్సిన చిరునామా : డా మక్కెన **శ్రీను, టిఎఫ్ 3 బొడ్డపాటి మాన్షన్, బైబిల్ స్కూలు ఎదురు, గుణదల, విజయవాడ – 520 004.**

# అంకురోదయం

**నా** చుట్టూ అలముకున్న చీకటిలో
నాగలి శిధిలాలను గాలిస్తున్నా
ఎండపొదల్లో తెగిపడిన
చెమటనెత్తురు కూకటి కుదుళ్ళలో
నా అవశేషాలకై అన్వేషిస్తున్నా
గుబురు వేళ్ళ నుండో
ముదురు కాండం నుండో
ఓ మొలక అవతరించకపోతుందా? అని
ఆశగా ఎదురుచూస్తున్నా...
మట్టిపాదాల కింద స్వర్ణాన్ని దాచిన
మాగాణి మాన్యాలకు తడిపెట్టి గొప్పు తవ్వి
సాగుని బాగుచేయాలని తపిస్తున్నా...
ఎరువు వేయడానికి నా వద్ద ఏముంది గనక?
ఎరువు తెచ్చుకున్న దోసిలి దుఃఖం తప్ప!

ఏదో కదురు గొడ్డలి వేటుకు
పల్లెయెద తుమ్మల్లో పొద్దుగూకింది
నేలమ్మకు ఎంత ప్రేమోగాని
నాలాంటి మంటి నెలవంకల
ఓటి ఊపిరుల్ని మాత్రం గుట్టుగా ఒడిచేర్చుకుంది!
సేద్యానికి బాధ్యత పడని
తినే హక్కుతో పుట్టిన ఆధునిక అంతర్జాల మార్జాలాలకు
సాగంటే ఎంత భయమోగాని
దుక్కి వారసత్వం సుప్తావస్థలోకి జారి మిన్నకుంది!
అంతా కటిక చీకటి
అంకురోదయం ఎప్పటికో..!?

చేవలేనిదే విత్తుకి చలనం రాదు
చావలేనిదే రైతు అప్పుకి విముక్తి లేదు
స్థాణువైన మడిమదిలో
కదలిక రేపగల అధోజ్ఞాపిక ఏదో?
బండగుండెలను మోగించగల
చైతన్య శబ్దభేది ఎక్కడో?
దిగంతాలను చుట్టుముట్టగల
నాభీస్వరమొకటి జేగంట పిలుపై
వెన్నుచరిచేదేన్నడో!?



- కంచరాన భుజంగరావు
94415 89602

కన్ల ప్రమిదల్లో చమురుపోసి
వేలతారల్ని వెలిగించి వేచి ఉన్నా..
దీపం నిండుకోకముందే
ఏరు ఎదురు ప్రవహించి
ఈ మెట్టవనాల కరవునేలల
కరకు మొదుళ్ళపై నీళ్లు చిలకరిస్తుందని
ఏడు తనువుల నుండి మొలకొక్కటైనా
వెలుగు పలుగై పలకరిస్తుందని!

అదిగో.. అదుగదిగో...
గండం దాటిన తూరుపు కొండకు
పొద్దు మొలిచినట్లు
అరుణారుణ చప్పుడు
అంకురోదయ చప్పుడు
పొలమంతా కొత్తరకం నాట్లుపెడుతూ
కొత్తతరం రైతాంగం!
ఇక నిత్యవెతల నిరీక్షణకు స్వస్తి
కన్నీటి పరిశోధనలకు పరిసమాప్తి!

## కథ



# అతడు

**మణి వడ్లమాని**

96520 67891

**కొం**తమందికి ఎప్పుడు బతుకుతో పోరాటం చేయాలనే ఉంటుంది. చేస్తుంటారు కూడా. అయితే వచ్చిన చిక్కల్లా వాళ్ళకి ఫలితాలతో నిమిత్తం లేదు. ఆ పోరాటంలో త్యాగాలు చేస్తారు, ప్రాణాలు కూడా పోగుట్టుకుంటారు. వీళ్ళో రకం మనుష్యులయితే మరి కొంతమంది ఆశయాల కోసమే పనిచేస్తారు పరితపిస్తారు. ఆశయం కోసం పనిచేస్తున్న వారు ఒక లక్ష్యంతో గమ్యం వైపు పయనిస్తారు. జీవితాన్ని ఇలా కూడా జీవించొచ్చని నిరూపిస్తారు.

ఎందుకో అనిపిస్తోంది; అతని గురించి చెప్పుకోవాలని. నాతో పాటు నా ఆలోచనలతో, నా అంతరంగంలోకి మీ అందరిని తీసుకుని వెళతాను. అక్కడ అక్షరాలు కనిపిస్తే చదవండి. దృశ్యాలు కనిపిస్తే చూడండి. మాటలు వినబడితే వినండి.

రండి, మంచి కోసం, నిప్పులాంటి నిజం కోసం జ్వలించి పోయిన ఆ మనిషిని గురించి తెలుసుకుందాం.

♦ ♦ ♦

సముద్రమంటే పడి చచ్చిపోయే నాకు అనుకోని వరంలా ఆ ఊరు వెళ్ళే పని పడింది. ఆ ఊరు పేరు వినగానే కొన్నేళ్ల క్రితం అతన్ని కలిసిన జ్ఞాపకం.

నిజానికి జ్ఞాపకంగా విడిపోయి మళ్లీ కలిసినట్లుగా.. ఇలా ప్రతిసారీ జరుగుతుంది. అయినా నాలో ఆ జ్ఞాపకం అదే ఆనందాన్ని ఇస్తుంది. కానీ అతనో సంచార జీవి.. ఒక్కచోట ఉండడు. తెల్లటి బట్టలో మెత్తగా మాట్లాడే అతను ఎర్రగా జ్వలించే సూర్యుడు. జీవితమంటే ఇది కాదని, అది ఎలా ఉంటుందో నిరూపించి మరీ చూపాడు. ఎలాంటి ప్రణాళిక లేకుండా ఏదో చేయాలనుకుంటూ ప్రయాణం చేస్తుంటాడు. ఒక బ్యాక్‌ప్యాక్ వేసుకుంటాడు. ల్యాప్‌టాప్, కెమెరా ఇంకా అవసరమైన సామాను తీసుకుని బయల్దేరతాడు. మధ్యలో జరిగిన సంఘటనలపై స్పందిస్తుంటాడు. ఎలాంటి గమ్యాన్ని ఏర్పరుచుకోకుండా కొత్త బాటలు సృష్టించుకుంటూ వెళ్లిపోతున్నాడు. మనకెందుకులే అనుకునే ఈ రోజుల్లో ఏదైనా జరిగితే స్పందించే గుణం తక్కువ ఉండే మనుషుల మధ్యలో ఎర్రటి సూర్యుడులా వెలుగులు జిమ్ముతూ వస్తాడు. కర్మసాక్షిలా పని చేసుకుని వెళ్ళిపోతాడు. ఒకళ్ళ కోసం ఆగడు, చూడడు. నేను మొదటిసారి అతన్ని కలిసినప్పుడు జరిగిన ఆ సంఘటన ఇప్పటికీ కళ్ళకి కట్టినట్లుగా ఉంది.

అక్కడ ఉన్న వాళ్లకు సంబంధించిన భూమి గొడవ జరుగుతోంది. ఇరు పక్షాల వాళ్లతో మాట్లాడి ఒప్పించి దానిని సర్దుబాటు చేసాడు. "నువ్వు దేవుడివి బాబయ్యా" అంటూ ఓహ్ ఒకటే పొగడ్తలతో ముంచెత్తారు.

అప్పుడే ఒకమ్మాయి పరిగెత్తుకుంటూ వచ్చింది.

"ఏమైంది?" అన్నాడతను.

"బాబూ... నీలికి నొప్పులు వస్తున్నాయి. డాక్టరమ్మ ఇప్పుడే డ్యూటీ ముగించుకుని వెళ్ళిపోయింది. ఏమి చెయ్యాలో అర్థం కావటం లేదు." అంది.

అంతే! ఒక్క క్షణం ఆలస్యం చెయ్యకుండా నా వైపు తిరిగి

"మీరు రండి నాతో" అన్నాడు. అప్పుడు టైం రాత్రి ఏడవుతోంది. మంత్రబద్ధుడిలా అతని వెంట వెళ్ళాను. సాధారణంగా కనిపించే అతనిలోని అసాధారణ వ్యక్తి గురించి నా స్నేహితులు చెప్పారు కూడా. ఇప్పుడు కళ్లారా చూస్తున్నాను.

అలా నడుచుకుంటూ వెళుతున్న అతని వెనుక నేను.. మా నడక నీలి ఇంటివరకు సాగింది. తాటాకు పాక ఇంటిముందు శుభ్రంగా ముగ్గు వేసి ఉంది. లోపలికి వెళ్ళాడు, బాగా మూలుగులు వినిపిస్తున్నాయి.

అప్పటి ఉప్పెనకు తట్టుకుని అక్కడే మళ్లీ జీవనం సాగించడం, బతుకంతా సముద్రతీరంలో గడిపే వీళ్ళ జీవితాలు ఎపుడూ ప్రమాదాలతో గడుస్తాయి. తుపాను, సునామీ వంటి ఏ ప్రకృతి వైపరీత్యం సంభవించినా ముందుగా అతలాకుతలం అయ్యేది జాలర్ల జీవితాలే!

అక్కడ దగ్గరలో ఉన్న మరో హాస్పిటల్‌కి వెళ్ళడానికి కనీసం అరగంట అయినా పడుతుంది. ఆ ఉన్న పదిహేను, ఇరవై గుడిసెల వాళ్ళకి ఎటువంటి వాహనమూ లేదు. పైగా ఉన్న బస్సు టైం దాటిపోయింది. ఏం చెయ్యాలో తెలియలేదు. ఆమె మూలుగులు ఎక్కువవుతున్నాయి. అప్పుడు అతనికి ఒక ఆలోచన వచ్చింది. వెంటనే ఆమె పడుకున్న ఆ నులక మంచాన్ని మోసుకుని వెళదాం అని నిర్ణయించాడు. వాళ్ళు ముగ్గురు ఉన్నారు, అతనితో కలిపి. అప్పుడు నా వైపు చూస్తూ "మీరూ ఓ చేయి వేయండి" అన్నాడు.

మామూలుగా చెప్పినట్టు లేదు, ఒక ఆజ్ఞాపనలా అనిపించింది. ఒక్క క్షణం నా హెూదా, సొసైటీలో నా స్థానం కళ్ళముందు నిలిచాయి. అయినప్పటికీ అతని వెంట వెళ్ళాను. ఆ మంచం మోసుకుంటూ మధ్యలో చిన్న వాగు దాటుకుని ఆ గతుకుల రోడ్డు మీద నడుస్తూ వెళుతున్నాం. పాపం, ఆ అమ్మాయి నొప్పులతో గట్టిగా అరుస్తుంటే... లాలనగా మాట్లాడాడు. ఒంటి చేత్తో మంచం పట్టుకొని రెండో చేత్తో అ అమ్మాయి చెయ్యిని గట్టిగా పట్టుకున్నాడు ధైర్యం చెబుతూ. అప్పుడు అతనిలో నాకు ఓ తల్లి ప్రేమ కనిపించింది.

మేము హాస్పిటల్‌కి తీసుకెళ్ళిన అరగంటలో పురుడు వచ్చింది.

ఆ పల్చటి వెన్నెల రాత్రి, సముద్ర తీరాన చల్లటి గాలి ముఖానికి తగులుతూ, ఎదురుగా అతను... నిలువెత్తు మనిషి.

అప్పుడు అన్నాడు : "కనుచూపు మేర కనిపించేదంతా సముద్రమే. ఎగిసిపడే కెరటానికి ఎదురేగడమే తెలిసిన జీవితం. పొద్దుపోయేదాకా సముద్రంలో తిరగడం.. బుంగ నిండితే సంతోషం.. లేకుంటే ఆవేదన! ఇంతకుమించి వీళ్లకు మరో ధ్యాసే ఉండదు. అమాయత్వం వారి నిరక్షరాస్యత, వాళ్ళని వెంటాడుతున్నాయి. సముద్రంలో చేపల వేటే జీవనాధారం. సముద్రం చుట్టూ గిరి గీసుకొని బతుకుతున్నారు. పొట్ట కూటి కోసం వందల కిలోమీటర్ల పొడవునా సముద్రంపై ఉవ్వెత్తున ఎగిసిపడే అలలకు ఎదురీతుతున్న వీళ్ళను కాస్త చైతన్యవంతులుగా చేయాలని నా తాపత్రయం."

ఇంతలో నీలి మొగుడు వచ్చి "బాబూ, నువ్వు సమయానికి తీసుకు రాబట్టే నా నీలి బతికింది. పిల్లోడు ఈ భూమి మీద పడ్డాడు" అంటూ అతన్ని పట్టుకుని ఏడ్చాడు.

"నిత్యం సమస్యల సుడిగుండంలో చిక్కుకొని ఇలా విలవిల్లాడుతునే ఉన్నారు. సంపాదనంతా బోటు ఆయిల్‌కు, రిపేర్లకు సరిపోతోంది. వీళ్ళ గ్రామాల్లో కనీస వసతులు కొరవడ్డాయి. అందుకే వాళ్ళ తరపున ఉండి వాళ్ళ గొంతు వినిపించే ప్రయత్నం చేస్తున్నాను" అన్నాడు మళ్లీ నాతో.

ఇంతలో లోపల నుంచి కేరుకేరుమంటూ పసిపాప ఏడుపు వినిపించసాగింది. ఆ నీరవ నిశ్శబ్దంలో కేరుమన్న ఆ పసి కేక ఒక చైతన్యాన్ని మోసుకొచ్చింది.

అప్పుడనిపించింది : అతనో సముద్రం. ఎన్నెన్ని తరంగాలు హుంకరిస్తూ మీదకు ఉరుకుతున్నాయో? అతను మటుకు నిశ్చలంగా సర్కస్‌లో సింహాలని కంట్రోల్ చేసే రింగ్‌మాస్టర్‌లా అగుపించాడు.

అప్పుడే పుట్టిన పాపాయి ఏడుపు వింటూ "అనాదిగా ఈ చైతన్యమే జీవితం అంటే.. ఏమంటారు'' అన్నాడు నన్నుద్దేశించి. అవునంటూ తలూపాను. అంతవరకూ నాలో గూడు కట్టుకున్న శూన్యపుతెర తొలగిపోయింది.

◆ ◆ ◆

కొన్ని ఏళ్ళు గడిచాయి.

అతను ఎక్కడున్నాడో జాడ తెలియదు. ఫోన్ ఉన్నా అది ఎప్పుడూ మోగదు. ఉంటాడు ఎక్కడో, కొండల్లో కోనల్లో. మనుష్య సహాయం ఎక్కువగా అందని చోటకి వెళ్లి ఆ అడవి బిడ్డలతో ఆడుతూ పాడుతూ వాళ్ళలో ఒకడిగా మెలుగుతూ, వాళ్ళతో ఉంటాడు.

నేను ఈ మెటీరియలిస్టిక్ ప్రపంచంలో ఉన్నా అతని మాటలు అనుక్షణం గుర్తుకు వస్తూనే ఉంటాయి.

"కాలం మారింది, జీవించే జీవనం మారింది, నిజంగా సుఖంగా ఉంటున్నామా? నమ్మిన సిద్ధాంతాలు వాటితో మారే ఆలోచనలు అనుభవాలు, అన్నిటికి ముసుగు అనే ఆచ్ఛాదన, నిజంగా మనం అందరం జీవించేది అసలైన జీవితమేనా అందుకే నాకు ఈ పై పై ఆచ్ఛాదనలు తీసేసి సహజమైన స్వచ్ఛమైన నా అసలులోకి వెళ్ళాలని అనిపిస్తుంది. దాన్ని వెతుకుతూ నేను నిరంతరం సంచారం చేస్తుంటాను. కల్లా కపటం లేని, నిండైన జీవితం కోసం తాపత్రయం పడతాను. కృత్రిమత్వాన్ని సహించలేక పోరాడుతుంటాను" అన్నాడు.

ఆ మాటలు నిజమే కదా అనిపించింది. నిజంగా ఈ ప్రపంచం ఎలా ఉంది? దాని చూపు గమనం గురించి విశ్లేషణ చేసుకోవడం ఎంతైనా అవసరం అనిపించింది.

ఎక్కడున్నాడో ? ఎలా ఉన్నాడో?

ఉన్నటుండి ఓ రోజున నా ఫోన్‌కో మెసేజ్ .. 'నీకు ఫలానా చోటుకి రావడం కుదురుతుందా?' అని.

ఓహ్.. అతనే.. కలిసి కొన్ని ఏళ్ళయింది. తలచుకోగానే అతని దగ్గరనుంచి ఇలా మెసేజ్ రావడం చాలా సంతోషంగా అనిపించింది. మరో ఆలోచన లేకుండా "సరే వస్తాను" అని రిప్లై ఇచ్చాను.

వెంటనే ఎక్కడికి రావాలో డీటెయిల్స్ పంపించాడు.

కారులో బయలుదేరాను. అతని తెలుగు గమ్మత్తుగా ఉండేది. అందులో కాస్త కన్నడ యాస కనిపించేది. ఫ్లూట్ బాగా వాయించేవాడు. పదిగంటలు ప్రయాణం చేసి కలిసాను. వెంటనే నన్ను దగ్గరకి తీసుకున్నాడు. నేను కాసేపు అలానే ఉండి పోయాను.

ఇంతలో ఒక అమ్మాయి వచ్చింది. పాతిక ఏళ్ళు ఉండొచ్చు. "అంకుల్ కాస్త మాట్లాడకుండా ఉంటారా? ఈ రోజు టెంపరేచర్ ఎంత ఉందో చూస్తాను" అంటూ గదమాయిస్తోంది.

ఎవరన్నట్లుగా చూసాను.

"నా నేస్తం ప్రియ. నాతోపాటే తిరుగుతోంది గత మూడేళ్ళుగా.. ఎక్కడకి వెళదామనుకున్నా నా కంటే ముందే వచ్చి ఉంటుంది. ఒక విధంగా నా గార్డియన్ అనుకో" అన్నాడు కాస్త ఆయాసపడుతూ.

"ఇన్నేళ్లూ ఎక్కడ తిరిగారు? ఎక్కడున్నారు?"

సమాధానం మొహమంతా పాకే ఓ నవ్వు.

ఎంతటి వారైనా ఆ నవ్వుకు పడిపోవల్సిందే!

"ఏముంది? అందరూ నన్ను అనే మాట : 'అన్ని సుఖాలు, ఆనందాలు వదిలేసుకునిజనం జనం అంటూ పోతాడని.' అలాగే పోయాను.. ఎక్కడ నా అవసరం అనిపిస్తుందో అక్కడకు వెళ్ళడం.. అక్కడ నుంచి మరో చోటుకు మజిలీ, అలాంటి మజిలీలలో కొంతమంది కలిసారు. మరి కొంతమంది విడిపోయారు. బహుశా ఈ చివరి మజిలీలో ఇక్కడ ప్రియ కలిసింది. తను ఇంజనీర్.. జనం కోసం పని చేసే మంచి అమ్మాయి. ఇంతవరకు వెలుగులోకి రాని ఎన్నో జాతులు, తెగల గురించి తెలుసుకుని వాళ్లపై ప్రాజెక్టులు చేయడం, ఆ కుటుంబాలకి, వాళ్ల కమ్యూనిటీకి ఏమైనా చేయాలనుకోవడం, గుర్తింపు లేని వాళ్లని, వాళ్లకున్న సమస్యలను గుర్తించి వాళ్ళ తరఫున మాట్లాడటం ప్రియ చేస్తున్న పనులు. ఈమెకు డబ్బులు ఎక్కడి నుంచి వస్తున్నాయి? అనే డౌట్ మీకు రావొచ్చు. ఖర్చుల కోసం టీవీ ఛానళ్లకు, న్యూస్ పేపర్లకు ఫ్రీలాన్సర్‌గా పనిచేస్తోంది. ఆ వచ్చిన డబ్బును వీళ్ళ కోసం ఖర్చు పెడుతుంది.

"అంటే అచ్చం మీలానే" అన్నాను.

అప్పుడు ప్రియ .. "అదేమీ కాదండీ.." అంటూ అతని వైపుకి తిరిగి "అంకుల్ అలసిపోయాడు. అందరికీ అన్ని చూస్తూ.. ఈ కరోనా అవగాహన కోసం ఇంటింటికి వెళ్లి చెప్పాడు. మాస్కులు, కిట్స్ ఇచ్చాడు. ఆక్సీమీటర్లు, ఆక్సిజన్ సిలిండర్లు కూడా అరంజ్ చేశాడు." అంది.

"అవును ప్రియా.. తను నమ్మిన జనం కోసం నిలబడ్డాడు" అన్నాను.

నా చేతిలో తన చేయి. నవ్వుతూ నా వైపు చూస్తూనే ఉన్నాడు. "ఏమండీ ,ఏమండీ" అని కుదుపుతున్నాను. ఆ పక్కగా నిలబడిన ప్రియ నెమ్మదిగా కళ్ళు మూసేస్తూ ...

"భయపడుతున్న రోజు రానే వచ్చేసింది" అంది.

"అదేమిటి నీకు తెలుసా అన్నా ?

"అవును.. డాక్టర్ వచ్చి చూసి చెప్పారు మొన్న. 'రెండు రోజులు కంటే ఉండరు' అని"

"మరి నాకెందుకు చెప్పలేదు" అన్నాను.

దు:ఖంతో నా గొంతు పెగలటం లేదు.

"మిమ్మల్ని చూడాలని ఉంది' అన్నారు. అందుకే మెసేజ్ ఇచ్చాను."

"అది నువ్విచ్చావా" అన్నాను.

మనసు ఒప్పుకోలేదు తను లేడంటే. ఇప్పుడే కదా మాట్లాడాడు.. అంతలోనే అలా ఎలా వెళ్ళిపోతాడు? ఇంకా మనసుతీరా మాట్లాడలేదే ... జీవిత పాఠాలు నేర్పిన మనిషి. అనేవాడు : యుద్ధం చేయడమే కాదు దాని ఫలితం ఏమిటో కూడా చూడాలి అని. అందుకు తగ్గట్టుగా ప్రణాళిక వేసుకోవాలి అనేవాడు.

"అసలు ఏంటి ప్రాబ్లం"

"గుండెకు చిల్లు పడింది.

"ఆపరేషన్ చెయ్యాలి అన్నారు"

"వద్దు. పూడ్చుకోను.. హాస్పిటల్‌లో కట్టి పడేస్తారు. నాకు స్వేచ్ఛ ఉండాలి. గాలాడాలి." అన్నారు.

ఇంత చిన్న వయసులో ప్రియ ఇలా బాలెన్స్‌డుగా ఉండటం చాలా చాలా గ్రేట్.

ఎవరెవరికో ఫోన్లు చేసింది. గంట వ్యవధిలో అందరూ వచ్చారు.

మనసులో బాధ సుడులు తిరుగుతూనే ఉంది

"నా ఆఖరి క్షణాలు ఎందుకో నీ చేతుల్లో పోవాలనిపించింది. నువ్వొచ్చావు" అన్నఆ చివరి మాటలు గుర్తొస్తున్నాయి.

తానూ చనిపోతున్నాను అన్న దిగులు, బాధ లేదు. పైగా హాయిగా ,స్వేచ్ఛగా ఆకాశంలో ఎగిరే విహంగంలా ఉన్నాడు.

నిప్పుల్లో కాలుతున్న అతని దేహం...

అనంతమైన శూన్యాన్ని చీల్చుకుంటూ వెలుగును చిమ్మే ఎర్రటి సూరీడులా అగుపిస్తోంది. ■


## సాహిత్యప్రస్థానం

ప్రతి నెలా క్రమం తప్పకుండా
వెలువడుతోంది..
చందాదారులుగా చేరండి ..
చేర్పించండి.
ఆర్థికంగా, హార్థికంగా
సహాయకారాలు అందించండి.




# మృత్యుఘోష


- చిన్ని నారాయణ రావు

94402 02942


కాలం దగా చేస్తున్నది
నిశ్శబ్దంగా చురకత్తులు విసురుతున్నది
మనిషి –
ఆకురాలినంత ధ్వని ఆవహించి
మరణవాంఙ్మాలంలోకి జారుకొంటున్నాడు
చెట్లు రోదించలేని నిస్సహాయతతో
'కోమా'లో బతుకునీడుస్తున్నాయి
ఇది మనుషులు ఖాళీ చేస్తున్న దేశం
సామాన్లు సర్దుకొని వెళ్ళిపోతున్న దుఃఖం
ఈ జీవితం నాదికాదంటూ
వేదనల రోదనలే దృశ్యాదృశ్యమైన ఉన్మాద స్థితి
ఈ శవాల గుట్టల జాతరల్లో
ఆత్మను చంపుకొని బతకడం అంటే
దేనికి సంకేతంగా చెప్పుకోవాలి
అంతులేని శోకం మిన్నంటి
అపరిష్కృతంగా అనంతమవుతున్నది
ఈ గాయం మానని రాచపుండైంది
కళ్ళు పొడుచుకున్నా కానరాని
నిశీధి అంతా పరుచుకొన్నది
ప్రపంచానికి ప్రమాద ఘంటికల
సమయం ఆసన్నమైంది
దేశమంటే మనుషులు కాదు
శవాల దిబ్బలూను...
దేశమంటే మృత్యుఘోష ! ■



# ద్రవిద్దాం రా!


- కవితశ్రీ
94946 96990

ఎప్పుడూ నీ గూడూ నీ గోడేనా?
చూడు పొదిగి పొదిగి ఎంత ఒదిగిపోయావో
ఎదగడం పురుట్లోనే మానేసినట్టున్నావు
ఐనా
ఇంకెక్కడ నీ గూడు?
ఇంకా ఎక్కడ నీ పిల్లలు?
రివ్వున దూసుకుపోతున్నాయి చూడు
రెక్కలొచ్చి
ఆశలజాడీల్లో ఊరికే ఊరిపోక
నాతో రా
మన బావి దాటి
అలా సాగరాలీది సేదదీరొద్దాం
ఎందుకంతలా ముడుచుకుపోతావు?
నన్నెందుకింతలా కుచింపజేస్తావు?
విజయమంటావా?
నీ కడగంటి కటాక్షమొకటి పడెయ్యి
అంతరిక్షాల్ని పట్టుకు వస్తా
నీకు తెలుసు కదా
నీ నవ్వు నా కళ్ళలో విరిసినప్పుడు
ఎన్ని శిఖరాలు అధిరోహించానో
నీ అశాంతి నన్ను దహించివేసినప్పుడు
ఎన్ని పాతాళాల్లో పతనమయ్యానో
ఒక్కసారి జ్ఞాపకం చేసుకో!

నాతో రా
గడ్డకట్టుకుపోయి అణుపుకున్నది ఇక చాలు
ఇకనుంచైనా
ద్రవించడం అలవాటుపడదాం
స్రవించడం మొదలెడదాం!

జలజల పారడం నేర్చుకుందాం
ఆశ్వాసించడంలో రుచుల్ని ఆస్వాదిస్దాం
గూడులేక గోరాడేవి
నీడలేక నిట్టూర్చేవి
రెక్కలు రానివి లేనివి విరిగిపడ్డవి
ఎన్నెన్నో పక్షులు అలమటిస్తున్నాయి
దీనంగా ఓ తడి వాక్యం ఆసరా కోసం
నాతో రా
ఇకనుంచైనా
బతుకు రహదారుల పక్కన నీడలై నిలబడదాం
బయల్దేరు మరి
మనం కదనమే చెయ్యాల్సుంది! ■

## సమీక్ష




# సామాజిక పరిణామాల సాక్షి 'యారాడకొండ'

**- ఎంవిఎస్ శర్మ**

విశాఖపట్నం ఇప్పుడు జాతీయ స్థాయిలోనే గాక అంతర్జాతీయ స్థాయిలో కూడా పేరున్న నగరం. కానీ వందేళ్ళ క్రితం మాత్రం అదొక చిన్న మత్స్యకారుల గ్రామం. 1933లో అక్కడ ఓడరేవు నిర్మించారు. అప్పటినుంచి మొదలైన పారిశ్రామికాభివృద్ధి నేటికీ కొనసాగుతూనే ఉంది. విశాఖలో ఓడరేవు నిర్మించాలని అప్పటి బ్రిటిష్ ప్రభుత్వం నిర్ణయించడానికి కారణం యారాడకొండ. మన జనరల్ నాలెడ్జి పుస్తకాల్లో మాత్రం యారాడకొండ పేరు కనిపించదు. డాల్ఫిన్స్ నోస్ అనే కనిపిస్తుంది. అది తెల్లదొరలు పెట్టిన పేరు. దక్షిణం వైపు నుంచి తీరం మీదకు వచ్చే సముద్ర ప్రవాహపు ఒత్తిడిని యారాడకొండ అడ్డుకుంటుంది. అందుకే ఓడరేవుకు ఇది అనువైన ప్రదేశం అయింది. ఓడరేవు ఉన్నది కనుక పరిశ్రమలు వచ్చాయి. తూర్పు నౌకాదళం హెడ్ క్వార్టర్సు వచ్చాయి. యారాడకొండకు చుట్టూ అయిదు చదరపు కిలోమీటర్ల పరిధిలో లక్షకు పైగా సంఖ్యలో కార్మికులు పనిచేస్తూంటారు.

రచయిత ఉణుదుర్తి సుధాకర్ తన తొలి ప్రయత్నంగా రాసిన 'యారాడకొండ' నవలలో విశాఖ ఓడరేవు వచ్చాక యారాడకొండకు ఉత్తరాన ఉన్న విశాఖపట్నం పాత సిటీలో, ముఖ్యంగా జాలారిపేట మత్స్యకారుల జీవితాల్లో పారిశ్రామిక ప్రగతి వల్ల కలిగిన పర్యవసానాలను ప్రధాన ఇతివృత్తంగా తీసుకున్నాడు. సాంప్రదాయ మత్స్యకారుల జీవితానికి గంగమ్మ, గంగరాజుల తరం ప్రతినిధులు. మార్పు జరుగుతున్న కాలంలో దాని మంచి, చెడుల ప్రభావాలకు లోనై, ఎటో కొట్టుకుపోకుండా నిలదొక్కుకున్నవాళ్ళుగా నూకరాజు, ఎల్లమ్మ మనకు దర్శనమిస్తారు. నవల ప్రధానంగా వీరి చుట్టూ నడుస్తుంది. సాంప్రదాయ వృత్తి ప్రభావం ఒకవైపు, ఆధునిక మార్పులు అందించిన అవకాశాలను ఉపయోగించుకుని మారాలన్న పట్టుదల మరొకవైపు... వీరిలో కానవస్తుంది. కేవలం తాము మారడమే కాకుండా తమ చుట్టూ జరుగుతున్న దోపిడీని, వివక్షను తమకు సాధ్యమైన పద్ధతిలో ప్రతిఘటించే ఉద్యమకారులుగా వీరిద్దరూ పరిణతి చెందుతారు. వీరిని ఈ దిశగా ప్రభావితం చేసిన విశిష్ట పాత్ర భాస్కర్‌ది. సాంప్రదాయ బ్రాహ్మణ కుటుంబంలో పుట్టి అభ్యుదయ భావాలతో ప్రేరణ పొంది తనను తాను 'డీక్లాస్' చేసుకోడానికి ప్రయత్నించి విప్లవకారుడిగా పరిణతి చెందిన పాత్ర భాస్కర్‌ది. పోలమ్మ, నూకరాజుల సంతానం ఉదయ్, శరణ్య. ఇద్దరిలోనూ రెండు దిశలుగా మార్పు జరుగుతుంది. ఉదయ్ పూర్తిగా తన మూలాలనుంచి వేరుపడిపోవడమేగాక ఆ మూలాలను చీదరించుకుంటాడు. బొత్తిగా సామాజిక చైతన్యం కరువైన నేటి యువతలోని ఒక పార్శ్వానికి ఉదయ్ ప్రతినిధి. కాగా, తన మూలాలను గట్టిగా పట్టుకుని, అదే సమయంలో అభ్యుదయ భావాలతో, సామాజిక చైతన్యంతో బాధ్యతగా వ్యవహరించే నేటి యువతరపు మరో పార్శ్వానికి శరణ్య ప్రతినిధి.

జాలర్ల జీవితాల్లో ఈ పారిశ్రామికీకరణ ఎటువంటి ప్రభావాన్ని కలగజేస్తూ వచ్చిందో ఈ నవలలో ఆద్యంతం పూసలో దారంలాగా మనకు కనిపిస్తుంది. నాటు పడవలు ఉన్నంత కాలమూ జాలర్లదే రాజ్యం. జాలరి స్త్రీలదే కుటుంబంలో ఆధిపత్యం. అదే మర పడవలొచ్చేసరికి

స్వతంత్ర జీవులైన జాలర్లు కాస్తా ఆ ట్రాలర్లమీద పనిచేసే కూలీలయ్యారు. తక్కినవారు బతకలేక ఎక్కడెక్కడికో పోయారు. ఆ చేపల కంపుకి దూరంగా ఇన్నాళ్ళూ ఉంటూ వచ్చిన అగ్రవర్ణాల శాంతమూర్తి, నాయుడు ఇప్పుడు రొయ్యల కంపెనీలకు యజమానులయ్యారు. రాజకీయవేత్తలయ్యారు. సింహాచలం లాంటి కొద్దిమంది జాలర్లు వీళ్ళ దగ్గర పనిచేస్తూ, ఆ తప్పుడు పనులకు సహకరిస్తూ బ్రోకర్లుగా, చోటా లోకల్ లీడర్లుగా అవతారాలెత్తారు.

ఇంతకీ యారాడకొండ ప్రత్యక్ష సాక్షిగా జరిగిన అయిదారు దశాబ్దాల మార్పులు స్వాగతించదగ్గవా? తిరస్కరించవలసినవా? ఈ ప్రశ్న కేవలం విశాఖపట్నానికే కాదు; మొత్తం భారతదేశంలో గత 70, 80 సంవత్సరాలుగా జరిగిన పారిశ్రామికీకరణకు వర్తించే ప్రశ్న. జిడిపిలో వృద్ధి మాత్రమే సర్వస్వం అని గత ముప్పై ఏళ్ళుగా ప్రచారం చేసుకుంటున్న మేధావుల ప్రచార ప్రభావం నుంచి సామాన్యుడు బయటపడడానికి వేసుకోవలసిన ప్రశ్న. దీనికి సమాధానం ఈ నవలలో స్పష్టంగా దొరకదు. కాని 'అభివృద్ధి, ఆధునికత – అన్నీ భ్రమలేమో అనిపిస్తుంది ఒక్కోసారి. కొత్త రూపాల్లో ఆధిపత్యాలు కొనసాగుతూనే ఉంటాయి మన దేశంలో' (పే.186) అన్న నూకరాజు మాటల్లో రచయిత అంచనా సూటిగా వ్యక్తం అయింది. గిరిజనుల్లో వచ్చిన మార్పుల ప్రభావం గ్రామ సర్పంచ్ మాటల్లో వ్యక్తం అయింది. "నన్ను చూడండి. పాంటూ, షర్టూ, చెప్పులూ వేసుకుని తిరుగుతున్నాను. దళంలో ఉండగా కొద్దిగా చదవడం, రాయడం నేర్చుకున్నాను, అది నాకిప్పుడు పనికొచ్చింది. మా గూడెం వాళ్ళకు పనులు చేసిపెడుతున్నాను. మళ్ళీ కొండలెక్కి చెట్లు కొట్టి పోడు వ్యవసాయం చేయమంటే నా వల్ల అవుతుందా? నాకు ముగ్గురు కొడుకులు. పెద్దవాడు టెంత్ పాసయ్యాడు. మిగతా ఇద్దరూ ఇంటర్మీడియట్ చదివారు. వాళ్ళకి పోడు అంటే ఏమిటో కూడా తెలీదు. ఉద్యోగాల వేటలో ఉన్నారు. నీ తరం వరకూ మాలో నిరుద్యోగులెవరూ లేరు. మాకు ఆ మాటే తెలీదు. ఇప్పుడు ప్రతి గూడెంలోనూ నిరుద్యోగులు తయారయ్యారు." (పే.169)

రచయిత మరో కోణాన్ని కూడా తడిమాడు. అదే అస్తిత్వ సమస్య. సమాజాన్ని మార్చాలనుకునేవాళ్ళు కులం, భాష, జెండర్, మతం, ప్రాంతం వంటి సామాజిక అస్తిత్వ కోణాలను విస్మరిస్తే నేల విడిచి సాము చేయడమే ఔతుంది. ఈ విషయాన్ని సెల్వన్ అనే పాత్ర ద్వారా శక్తివంతంగా ముందుకు తెచ్చాడు రచయిత. "మాట్లాడితే మీరంతా పీడితులూ, తాడితులూ, పోరాటాలూ, ఉద్యమాలూ, గాడిదగుడ్డూ అంటారు. మీ ఊళ్ళో ఉన్న కమ్యూనిటీ గురించి తెలుసుకోవాలని అనుకోలేదా?" (పే. 175). "ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్ అనుకుంటూ మురిసిపోయే తెలుగువాళ్ళు ఇటాలియన్ భాషని తెలుగు ఆఫ్ ది వెస్ట్ అని ఎప్పటికీ అనబోరనీ, ఈ పోలికలు తేవడం, చంకలు గుద్దుకోవడం – వీటి వెనక ఆధిపత్య సంస్కృతి ఉంటుందనీ పాపం గ్రహించలేరు" (పే.183) ఇంకో సందర్భంలో "అవును, ఆడవాళ్ళకు స్వంత ఆర్గనైజేషన్లు ఉండాలి. రోడ్డెక్కి ఉద్యమాలు చేస్తే తప్ప ఎవరూ మనల్ని పట్టించుకోరు" (పే.171) అని ఎల్లమ్మ ద్వారా చెప్పించాడు రచయిత. ప్రపంచానికి నేడు పెను ప్రమాదంగా పరిణమిస్తున్న పర్యావరణ కాలుష్య సమస్యను రచయిత నవలలో పలు సందర్భాల్లో ప్రస్తావించడమే గాక ఉపసంహారంలో కూడా నొక్కి చెప్తాడు.

ఇటీవల కాలంలో వచ్చిన మంచి, ప్రయోజనాత్మకమైన నవలగా 'యారాడకొండ'ను పేర్కొనవచ్చు. ప్రతి రచనకూ ఉన్నట్టే, దీనికీ చాలా పరిమితులు ఉన్నాయి. పాఠకుల ముందు కొన్ని వర్తమాన సమస్యలను ఉంచి వాళ్ళు ఆలోచింపజేసేలా చేయడం ప్రధానం. అన్ని సమస్యలకూ పరిష్కారాలను సూచించడానికి ఇదేమీ రాజకీయ పార్టీ కార్యక్రమం కాదు కదా. ఆ వరకూ చూస్తే రచయిత తన బాధ్యతను నెరవేర్చడంలో జయప్రదం అయాడనే చెప్పాలి. రచయిత సుధాకర్ విశాఖవాసిగా చాలాకాలం ఉండడం నవలకు ఒక అథారిటీని కల్పిస్తుంది. ఆయన మెరైన్ ఇంజనీర్ కావడాన ఆ పరిజ్ఞానం నవల మొదటి రెండు అధ్యాయాల్లోనే ప్రతిభావంతంగా కనపడుతుంది. తన భార్య ఒక సామాజిక ఉద్యమ కార్యకర్త, మేధావి కావడం నవలలో తడిమిన సామాజికాంశాలన్నింటిలోనూ కనపడుతుంది. నవ తరం జర్నలిస్టు తన కొడుకు కావడం ఉపోద్ఘాతం, ఉపసంహారం – రెండింటిలోనూ కనిపిస్తుంది. 1950 – 2000 మధ్య కాలంలో విశాఖపట్నంలో ఉన్న వారందరికీ ఈ నవల చదవడం ఒక సెంటిమెంటల్, ఎమోషనల్ ఫీలింగ్‌ని కలిగించడం తథ్యం. ఇది అమెరికన్ తెలుగు అసోసియేషన్ (ఆటా) నిర్వహించిన నవలల పోటీలో రెండవ బహుమతి పొందిన నవల. హైదరాబాద్‌కు చెందిన అన్వీక్షకి పబ్లిషర్స్ దీనిని ప్రచురించారు. 202 పేజీలు. వెల : రు.225. విశాలాంధ్ర, నవచేతన, నవోదయ బుక్‌హౌస్‌లలో లభిస్తుంది. ■



# అమ్మ

- రవి నన్నపనేని
91821 81390

తానే నాన్నై తడిచిన కళ్ళై
సీదాగా వాడిపోయింది
కుట్టు మిషనై మా కంటిలో ఇంటిలో
ప్రాణ దీపమై వెలిగింది !


**అ**మ్మ గురించి నేనెంత చెప్పినా
ఇంకా తక్కువే
ముచ్చటగా మూడు తరాల్ని
చూసింది అమ్మ
ఒక కూతురుగా ఒక ఇల్లాలిగా
ఒక తల్లిగా - డెబ్భై ఉగాదులు పైబడిన
జీవితం అమ్మది
బొడ్డుపేగు బంధం కలిగిన బంధువర్గంలో
అమ్మ పిలవని
ఆత్మీయ పిలుపులు లేనట్లే
అమ్మ పిలిపించుకోని అనుబంధ పిలుపుల్లేవు
అమ్మ - అన్ని వావి వరుస పిలుపుల సిరి!

సంపద లేని
ఏ అమ్మ బతుకైనా
దుఃఖం లేకుండా ఎలా ఉంటుంది ?
ఉమ్మడి కుటుంబంలో
పల్లకీలో ఊరేగిన అమ్మ
వేరు కాపురంలో

అమ్మ - ఐదో తరగతి చదువూ సంతకమే కాదు
ఆమెదైన సరిగమల సంగీతంలో
హర్మోనియం స్వరమై ఆనందపడింది అమ్మ
దేవాలయాల భక్తిలో జీవన ముక్తి
వెతుకుతున్న సంప్రదాయపు స్త్రీ అమ్మ

ఎంత అందమైన అమ్మ
మల్లె పువ్వంటి అమ్మ
నా ముందే నేను చూస్తుండగానే
ఇంతగా ఆకురాలిపోయిన తీగై
ఎండుపోతున్న కొమ్మై ఎలా అయిపోయింది!

అమ్మ - నిన్న మొన్నటి మనవరాలు
నేటి అమ్మమ్మ , నాయనమ్మ
రేపటి తరానికి
'నాదైనది ఇది' అని
ఏదో ఇచ్చి పోవాలని
ఇంకా తపన పడుతున్న చాకిరి పిట్ట
అమ్మకు మాట చెప్పుకోడానికి అమ్మ లేదు
అమ్మకు లేని అమ్మ నాకుంది
అదే నా ఇప్పటి అదృష్టం!




# కాటమ రాజు కథలు మూడో సంపుటం

- డాక్టర్ తోట వెంకట స్వామి

తెలుగు జానపద సాహిత్యానికి విశ్వవిద్యాలయ స్థాయిలో గౌరవం తీసుకొని వచ్చిన మొట్టమొదటి మహానుభావుడు ఆచార్య బిరుదురాజు రామరాజు గారు. వీరు చేసిన 'తెలుగు జానపద గేయ సాహిత్యము' అనే పరిశోధనకు ఉస్మానియా విశ్వవిద్యాలయం వారు 1956లో పిహెచ్.డి. డిగ్రీ ఇచ్చారు. ఇది 1958లో గ్రంథరూపంలో వెలువడి ఎంతో ప్రసిద్ధి పొందింది. వీరి తరువాత జానపద సాహిత్యరంగంలో విశేషమైన కృషిచేసిన వ్యక్తి ఆచార్య తంగిరాల వెంకట సుబ్బారావు గారు. వీరు రామరాజు గారి పరిశోధనలోని మూడవ ప్రకరణమైన చారిత్రక గేయాలను గ్రహించి, ఎన్నో నూతన విషయాలను ఆవిష్కరిస్తూ ముందుకు వెళ్ళారు. తంగిరాల వారు "తెలుగు వీరగాథా కవిత్వము" అనే అంశాన్ని గురించి శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో 1963 నుంచి 1968 వరకూ, ఐదు సంవత్సరాలు అహోరాత్రులు కృషిచేశారు. ఆంధ్ర, రాయలసీమ, తెలంగాణా ప్రాంతాలన్నీ పర్యటించి సుమారు 40 తాళపత్ర గ్రంథాలను సేకరించారు; ఎన్నో మౌఖిక వీరగాథలను గ్రంథస్థం చేశారు. వీరి పరిశోధనకు 1969లో పిహెచ్.డి. డిగ్రీ వచ్చింది.

భారతీయులకు ప్రపంచ ప్రసిద్ధికెక్కిన రెండు గొప్ప ఇతిహాసాలున్నాయి : 1. వాల్మీకి రామాయణం, 2. వ్యాస మహాభారతం. తెలుగువారికి ఈ రామాయణ మహాభారతాలతోపాటు మరో రెండు జాతీయమైన ఉత్తమ ఇతిహాసాలున్నాయి: అవి 1.పల్నాటి వీరచరిత్ర, 2. కాటమరాజు చరిత్ర. ఇవి ఒక్కొక్క వీరగాథలు కావనీ, ఇవి "వీరగాథాచక్రములు" (Ballad-cycles) లేక "జానపద ఇతిహాసములు" (Folk Epics) అనీ ఆచార్య తంగిరాల వారు మొట్టమొదటసారిగా నిరూపించారు. పల్నాటి వీరకథాచక్రములో 25 వీరగాథలున్నాయని; కాటమరాజు కథాచక్రములో 32 వీరగాథలున్నాయని స్థాపించారు; ఆ కథల పేర్లు కూడా ఇచ్చారు.

ఆచార్య తంగిరాల వారు పరిశోధన ప్రారంభించే నాటికి కాటమరాజు కథలలో వేటూరి ప్రభాకరశాస్త్రి గారి కృషి వల్ల మూడు కథలు మాత్రమే ముద్రితమయ్యాయి. అవి : ఎఱ్ఱగడ్డపాటి పోట్లాట, ఖట్టురాయబారము, కోటపాటి తాటివృక్షం తెచ్చే కథ. తక్కినవేవీ సాహిత్యలోకానికి తెలియవు. సుబ్బారావు గారు ఎంతో పరిశోధించి 32 కథల పేర్లు ఇంచుమించుగా చెప్పగలిగారు. వాటిలో 20 కథలు సేకరించారు. వీటిని 1974-75 సంవత్సరాల్లో వారి పండితమిత్రులైన డా॥ చన్నాప్రగడ తిరుపతిరావు గారి సహాయ సహకారాలతో చక్కగా పరిష్కరించి, 300 పుటల సమగ్రమైన పీఠికతో సిద్ధం చేశారు. ఈ కాటమరాజు కథలను అప్పటి ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడెమీ వారు రెండు సంపుటాలుగా ప్రచురించారు. ఒక్కొక్కటి సుమారు వేయి పుటలు (బౌండు పుస్తకం). 1976లో మొదటి సంపుటం, 1978లో రెండవ సంపుటం వెలువడి, ఆచార్య తంగిరాల సుబ్బారావు గారికి అఖండమైన కీర్తిప్రతిష్ఠలను సంపాదించి పెట్టాయి. నోరి నరసింహశాస్త్రి వంటి పండితులు వీరిని ఎంతగానో ప్రశంసించారు. అకాడెమీ అస్తమించి, తెలుగు విశ్వవిద్యాలయం స్థాపించబడ్డాక, 1998లో (అంటే 20 ఏండ్ల తరువాత) తెలుగు విశ్వవిద్యాలయం వారు ఈ కాటమరాజు

కథలు రెండు సంపుటాలనూ పునర్ముద్రించారు. మళ్ళీ ఇంకో 22 ఏండ్లు గడిచిన తరువాత ఇప్పుడు తంగిరాలవారు తన 87 సంవత్సరాల వయసులో, నలుగురు మిత్రుల సహకారంతో ఈ కాటమరాజు కథల మూడవ సంపుటాన్ని ప్రచురించారు. ఈ గ్రంథం ప్రసిద్ధ చిత్రకారులు అరసవల్లి గిరిధర్ గారి 'కటియావులరాజు' ముఖచిత్రంతో, వెనుక అట్ట మీద కళాప్రపూర్ణ 'బాపు' గారి 'కాటమరాజు' చిత్రంతో, కేస్ బైండింగ్ తో సర్వాంగ సుందరంగా గత సంక్రాంతికి వెలువడింది.

కీ.శే. ఆరాధ్యుల పిచ్చయ్య గారు (1963–70ల మధ్య, ఆంధ్రప్రదేశ్ యాదవసంఘం కార్యదర్శి), కీ.శే. డా॥ కనకబండి మోహనరావు గారు, శ్రీ మట్టి గురవయ్య గారు, ప్రొ॥ మట్టెబోయిన జయదేవ్ గారు సేకరించి ఇచ్చిన నాలుగు తాళపత్ర గ్రంథాలను పరిష్కరించి, 74 పుటల విపులమైన, మిక్కిలి విలువైన పీఠిక రాసి, ఈ 'కాటమరాజు కథలు' – మూడవ సంపుటాన్ని నిర్మించారు ప్రధాన సంపాదకులైన ఆచార్య తంగిరాల వారు. ఇది మిక్కిలి విలువైన పరిశోధన గ్రంథం. సామాన్య పాఠకులు సులభంగా కథలను అవగాహన చేసుకొనేందుకు వీలుగా ప్రతి కథలోనూ కథాగమనాన్ని సూచిస్తూ చక్కని ఉప శీర్షికలను ఉంచారు.

ఈ సంకలనంలో కాటమరాజు చరిత్రకు సంబంధించిన నాలుగు కొత్త వీరగాథలు ఉన్నాయి. అవి :

**1. కటియావులరాజు కథ**

ప్రొ॥ సుబ్బారావు గారు 1966లోనే ఇద్దరు భిన్న కవుల రచనలైన రెండు కటియావులరాజు కథలను సేకరించి, తమ కాటమరాజు కథలు – మొదటి సంపుటం (1976)లో ముద్రించారు. ఈ సంపుటిలో

ఉన్నది మరియొక కవి రచన. (ఆ కవి పేరు మాత్రం అవతారికలో లేదు.) దీనిని ఆరాధ్యుల పిచ్చయ్య గారు 1972–73 ప్రాంతంలో సేకరించారు. కటియావుల రాజు, కాటమరాజు పెదతండ్రియైన సింహాద్రిరాజు కుమారుడు; ఏకాంగవీరుడు. మహాభారతంలోని భీమార్జునుల వంటి సాటిలేని మేటివీరుడు; మిక్కిలి బలశాలి.

ఐతమరాజు 'ఉర్లుకొండ యలమంచి'ని పాలిస్తున్నాడు. (ఇది నేటి తెలంగాణ రాష్ట్రంలోని నల్లగొండ జిల్లాలో ఉంది.) ఓరుగల్లు నుంచి బాచన్న అనే బ్రాహ్మణుడు గంగ తిరునాళ్ళు చూడటానికి యలమంచికి వచ్చి, ఓరుగల్లులో 'కలియుగ బేతాళుడు' అనే మాస్టీడు కోటగుమ్మానికి తన బిరుదులను వ్రేలాడగట్టాడని, ఎంత గొప్ప వీరుడైనా సరే ఆ బిరుదుల కిందనుండి దూరి రావలెనని, లేనిచో తనతో ద్వంద్వయుద్ధంచేసి గెలవాలని చెపు తున్నాడని అంటాడు. ఈ వార్త కటియావులరాజుకు తెలుస్తుంది. అతడు బేతాళుని గర్వం అణచాలని నిర్ణయించుకుంటాడు.

అయితమ రాజు, పల్లికొండ, ఇతర యాదవ వీరులతో కలిసి కటియావులరాజు ఓరుగంటి శంభుని తిరునాళ్ళకు వెడతాడు. తన 'గండకత్తెర' అనే గొప్ప పంచకల్యాణి గుఱ్ఱంపై స్వారీ చేస్తూ ఓరుగల్లు నగరంలోకి ప్రవేశించబోతాడు. కాని అతని గుఱ్ఱం కోటగుమ్మం దగ్గరే ఆగిపోయింది! లోపలికి వెళ్ళటం లేదు. కారణమేమిటో తెలియక, కటియావులరాజు గుఱ్ఱం దిగి నాలుగువైపులా చూస్తాడు. గుఱ్ఱం తన ముట్టెను పైకెత్తి కోటగుమ్మంవైపు చూపెడుతుంది. అక్కడ బేతాళుని బిరుదులు వ్రేలాడుతూ ఉంటాయి. వాటి కిందనుండి దూరి వెళ్ళడం తనకు తన యజమానికి అవమానకరమని భావించి ఆ 'గండకత్తెర' గుఱ్ఱం ఓరుగల్లు కోటగుమ్మం దగ్గరే ఆగిపోయింది! వీరుడు ఎంత గొప్పవాడో అతని గుఱ్ఱం కూడా అంతే గొప్పగా అంతే పౌరుషంతో ఉంటుంది. పలనాటి వీరకథల్లో అలరాజుగుఱ్ఱం 'సవరాల జిమ్మడు', పెద్దన్న బాదరాజు గుఱ్ఱం 'కారుబొల్లడు' ఇటువంటి విశిష్టమైన గుఱ్ఱాలే! ఇవి వీరగాథల్లో ప్రత్యేక పాత్ర పోషించాయి.

ఆ బిరుదులు తొలగించమని కటియావుల రాజు అక్కడనున్న భటులద్వారా బేతాళునికి కబురుచేస్తాడు. అతడు ఏమాత్రమూ అంగీకరించడు. కటియావుల రాజుకు కోపం వచ్చి, తన ఎడమకాలితో ఆ బిరుదుల్ని తన్ని నేలకూల్చి, నగరంలోకి ప్రవేశిస్తాడు. దీనితో బేతాళుడు మండిపడి, పౌరుషం పెరిగి కటియావులరాజును ద్వంద్వయుద్ధానికి ఆహ్వానిస్తాడు. ఇద్దరూ బేతాళుని కత్తుల గరిడిలో హోరాహోరీగా పోట్లాడతారు. మొదట బేతాళుడు తన కత్తితో మూడు హస్తాలు చూపుతూ మూడు దెబ్బలు కొడతాడు. ఆ మూడు దెబ్బలూ చాకచక్యంగా తప్పించుకుంటాడు కటియావుల రాజు. "నాకు నీలాగ మూడు హస్తాలు చూడడం (మూడుసార్లు attack చేయడం) అవసరం లేదు. ఒకే ఒక్క దెబ్బతో నిన్ను చంపేస్తాను. కాని నిన్ను క్షమిస్తున్నాను. ప్రాణాల మీద తీపి ఉంటే వెళ్ళిపో!" అని ఓరుగల్లు ప్రజలందరి ముందు ప్రకటిస్తాడు కటియావుల రాజు. అహంకారియైన బేతాళుడు అతని క్షమాభిక్షను అంగీకరించడు. అందువల్ల కటియావుల రాజు విధిలేక అతనిని చంపుతాడు. బేతాళుని తమ్ములు 'కన్నమాధీరుడు', 'రంపాల కేశవుడు' కూడా కటియావుల రాజును ఎదిరించి చనిపోతారు.

ఈ 'కలియుగ బేతాళుడు' ప్రతాపరుద్రుని సేనానియైన 'బేతాళరెడ్డి'. అతనిని చంపినందులకు ప్రతాపరుద్రునికి కోపం వస్తుంది. అతడు అయితమరాజును మాయోపాయంతో చంపాలని చూస్తాడు. అలుగుల సింహాసనం మీద కూర్చోమంటాడు; పెంకిగుఱ్ఱాన్ని బహూకరించి స్వారీ చేయమంటాడు; విషాన్నం పెట్టి తినమంటాడు. ఈ అన్ని ఆపదల నుండి మంత్రి పల్లికొండ అతనిని కాపాడతాడు. యాదవులు శంభుని సేవించి తిరిగి వెళ్ళిపోతుంటే ప్రతాపరుద్రుడు వారి మీదికి సైన్యాలను పంపుతాడు. ఆ సేనలను కటియావుల రాజు చిత్తుచిత్తుగా ఓడిస్తాడు. యాదవులు క్షేమంగా యలమంచికి చేరుకుంటారు. ఈ వీరగాథ చదువుతూ ఉంటే ఏదో గొప్ప హాలీవుడ్ యుద్ధచిత్రం చూస్తున్న అనుభూతి కలుగుతుంది.

**2. 'పుల్లరికథ' లేక 'జన్నివాడ కథ'**

దీనికే 'కాటమరాజు దక్షిణాది ఆవుల మేపు' అనే పేరు కూడా ఉంది. దీనిని ప్రొ॥ సుబ్బారావు గారు 1964లోనే కృష్ణా జిల్లాలో సేకరించి, తమ 'కాటమరాజు కథలు' రెండవ సంపుటంలో (1978లో) ముద్రించారు. అయితే ఆ కథలో ప్రారంభంలో 'ఇష్టదేవతా ప్రార్థన, కవివంశాదికము, పుల్లరి ఒప్పందము' అనే భాగాలు లోపించాయి. ఈ భాగాలు ఉన్న కథ (తాళపత్ర గ్రంథం) డా॥ కనకబండి మోహనరావు గారికి 1991లో లభించింది. దీనిని బట్టి కవి పేరు "కనకబండి గట్టయ్య (ఘట్టయ్య)' (ఇది 'గంటయ్య' అని కూడా కావచ్చు.) ఈ కథలో పుల్లరి ఒప్పందం చాలా వివరంగా ఉంది. "నీరుకు పుట్టిన పూరెల్లమాది/ ఆవుకు పుట్టిన కోడెల్లమీది" అనే పుల్లరి ఒప్పందం చాలా వివరంగా ఉంది. యాదవులు అమాయకులు కదా అని నెల్లూరి రాజు నల్లసిద్ధి వేలాది వరహాలను పుల్లరిగా ఇవ్వాలని ఈ ఒప్పందంలో చేరుస్తాడు. నల్లసిద్ధి రెండవ భార్య కుందమాదేవి బోయలచేత కాటమరాజు ఆలమందలను పొడిపిస్తుంది. దీనితో కోపించిన కాటమరాజు నెల్లూరు వరిచేలను మేపించి, పుల్లరినీయక, ఎఱ్ఱగడ్డపాడుకు వెళ్ళి పోతాడు. తనకు జరిగిన ఆవుల నష్టానికి, నెల్లూరి రాజుకు ఈయవలసిన పుల్లరికి సరిపోయింది అంటాడు. దీనితో ఇద్దరికీ మధ్య యుద్ధం వస్తుంది.

**3. బొంగరాల కథ**

ప్రొ॥ సుబ్బారావు గారు ఈ కథకు సంబంధించిన మూడు తాళపత్ర గ్రంథాలను 1966లో సేకరించి, తమ 'కాటమరాజు కథలు' – రెండవ సంపుటం (1978)లో ముద్రించారు. కాని ఇవి అసమగ్రంగా ఉన్నాయి. మట్టి గురవయ్య గారు 2014లో సేకరించి ఇచ్చిన తాళపత్ర గ్రంథంలో కథ సమగ్రంగా ఉంది. దీని రచయిత 'గొఱ్ఱెపాటి మల్లయ్య' అని గ్రంథావతారికను బట్టి తెలుస్తోంది. ధనముకొండలో బాలరాజులైన ముమ్మయ్య – పోచయ్య బొంగరాలాడటం, ఆ బొంగరం వెళ్ళి కోమటి అచ్చమ్మ కాలికి తగలడం, ఆమె వారిని దూషించడం, దానిని బట్టి అయితమరాజాదులు ఎఱ్ఱగడ్డపాటి రణభూమికి వెళ్ళారని బాలరాజులు తెలుసుకోవడం, తమను కూడా యుద్ధానికి పంపమని సిరిదేవిని కోరడం, ఆమె ఎంతో కష్టం మీద అంగీకరించడం, బాలరాజులు పాలేటికి పయనమై పోతూ ఉంటే వివిధ శకునాలు కావడం, ఆ శకున ఫలితాలను ముమ్మయ్య అడుగుతూ ఉంటే – పోచయ్య వివరించడం – అనే ఘట్టంలో మధ్యలో ఆగిపోతుంది సుబ్బారావు గారు సేకరించిన 'వేడుక బొంగరాల కథ'. శ్రీ మట్టి గురవయ్య గారు సేకరించిన 'బొంగరాల కథ' ఇంకా ముందుకు సాగి, బాలరాజులు ఎఱ్ఱగడ్డపాడులో ఉన్న కాటమరాజును కలుసుకోవడం, పల్లికొండ పోలురాజు కథను వివరించి చెప్పడం, పంచలింగాల కొండమీద ఉన్న వీరశిలలను పూజించడం, అవి పలకడం, ఉత్పాతాలు పుట్టడం, యాదవులు యుద్ధసన్నద్ధులు కావడంతో ఈ కథ ముగుస్తుంది. ఈ ముమ్మయ్య – పోచయ్యల 'బొంగరాల కథ', శ్రీనాథుడు రచించిన 'బాలచంద్రుని యుద్ధం'లోని 'బొంగరాల కథ'కు పూర్తి అనుకరణమనుట స్పష్టం.

**4. పాపనూక వలపోత**

ప్రొ॥ తంగిరాల గారికి 'పాపనూక కథ' లభించింది కాని ఆమె 'వలపోత కథ' లభించలేదు. దీనిని ఆంధ్ర విశ్వ విద్యాలయం నివృత్త తెలుగు ఆచార్యులు ప్రొ॥ ఎం.జయదేవ్ గారు 2010 ప్రాంతంలో విజయనగరం జిల్లా గజపతినగరంలో పొడపోతుల వారి దగ్గరనుండి సేకరించారు. పాపనూక, కథా నాయకుడైన కాటమరాజుకు చెల్లెలు. ఈమె దుష్టనక్షత్రంలో పుట్టిందనే భయంతో, జ్యోతిషులు చెప్పిన ప్రకారం, ఆమెకు పెళ్ళి చేయకుండా, ధనుమకొండ ఊరిబయట ఏడంతస్తుల ఒంటిస్తంభం మేడ కట్టించి, అందులో ఉంచుతారు. అలా ఆరు నెలలు గడుస్తాయి. అప్పుడు ఎఱ్ఱగడ్డపాటి పోట్లాటలో యాదవులందరూ వీరస్వర్గమలంకరించారనే వార్త, కాశిలో ఉన్న భక్తిరన్నకు తెలిసి, అతడు ధనముకొండకు వస్తాడు. తల్లి సిరిదేవి అంతఃపురంలో పాపనూక కనిపించదు. తల్లిని ప్రశ్నిస్తాడు. ఆమె ముఖం వెలవెలపోతుంది. అప్పుడు పల్లికొండ భార్య 'పందుముల ఎరినప్ప' పాపనూక దుష్ట నక్షత్రంలో పుట్టడం

వల్ల ఊరిబయట ఏడంతస్తుల మేడలో ఉంచిన సంగతి చెపుతుంది. భక్తిరన్న తల్లి చేసిన పనికి మిక్కిలి దుఃఖించి, పాపనూకను తీసికొని రమ్మని 'ఎరినప్ప'ను, పద్మరాఘవుని భార్య 'పైడిఎల్లప్ప'ను, పాపనూక చెలికత్తెలను ఊరిబయట మేడ దగ్గరకు పంపుతాడు. ఎరినప్ప ఎంత నచ్చచెప్పినా పాపనూక రాదు. తన బాధనంతా వెలిగ్రక్కుతుంది. కల్యాణ నగరంలో కలబోతులవారింట (పెందోట ముద్దమ్మ దగ్గర) హాయిగా ఉన్న తనను తీసికొనివచ్చి, ఇలా ఊరిబయట ఉంచినందుకు భక్తిరన్న మీద మిక్కిలిగా కోపిస్తుంది. పెద్దిరాజు యుద్ధంలో మరణించడం, తల్లి పెద్దమ్మ సహగమనం చేయడం వివరంగా చెపుతుంది. పాపనూక మేడ దిగిరాదన్న విషయం తన దివ్యదృష్టితో గ్రహించిన భక్తిరన్న ధనముకొండతోపాటు పాపనూక మేడ కూడా అగ్నిపాలు కావాలని శపించి, విభూతి మంత్రించి చల్లి పాలేటికి వెళ్ళిపోతాడు. ఎరినప్ప, ఇతర స్త్రీలు పాపనూకతో మాట్లాడుతూ ఉండగానే, ఆ ఒంటిస్తంభం మేడకు అగ్నిముట్టుకొని యాదవకాంతలందరూ మంటలకు ఆహుతి అయిపోతారు. ఊరంతా కాలిపోతుంది.

ఈ విధంగా నాలుగు నూతన వీరగాథలను సేకరించి, సుమారు రెండు లక్షల రూపాయలు వెచ్చించి అందంగా ముద్రించిన ఆచార్య తంగిరాల వెంకటసుబ్బారావుగారిని మనసారా అభినందిస్తున్నాను. ఇంకా సేకరించవలసిన ఆరుకథలనుగురించి వారు ఈ గ్రంథం చివర ఒక ప్రకటన కూడా చేశారు. అవి: ''సింహాద్రిరాజు కథ'' – "నలనూకరాజుకథ" – "భైరవ కురవ యుద్ధం" – "అగుమంచి వలపోత" – "పల్లికొండ పుట్టుక" – "గంగపుట్టుక". వీటిని ఎవరైనా సేకరించి పంపితే, తాను ముద్రిస్తానని వాగ్దానం చేస్తున్నారు ఆచార్య తంగిరాల వారు. వీటిని సేకరించడంకోసం యువ పరిశోధకులు నడుములు బిగించాలి.

(వివరాలు : కాటమరాజు కథలు – మూడవ సంపుటం, ప్రధాన సంపాదకులు : ఆచార్య తంగిరాల వెంకట సుబ్బారావు, పుటలు: lxxiv +330, వెల: రూ.400/–, ప్రాప్తిస్థానం: ప్రముఖ పుస్తక కేంద్రాలు)

■


## దేశానికి ఊపిరి ఆడట్లేదు

ఏమైందో
పరీక్షించేందుకు పరీక్షా కేంద్రాల్లేవు
చేసిన పరీక్షలకూ ఫలితాలూ ఆలస్యమే!
ఆస్పత్రికి పోదాం అంటే ఖాళీల్లేవు
దొరికిన గదిలో ఉందామంటే
సరిపడినన్ని మంచాలు లేవు
ఊపిరిని నిలిపే ప్రాణ వాయువు లేదు
ఔషదాలు కూడా చీకటి బజారులో
సరుకులవుతున్నాయి
స్వదేశీ టీకా సైతం విదేశీయులకు అమ్ముడైంది
జవాబు చెప్పాల్సిన తెల్ల గెడ్డాల స్వామీజీ..
ఇంకా హితవచనాలే వండి వార్చుతున్నాడు

కుంభమేళాకి అనుమతినిచ్చాడు
ఎన్నికలకు ప్రచారం చేసాడు
బహిరంగ ప్రదేశాల్లో జనం గుమికూడితే
మనకేం అని వదిలేసాడు
అన్నీ అంతంతై ప్రవహించాయి
గంగా నదిలో మునిగితే
రోగం పోతుందన్న పిచ్చి శాస్త్రాలను సమర్థించాడు
గోమూత్రంతో వైరస్లు పోతాయంటే
మౌనంగా అంగీకరించాడు

ఈ రోజున దేశం గాయపడింది
ఇది వైరస్ వల్ల ఏర్పడ్డ గాయం కాదు
స్వార్థం దుప్పటి కప్పుకున్న రాజకీయం చేసిన గాయం
ప్రాణాలుండగానే పీక్కు తినే రాబందుల గాయం
దేశ సంరక్షణను సైతం సొమ్ము చేసుకునే
అవకాశవాదులు మిగిల్చిన గాయం
ఈ దాడికి కూడా ముగింపు వుంటుంది
అది కొన్ని వేల గొంతుల రాపిడి నుంచే ఉద్భవిస్తుంది!

**- సృజన**



# ముత్యాల దారం

- ఎంఆర్ అరుణ కుమారి
81215 23835

"**చి**న్నోడా! రేపు పొద్దన్నే నన్ను మన ఊరి బస్సు ఎక్కించురా"

"మన ఊరి బస్సా? ఏమిప్పుడు ఊరు పైకి మళ్ళింది మనసు?"

"పెద్దోడు ఈ పొద్దు ఫోన్ చేసినాడు రా. మీ వదినకి పెద్ద ఆపరేషన్ చేసినారంట."

"అయితే ఏమిప్పుడు?"

"అదేంమాటరా? పోయి చూడాల కదా!"

"ఎవరు ఎవర్ని చూడాల? నువ్వు పోయిన నెల కన్ను ఆపరేషన్ చేసుకుంటే ఆయమ్మ గాని, ఆయప్ప గాని వచ్చి చూసినారా నిన్ను?"

"అయ్యో! అట్టా లెక్కలు వేసుకుంటే ఎట్టరా? ఆ బిడ్డ మన ఇంటి కోడలు కదా.. పరాయిదా ఏమన్నానా?"

"ఇంటున్నావా బ్బా మీ అమ్మ మాటలు? నేను చెప్తే కాదంటావు.. కానీ మీ అమ్మకు పెద్ద కోడలు అంటేనే ఇష్టం. అవును కదా ఆయమ్మ సొయానా అన్న కూతురు. సొంతం కదా. నేను ఎంత చేసినా చూసినా పరాయి దాన్నే కదా."

"అబ్బా! నువ్వుండు మే. ఏమి సందు దొరకతాదాని చూస్తా ఉంటావు."

"బాగుండాది సంబడం! నేను నోరు తెరవకూడదు.. కసిరి కొడతావు. అమ్మా కొడుకులు యాడన్నా పొండి. నాకేం వచ్చే!"

"అట్లని నోరు మూసుకుని ఉండవు కదా? డింగ్ డింగ్మని ప్రతి మాటకూ అడ్డం వచ్చేదేలా? మా! నువ్వు చెప్పు! ఆయమ్మ పెట్టిన నరక బాధలు అప్పుడే మర్చి పోతివా?"

"మరుగు, మరుపు చేస్కోపోతే బతుకు ఎట్టా సాగుతాది చిన్నోడా? సుఖానికి ఉన్నా లేకపోయినా ... కష్టానికి కాపు కాసే వాళ్లే కదా అయినోళ్లు. బాధలో ఉండేనప్పుడు పాత కతలు ఎత్తి పొడిస్తే పెద్దంతరం అయితాదా? వాళ్లు నన్ను చూడకపోయినా చెల్లుబాటు అయిపోతది. పెద్దదాన్ని నే పోకపోతే బాగుంటదా చెప్పు. అయినా ఇప్పుడు నేను నిన్ను, లక్ష్మిని రమ్మనటం లేదు కదా... నేను పోయి చూసొస్తానంటున్నా గానీ!

"ఓహో! అట్లయితే మేం కూడా రావాలనే కదా నీ ఉద్దేశం?"

"వస్తే మంచిదే కదా లక్ష్మి? కుటుంబరం అన్నాక.. ఎన్నో వస్తుంటాయి. పోతాంటాయి. పంతం పట్టుకొని మనుషుల్ని దూరం చేసుకుంటే ఎట్లా?"

"ఇదిగో అత్తా! దినాము.. అయిన దానికి, కానిదానికి రచ్చ లేసి రంపులాడి కడుపునిండా అన్నం కూడా తిననీకుండా కన్న బాధలు పెట్టిన ఆ మహా తల్లిని చూస్తే వచ్చే మంచి మాకు ఏమీ వద్దులే గానీ .. నువ్వు పోవాలంటా వుండావు కదా! పో! కోడలికి సేవకాలు కూడా చేసుకో. మమ్మల్ని మాత్రం రమ్మనద్దు. నీకో దండం."

"నివురు గప్పినంత మాత్రాన తాకితే నిప్పు కాల్చదా? దూరంగా ఉన్నంత మాత్రాన సంబంధాలు తెగిపోతాయా? అజ్ఞానపు మాటలు, చేతలు అనుబంధాన్ని తుంచేస్తాయా? అహంభావం తెరలు తొలగితే మమతల మనసు ఆత్మీయతానురాగాలు పంచదా?

◆ ◆ ◆

"పెద్దోడా! రేపు పొద్దున్నే నన్ను బస్సు ఎక్కించు రా. చిన్నోడికి ఫోన్ చేసి ఇట్టియ్యి. బస్టాండ్‌కి వచ్చి నన్ను తీసుకపొమ్మని చెప్పా. ఆ టౌన్‌లో నాకు దిక్కు తెలీదు."

"ఏమ్మా! అప్పుడే పోతావా?"

"అప్పుడే ఏమి రా? నేనొచ్చి నెల అయింది కదా!"

"అయితే ఏమి? ఉండకూడదా?"

"ఉండనీ లేరా. పోతా! ఇప్పుడు సుశీలకు గడా ఆరోగ్గిరం బాగుండాది కదా!"

"బాగుంటే... ఉండకూడదా అత్తా?"

"............"

"ఏమత్తా? అట్టా వింతగా చూస్తాండావు? ఇది నీ ఇల్లే కదా! చిన్నోడ్ని నిండు కడుపుతో పెట్టుకొని కూడా ఇల్లు కట్టేకి మట్టి, రాళ్ళు మోస్తివని చెప్తాంటివి కదా. ఈ ఇల్లు నీ ప్రాణం అంటాంటివే. అయితే ఇప్పుడు ఒక నెలకే పోతాను అంటున్నావు. ఏం బా అట్టా రాయి మాదిరి నిలబడకపోతే అత్తకు చెప్పా వుండమని."

"నిజంగానే నాకు నోట్లో మాట రావడం లేదు మే!"

"ఏమీ? ఏమొచ్చింది మాయ రోగము?"

"ఆ.. ఆ.. అవును మే. నీకు రోగం వచ్చి... పడవ బడితే రేయి పగలు నీకు సేవకాలు, ఇంటి చాకిరంతా చేసిందానికే కదా మా అమ్మను ఉండమంటుండావు. ఇప్పుడు నీకు బాగానే ఉండాది కదా. ఇంకేం పని మా అమ్మతో."

"చచ్చిన పామును మల్లా చంపడం అంటే ఇదే కదా! మనుషులు ఎల్లకాలము ఒకే మాదిరిగా ఉండి పోతారా? మారరా?"

"అయితే నీకు సేవకాలు చేసిందని మారి పోయావా? ఇంకా చేయించుకోవాలని ఉండమంటాండావా?"

"అయ్యో! ఇంకానా? నా కండ్లు పోవా? నా కన్నతల్లి కూడా చెయ్యని పనులన్నీ చేసి నన్ను బతికించి.. నా బిడ్డలకు తల్లిగా నిలబెట్టింది. ఇంక నేను ఎంత చేస్తే అత్త రుణం తీరుతాది?"

"అయితే సుశీలా! నిజంగా నీకు తన మన అంటే ఏందో ఇంగా బుద్ధి రాలేదా? బదులు రుణం తీర్చుకోవడానికే మా అమ్మను వుండమంటుండావా? ఇంకొన్ని దినాలకు మళ్లీ మా అమ్మతో ముందు మాదిరే జగడాలు...."

"అయ్యో! అయ్యో! నీకు నామీద రవంత కూడా నమ్మకమే లేదా?"

"లేకపోబట్టేనా నువ్వు ఏం చేసినా చెల్లుబాటయ్యింది? మా అమ్మను కన్న బాధలు పెట్టినా, పస్తులు పెట్టినా గమ్మునుండిందీ! నీ మీద ప్రేమతోనే కాదా? ఊర్లో వాళ్లు ఎవరో చెప్తే మా తమ్ముడు టౌన్ నుంచి వచ్చి తీసుకుపోబట్టే మా అమ్మ బతికిపోయింది. పెద్ద మనసుతో మల్లా వచ్చి నీకు సేవకాలు చేసి నిన్ను బతికించింది గాని లేకపోతే మా అమ్మ ఎప్పుడో మా అయ్య దగ్గరకు ఎల్లిపోయుండదా?"

"అబ్బా! నాదే తప్పని ఒప్పుకుంటున్నాను కదా? తప్పుచేసిన వాళ్లను క్షమించకూడదా?"

"ఆ! పుటకతో వచ్చిన బుద్ధి పుడకతో గాని పోదంటారు. నిన్నెట్టా నమ్మేదిలే! క్షమించమని మా అమ్మ కాళ్ళు పట్టుకొని అడిగినావా?"

"అయ్యో పెద్దోడా! అయేం మాటలూ?"

"నిజమే అత్తా! పెద్ద మనసుతో నన్ను క్షమించు!"

"అయ్యో! లే.. లే .. సుశీలా! మనలో మనకు ఇవన్నీ ఎందుకు? వాడేదో అన్నాడని...!"

"మా! చిన్నోడు ఫోన్ చేస్తాండాడు. ఇంద. మాట్లాడు."

"ఆ! చిన్నోడా! నేను బాగానే ఉన్నాను రా. ఆఫీస్ నుండి వచ్చేసినావా? పిల్లకాయలు బాగుండారా?"

"............"

"నేనా? నేను... రావడం లేదురా!"

".............."

"అవును చిన్నోడా! నేను ఇక్కడే ఉంటాను రా! మీ నాయనతో కలిసి కట్టుకున్న ఇల్లు. ఆయనతో కలిసి ఉన్న ఇల్లు. ఆయన ప్రాణం పోయిన ఈ ఇంట్లోనే నా ప్రాణం కూడా పోవాలని నాకుండె ఒకే ఒక ఆశ. నీకు తెలుసు కదా."

"............"

"లేదు చిన్నోడా! ఇక్కడ నాకు ఇప్పుడు ఏ బాధ లేదు. మీ వదిన, అన్న కూడా ఉండమని బలవంతం చేస్తున్నారు."

"............"

"చిన్నోడా! కోపతాపాలు, మనుషులు... ఎల్లకాలము ఒకే మాదిరి ఉండిపోతారా? సరే చిన్నోడా! నాకేదేమన్నా ఇబ్బంది అయితే వచ్చేస్తాలే. చిన్నోడా! నీకు వీలున్నప్పుడు ఫోన్ మాట్లాడతా ఉండు. వీలు లేకపోయినా ఇష్టం లేకపోయినా తప్పకుండా మీరంతా వస్తారు కదా నన్ను కడసారి చూసేదానికి?"

"అయ్యో అవేం మాటలు అమ్మా! చిన్నోడు ఎందుకు రాడు? ఉగాది పండక్కి రమ్మని పిలుస్తా.. ఫోన్ ఇటియ్యి మా!"

బిడ్డలనే ముత్యాలను కూర్చే తల్లి దారం చెమ్మగిల్లుతోంది ఆనందంతో.

■

## భవిష్యత్తు



అదో గుబురు తోట
గుబురు గడ్డంతో గతంలోకి
కలిసి చెప్పుకున్న ఊసుల లోకంలో మోగిన తంతులు
పలవరించిన మేనులు
ధమనులు సిరల్లో రుధిర జలపాతాల కేరింతలు

ఆకాశం గొడుగు కింద రెండు దేహాలు ఒకటిగా
చలిలో జల్లుల్లో ఎండలో తెలియనితనంతో మొదలై
తెల్సుకునే సరికి కాళ్ళకింద భూమిలో చలనం
కాలం గుండ్రటి గడియారం అంకెల దాటి
కళ్ళల్లో దాగుడు మూతలు ఆడుకుంటుంటే
గుండెల్లో అలారం మోగిన క్షణాలు

చేతి వేళ్ళు కలుస్తునప్పుడు
స్పందనలో దేహం పరవశం మనసు నిండా
గుండె లోతుల్లో తడి ఆరదెన్నటికీ
తీయని ఊహల పల్లకీ అది
అలా అలా యాదిలో తేలుతూనే ఊరేగుతుంది
చేతి వేళ్ళు వీడుతున్నపుడు
వేదన కనుపాపల చుట్టూ కేంద్రీకృతమైన ఉప్పెన
ఎప్పుడు పెల్లుబుకుతుందో తెలియని ఆందోళన

తొలి చూపులోన మీటే రాగాలు
ఎదురుచూపుల్లో శ్రుతినందుకుంటూ కొత్త పుంతల్లో మమేకం
ఎలా మొదలౌతుందో మలుపులెలా తీసుకుంటుందో
ముద్రించుకున్న చిరునామా చెరగని జ్ఞాపకం
శిలా శాసనంగా

కాటు వేసే కాలమో వేటు వేసే కులమో
మాటు వేసి మట్టు పెట్టే మతమో
మధుర గీతాల గుండెల్లో
మారణ హోమానికి బీజం వేసేందుకు సర్వ సన్నద్ధంగా

బెదిరింపులు అదిరింపులు
మనసుల విడదీసి మనుషుల కలిపి ఏకం చేసామనే భ్రాంతిలో
నాలుగు గోడల మధ్య మానసిక వ్యభిచార రొంపిలోకి
ఎన్ని గదులో చూడలేక వెలిసి పోతున్నాయి!
ఆరుబయట కలుసుకున్న కళ్ళల్లో తన్మయత్వం
గుండె గదుల్లో ప్రకంపనల హోరు కాంచని
దేహాలు సుడిగుండంలో చిక్కుకుని
చిన్నాభిన్నమై రేపటి తరానికి
అందించాల్సిన అమూల్య సంపదని గదిలో పాతేసి
సమాధిపై జయహో సనాతనం లిఖితం
ఇదో మానసిక దౌర్బల్య సంఘ ఆధిపత్య పైత్యం!

**- గిరి ప్రసాద్ చెలమల్లు**
9493388201

■




# చైతన్య తారకలు నాగావళి నానీలు

- ఎం.పద్మజ

ఇన్నాళ్ళూ ఉద్యోగ సహచరులకు సాహితీ ప్రియుడిగా పరిచయం అయిన సతివాడ రాంబాబు గత కొన్నేళ్ళ సాహితీ వ్యవసాయంలో పండించిన పంటను 'నాగావళి నానీలు' పేరిట ఒక సంకలనంగా తీసుకువచ్చి తనలోని కవిని సమూర్తంగా మన ముందు నిలబెట్టారు. అయిదు వందలకు పైగా నాణ్యత కల నానీలను ఈ పుస్తకంలో అందించారు. ఎక్కువ భావగర్భిత మైన విషయాన్ని కొద్ది పంక్తుల్లో హత్తుకునేలా సూటిగా చెప్పడం నానీల ప్రక్రియ ప్రత్యేకత. ఆ ప్రమాణాలను రాంబాబు నానీలు పూర్తిగా ప్రతిబింబించాయని చెప్పాలి.

రచయిత జీవితానుభవం నుంచి, ఉద్యమ అనుభవాలనుంచి సంతరించుకున్న సామాజిక స్పృహ, అణగారిన వర్గాల పట్ల బాధ్యత, ఆర్థిక, సామాజిక, పర్యావరణ అంశాలపై పెంచుకున్న లోతైన అవగాహన మనకు ఈ నాగావళి నానీలలో కానవస్తుంది. మచ్చుకి ... **"సూర్యుని చుట్టూ భూమి**

**ఆకలి చుట్టూ మనిషి**

**ఎడతెగని ప్రదక్షిణ"** ఈ భూమిమీద ఆకలిలేని ప్రపంచాన్ని నిర్మించడానికే కదా ఉద్యమాలన్నీ జరిగేది.

ఇక **'అందరమూ అమ్మనుండి జన్మిస్తే/ అమ్మకెందుకో నాన్న చిరునామా'** అన్న నానీ నేటి సమాజంలోని పురుషాధిక్యతను ప్రశ్నిస్తోంది.

**"స్త్రీ మూర్తి చేతిలో రెండే రెండు రేఖలు**

**పుట్టినిల్లు, మెట్టినిల్లు**

**రెండూ బాగుండాలి"** అన్న నానీ ఆ స్త్రీమూర్తి చేతిలోనే కుటుంబం యావత్తు బాగోగులూ ఉంటాయని చెప్పకనే చెపుతోంది.

**"పంజరానికి ఎన్ని సొబగులద్దినా**

**చిలుక ఎగరాలనే చూస్తుంది" –** ఇది జీవికి స్వతఃసిద్ధంగా ఉండే స్వాతంత్ర్య ప్రియత్వాన్ని తెలియజేస్తోంది.

**"పిచ్చుక పై బ్రహ్మాస్త్రం**

**పిచ్చుకంటే ఏమిటి నాన్నా ?**

**కొడుకు ప్రశ్న "**

**"చిగుళ్ళు వెతికే కోయిలకి**

**ఆశాభంగం అన్నీ బోన్సాయ్ వృక్షాలే"** వంటి నానీలు సూటిగా మనముందు పర్యావరణ సమస్య తీవ్రతను ఉంచుతున్నాయి. సవాలును స్వీకరించమంటున్నాయి.

**"రక్షణగా ఆయుధాన్ని ఆశ్రయించకు**

**దానికి యజమానెవరో తెలీదు"** అంటూ ఆయుధాలు అంతిమంగా హననానికే గాని రక్షణకు పనికిరావన్న శాంతి సందేశాన్ని విలక్షణంగా ఇచ్చారు.

**"చేతులు రెండే రకాలు**

**జోడించే చేతులు**

**పిడికిలెత్తే చేతులు"** అన్న నానీలో రచయిత ఉద్యమ స్ఫూర్తి కనిపిస్తుంది.

**"నేల మీదున్న చెట్టుకొమ్మల స్వేచ్ఛకై**

**లోపల బందీకృతులైన వేళ్ళు ఎన్నో"** అన్న నానీ సమాజంలో ప్రజలు సుఖ శాంతులతో జీవించాలని తమ జీవితాలను త్యాగం చేసిన, చేస్తున్న వీరులను స్మరించుకుం టుంది. నానీల ప్రక్రియకు ఆద్యుడైన ఆచార్య ఎన్ గోపి, ఆచార్య ముకుంద సుబ్రహ్మణ్య శర్మ, ప్రముఖ రచయిత విహారి వంటి ప్రతిష్ఠుల ప్రశంసలందు కున్నారు రాంబాబు. విశాఖ ప్రియమైన రచయితల సాహిత్య సంక్షేమ సంఘం వారి ప్రచురణగా 'నాగావళి నానీలు' వెలు వడింది. రచయిత మొబైల్ నెం : 89858 54152. రాంబాబు ప్రస్తుతం విశాఖపట్నంలో జీవిత బీమా సంస్థలో బ్రాంచి మేనేజర్‌గా పనిచేస్తున్నారు. ఉద్యోగ బాధ్యతలు చాలా ఎక్కువే. ఐనా తన సాహితీ కృషిని కొనసాగించగలగడం అభినందనీయం. ■



# సోషల్ మీడియా గొంతునొక్కే యత్నం

- ఆకార్ పటేల్

**'మోడీ** పాలనా కాలం మూల్యం ఎంత?' అన్న పేరుతో నేనొక పుస్తకాన్ని ఇటీవలే పూర్తి చేశాను. అది త్వరలో ప్రచురణకు పోనున్నది. 2014 నుంచీ దేశ ఆర్థిక వ్యవస్థలో, జాతీయ భద్రత విషయంలో, పాలనా వ్యవస్థలో, న్యాయ వ్యవస్థలో జరిగిన పరిణామాలను, వాటికి సంబంధించిన వివరాలను అందులో ప్రస్తావించాను. ఆ పుస్తకంలోని వివరాలను నేనిక్కడ చర్చించబోవడంలేదు. ఆ పుస్తకం రాయడానికి సమాచారం ఎక్కడి నుంచి సేకరించానో చెప్పాలనుకుంటున్నాను.

ఆ పుస్తకంలో నేను 85 సార్లు 'ది వైర్' అనే వెబ్‌సైట్ నుంచి, 54 సార్లు 'స్క్రోల్ డాట్ ఇన్' నుంచి ఉటంకించాను. వాటితో పోల్చితే 'టైమ్స్ ఆఫ్ ఇండియా' నుంచి తక్కువగానే (37 సార్లు మాత్రమే) ఉటంకించాను. ఆ పత్రికలో కన్నా ఈ వెబ్ సైట్ల నుండే నాకు కావలసిన సమాచారం ఎక్కువగా లభించడమే ఇందుకు కారణం.

మన సాంప్రదాయ వార్తా పత్రికలతో బాటు 'న్యూస్ క్లిక్‌లి, 'ది న్యూస్ మినిట్', 'ఆల్ట్ న్యూస్' వంటి వెబ్‌సైట్లు కూడా గత దశాబ్దంగా ముఖ్యమైన వార్తా సాధనాలయ్యాయి. వీటిలో ఎక్కువ సైట్లను జర్నలిస్టులు నడుపుతున్నారు. విరాళాలతోను, గ్రాంట్లతోను వాటిని కొనసాగించగలుగుతున్నారు. బడా వ్యాపార సంస్థలు గాని, బడా మీడియా సంస్థలు గాని ఈ వెబ్‌సైట్లకు ఏ విధంగానూ తోడ్పడుతున్నది లేదు. బహుశా ఆ వెబ్‌సైట్లలో వచ్చే కంటెంట్ అందుకే విభిన్నంగా ఉంటుంది. సాంప్రదాయ మీడియా చాలా విషయాలకు కేంద్ర ప్రభుత్వంపై ఆధారపడుతుంది. మోడీ ప్రభుత్వం సంవత్సరానికి రూ.1200 కోట్లు పత్రికల్లో ప్రకటనల కోసం ఖర్చు చేస్తోంది. ఇదికాక కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు ఇంకో రూ.1000 కోట్లు ప్రకటనల కోసం ఖర్చు పెడతాయి. అంటే మీడియాకి నెలకు దాదాపు రూ.200 కోట్లు ప్రభుత్వం ద్వారా లభిస్తుంది. ఇది చాలా ఎక్కువ సొమ్ము. ఊరికే రాదు కదా. ఇది కాక ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు కేటాయించే ప్రకటనల బడ్జెట్లు అదనం.

కేవలం ప్రకటనలే కాదు. టీవీ స్టేషన్లకు లైసెన్సులు మంజూరు చేయడానికి, ఉచితంగా కాని, సబ్సిడీ ధరకు భూమిని పొందడానికి గాని దిగుమతి చేసుకునే యంత్రాలకు, న్యూస్‌ప్రింట్‌కు సుంకాల రద్దు కాని, రాయితీ గాని పొందడానికి ప్రభుత్వంతో వ్యవహరించాల్సి ఉంటుంది. ఇక పెద్ద పెద్ద మీడియా సంస్థలైతే వివిధ సందర్భాల్లో ప్రధానమంత్రిని గాని, ఇతర కేంద్ర మంత్రులను గాని ఆహ్వానించి ఉన్నతస్థాయి సమావేశాలు నిర్వహిస్తారు (అటువంటి సమావేశాలకు బడా కార్పొరేట్ల నుంచి 'స్పాన్సర్‌షిప్' లభిస్తుంది). ఒకవేళ ప్రధాని గాని, ఇతర మంత్రులు కాని ఒకానొక పత్రిక పతాక శీర్షికలో వచ్చిన వార్త పట్ల తమ అసంతృప్తిని వ్యక్తం చేశారనుకోండి. అప్పుడు అటువంటి సమావేశాలకు హాజరు కావడానికి తిరస్కరించే ప్రమాదం ఉంటుంది. అప్పుడు స్పాన్సర్ చేసే సంస్థలు తమ పెట్టుబడికి పూర్తి ప్రతిఫలం రాలేదని పెదవి విరుస్తాయి. ఇన్ని రకాల కారణాల వల్ల సాంప్రదాయ మీడియా ప్రభుత్వ వ్యతిరేకతను కొని తెచ్చుకోవడానికి సిద్ధపడదు. అటువంటి ఒత్తిడి ఏదీ వెబ్‌సైట్ల మీద ఉండదు.

అందుకే మోడీ ప్రభుత్వం కొత్తగా ఐటి నిబంధనలను జారీ చేసింది (ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (మధ్యంతర మార్గదర్శకాలు,

డిజిటల్ మీడియా నైతిక ధర్మాలు) నిబంధనలు, 2021). ఎటువంటి చట్టమూ చేయకుండానే టీవీల విషయంలో సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ నియంత్రణ చేపట్టిందో, అదే విధంగా ఇప్పుడు ఇంటర్నెట్ విషయంలో, ఆఖరికి మెసేజీలను కూడా నియంత్రిస్తూ అదుపు చేయడానికి పూనుకుంది.

ఈ నిబంధనలు ప్రింట్ మీడియాకు చెందిన ఇ–పేపర్లకు వర్తించవు. కేవలం 'వైర్, స్క్రోల్, న్యూస్ క్లిక్' వంటి వెబ్‌సైట్లకు మాత్రం వర్తిస్తాయి. బడా ప్రింట్ మీడియాకు చెందిన ఇ-పేపర్ రూపంలోని వెబ్‌సైట్లకు నిబంధనలు వర్తించవు. అంటే తమకు లోబడి ఉండే వెబ్ సైట్లను మినహాయించింది ప్రభుత్వం.

ఈ నిబంధనలు సాధారణ పౌరులను కూడా నియంత్రిస్తున్నాయి. వాట్సాప్, సిగల్, టెలిగ్రాం వంటి యాప్‌ల నిర్వాహకులు అందులో పెట్టిన మెసేజ్ గాని, ఫోటో గాని, కార్టూన్ గాని ఎవరి నుంచి మొదట వచ్చిందో నిర్ధారించవలసి ఉంటుంది. అంటే ఒకరి నుంచి ఇంకొకరికి మాత్రమే చేరేలా పంపే సమాచారం ఇక ముందు గోప్యంగా ఉండజాలదు. ఎప్పుడైతే గోప్యత ఉండదో, ఆ సమాచారం ఎవరెవరికి ఫార్వర్డ్ చేయబడుతోందో నియంత్రించే వీలు కూడా ఉండదు.

వెబ్‌సైట్లలో వచ్చే కంటెంట్‌ను ప్రభుత్వ యంత్రాంగం పర్యవేక్షించడానికి ఈ నిబంధనలు వీలు కల్పిస్తున్నాయి. అంటే ఇదొక సెన్సార్‌షిప్ వంటిదే. ప్రభుత్వం కావాలనుకుంటే ఒకానొక సమాచారాన్ని కాని, మొత్తం వెబ్ సైట్‌ను కాని నిలిపివేయవచ్చు. దాంతో ప్రముఖ యాప్‌లన్నీ తమకు తామే స్వీయ నియంత్రణ చేయడం ప్రారంభిస్తున్నాయి. అందువల్ల మనం ఆ యాప్‌ల ద్వారా పంపదలచుకున్న మెసేజీలు మనం చేరాలనుకున్న చోట్లకు చేరకపోవచ్చు. మొత్తం మీద ప్రభుత్వం తాను కోరుకున్న విధంగానే సమాచారం ప్రజలకు పోయేటట్టు, తనకు ఇబ్బందికరమైన విషయాలు, అవి వాస్తవం అయినా సరే, ప్రసారం కాకుండా ఉండేటట్టు చేయడానికే ఈ రూల్స్ ఉపయోగపడతాయి.

ఈ పరిణామాలు మన దేశానికి మంచివి కావు. ఈ ప్రభుత్వం అత్యంత శక్తివంతంగా ఉంది. ప్రధాని ఎక్కువ పలుకుబడి కలిగివున్నాడు. ఈ మతవిద్వేష నియంతృత్వాన్ని ఎదిరించి పోరాడవల్సిన ప్రతిపక్షాలకు ఇంకా పట్టు చిక్కడం లేదు. ఇటువంటి సమయంలో ఈ దేశంలో ఏం జరుగుతోందో ప్రజలకు నిర్భయంగా చెప్పగలిగే స్వతంత్ర మీడియా చాలా అవసరం. అటువంటి మీడియా ఉనికిలో లేకుండా చేయడానికే ప్రభుత్వం అన్ని విధాలా ప్రయత్నిస్తోంది. 'ప్రపంచ పత్రికా స్వేచ్ఛ సూచిక' (వరల్డ్ ప్రెస్ ఫ్రీడమ్ ఇండెక్స్)లో గత ఏడాది మన దేశం 142వ స్థానంలో ఉంది. 2021కి సంబంధించి వచ్చే నెలలో వెలువడనున్న ఆ సూచికలో ఇంకెక్కడ ఉంటామో ఊహించండి!

**(వ్యాసకర్త 'ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ ఇండియా'కు గతంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా వ్యవహరించారు)** ■

## కొంచెం ధైర్యం కావాలి!

**తో**డేళ్ళు గుంట నక్కలు
తిరుగాడుతున్న లోకంలో
మంచైనా చెడైనా
ఉన్నదున్నట్లు మాట్లాడటానికి
కొంచెం ధైర్యం కావాలి
కాస్తంత నిజాయితీ కావాలి

ఏ పాము కాటేస్తుందో
ఏ నిచ్చెన పైకెక్కిస్తుందో తెలియని
వైకుంఠ పాళి ఆటలో ఉన్నాం
ఏ స్థితిలోను ధైర్యం బీటలు వారకూడదు

ధైర్యంగా ఉండటమంటే
ప్రలోభాల పట్టు తేనె కోసం గుటకలు మింగకుండా
అవకాశవాద గాలివాటానికి కొట్టుకుపోకుండా
ప్రవాహానికి తలవంచే రెల్లులా కాకుండా
నిజాయితీగా, నిర్భయంగా నిటారుగా నిలబడటం!

ఈ వేళ నీ భయాన్ని
నీవు జయించక తప్పదు
నీ వీపుని నీవే తట్టుకుని
ఉన్నదున్నట్లు మాట్లాడటానికి
కొంచెం ధైర్యం అరువు తెచ్చుకో
కాస్తంత నిజాయితీ తోడు తెచ్చుకో!

**- నూతలపాటి వెంకట రత్న శర్మ**
**98663 76050**

# ప్రజాస్వాహాయం

- డాక్టర్ వి.పళని
99123 43804



కోతలకు కాలమంతా చాచే మెడలు
వాతలకు చేసే అదృశ్య తాండవాలు
పడి లేచే ప్రెజర్ కుక్కర్ విజిళ్ళు
ఎగిరే పక్షుల స్వేచ్ఛ
ఊహల్లో ఆస్వాదించే ఇచ్ఛ
ఎండమావి నీటికై చాచే అర్రులు
కమ్మేస్తున్న కంప్యూటర్లు
వెక్కేస్తున్న టైపు మిషన్లు
కాలం తీరుకు ఖాళీ అవుతున్న కంచాలు

మాయమవుతున్న ఊళ్ళు
పొయ్యెక్కని పెనాలు
చిన్నబోతున్న మౌనాలు
మారే ట్రెండుకు కలిగే భయాలు
అప్పుల వాకిట్లో సాగిల పడే అభిమానాలు
కాల్‌మనీ కాటుకు నురగలు కక్కే బింకాలు
రెండు పుల్లలు పెట్టిన కళ్ళు
బహుళ జాతి చూపులకు కమ్మే బైర్లు
గుంభనంగా అనుభవించే వ్యథలు!

బరువుగా నడిచే బెల్ట్ కుక్కలు
ఈర్ష్యతో చూసే చూపులు
ప్రతి కుక్కకు ఒకరోజుందనే ఉస్సురుస్సులు
నీతులు చెప్పిన విద్యా వైద్యాలు
నడిపించే నడమంత్రపు సేద్యాలు

అందీ అందక చచ్చే చావులు
తక్కెట్లో తేలిపోయే దంట్లు
యుద్ధంలో ముందుండే బంట్లు
విల్లు లేని వీరులు

మేనిఫెస్టోలను నమ్మి చేసే పూజలు
నమ్మకాన్ని రివాజుగా అమ్మేసే రోదనలు
పాత విటుడికే కొత్తగా...
వెల కట్టిన వేశ్యలు

# కొండెక్కిన దీపాలు!

ప్రాణం మీది తీపితో బతుకు మీద ఆశతో
ఆసుపత్రిలో చేరితే
వైద్యాలయాల్లోనే కాలి బూడిదైపోతుంటే
ఏం మిగిలిందని
సంప్రదాయ అంతిమ సంస్కారం చేస్తాం?
ప్రాణం వైద్య నారాయణుల సమక్షంలో ఉంది కదా..
ఎప్పటికైనా
ఆనందంగా సొంతగూటికి వెళతామనే భరోసాతో
ఎదురుచూసే రోగుల
ఉసురు కళ్ళముందే గాల్లో కలిసిపోతుంటే..

ప్రాణం నిలపాల్సిన ప్రాణవాయువే
ప్రాణాలను తోడేస్తోందన్న.. అయోమయ స్థితిలో
కొండెక్కిన దీపాలను చూస్తూ
గదులన్నీ దట్టమైన ధూపం అలముకొని
నిత్యం దహనాలు జరిగే
శ్మశానాన్ని తలపిస్తున్న వైద్యాలయంలో
అయిన వారి అస్థికలు కూడా పోల్చుకోలేని దుస్థితిలో
ఏం మిగిలిందని..
అంతిమ సంస్కారం చేస్తాం!

- సుజాత.పి.వి.ఎల్.
77801 53709

## కవిత

# శ్మశానాల ప్రయివేటీకరణకు టెండరు ప్రకటన

- రత్నాల బాలకృష్ణ
94401 43488



గ్రామ, నగర సంస్థలచే నిర్వహించబడుతున్న
శ్మశానాలన్నింటినీ జాతీయం చేసి
కార్పొరేటు సంస్థలకు అప్పగించుటకు
టెండరు ప్రకటన చేయడమైనది!

ముఖ్యంగా నగర శ్మశానాలన్నింటిని
అనుసంధానం చేస్తూ
గ్రీన్‌ఫీల్డ్ హైవేలు, ఎక్స్‌ప్రెస్ హైవేలు నిర్మించి
మౌలిక వసతులు కల్పించబడును

టెండరుదారుల పేరు **'A'** లెటర్‌తో
మొదలైనవారికి ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వబడును
మరీ ముఖ్యంగా గుజరాత్ రాష్ట్రం వారికి
అధిక ప్రాధాన్యత ఇవ్వబడును

శవాలను కాల్చడానికి బొగ్గు, కలప
సరిపడనంత నిల్వలు లేకపోయినచో
డినోటిఫైడ్ చేయబడిన అడవులు
బొగ్గు గనులు కేటాయించబడును
అప్పటికీ బొగ్గు చాలకపోయినచో
కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న
స్టీల్‌ప్లాంటులను మూసివేసి
వాటి బొగ్గు గనులను ప్రత్యేక ప్రయారిటీగా
శ్మశానాలకు కేటాయించబడును!

శ్మశానాల నిర్వహణలో
అనుభవం లేకపోయినా ఫర్వాలేదు
విదేశీ కంపెనీలతో భాగస్వామ్య ఒప్పందాలు
చేసుకొని వచ్చినవారికి అదనపు ప్రాధాన్యత ఇవ్వబడును
అనుభవం కలిగిన కాటికాపర్లు లేకపోయిననూ ఫర్వాలేదు
విశ్వవిద్యాలయాల్లో ప్రత్యేక కోర్సులు పెట్టి
శవాలు కాల్చడంలో స్పెషల్ ట్రైనింగ్ ఇచ్చి
నిపుణులైన కాటికాపరులను తయారుచేసి అందించబడును
వారికి రిజర్వేషన్లు కూడా వర్తించబడవు!

శ్మశానాలకు సరిపడా శవాలు దొరకనపుడు
నగరాలకు సమీపంలో కోల్డ్ స్టోరేజీలు నిర్మించి
ఇవ్వబడును
తమంతట తాముగా మరణించడానికి తగ్గట్లుగా
రైతులు, కార్మికులు, ఉద్యోగుల చట్టాల్లో
తగిన మార్పులు తెచ్చి ఉద్యమబాట పట్టించి
శవాల కొరత లేకుండా తగిన పార్లమెంటరీ స్థాయి
చట్టాలు తయారు చేయబడును!

వీటి నిర్వహణలో దివాలా తీసినా
విదేశాల్లో విలాసవంతమైన
జీవితాన్ని గడపడానికి ప్రత్యేకమైన విల్లాలు, బంగ్లాలు
నిర్మించి జీవితకాలం విమానాల్లో
ఉచితంగా ప్రయాణ సౌర్యాలు కల్పించి
ప్రత్యేక తరగతి వ్యక్తులుగా తగిన గుర్తింపు ఇవ్వబడును

మీకు కావల్సిన ఇతర రాయితీలకే
ప్రత్యేక పార్లమెంటు సమావేశాలు ఏర్పాటు చేసి
దివాలా చూపించిన ప్రత్యేక కార్పొరేట్ సంస్థలకు
లక్షల కోట్ల రుణమాఫీ సౌకర్యం కూడా కల్పించబడును! ■



# మలయాళ సమాజం రచయితలకు గౌరవం

పాల్ జకారియా

రచయితలంటే – ఏమీ లేనివారు, సతాయించబడేవారు, నిర్లక్ష్యానికి గురయ్యే వారు – సమాజంలో వున్న మూస భావన నేడు కేరళలో కానరాదు. 20వ శతాబ్దపు మొదటి అర్ధభాగంలో క్రమమైన ఉపాధి పొందే రచయితలు తక్కువగా ఉండేవారు. రచనల ద్వారా వారికి వచ్చే ఆదాయం రోజువారీ అవసరాలకు మాత్రమే సరిపోయేది. నేటి రచయితల్లో ఎక్కువ భాగం వేరే ఉద్యోగాలు చేస్తూ (పూర్తికాల ఉద్యోగులుగా పనిచేస్తూ) పాక్షిక కాల రచయితలుగా ఉన్నారు. వీరిలో ఎక్కువమంది మధ్య తరగతి, ఎగువ మధ్య తరగతి వర్గానికి చెంది పెన్షన్ వంటి రక్షణలను కలిగి ఉన్నారు. నేడు రచనల ద్వారానే సౌకర్యవంతమైన జీవితాన్ని గడపాలంటే అధిక మొత్తంలో నాణ్యమైన, ఆమోదయోగ్యమైన రచనలను చేయగలిగి ఉండాలి. రచనల మీద మాత్రమే ఆధారపడి జీవించే చాలామంది రచయితలు ఆర్థికంగా ఇబ్బంది పడుతూ వేలమంది ఇతర పౌరులలాగానే జీవనోపాధి పరుగులో అసహాయంగా పోటీ పడుతున్నారు. రచయిత వ్యక్తిగతంగా వీటిలో ఏదో ఒక విభాగానికి చెంది ఉంటారు.

విశాలమైన భారతీయ సాహితీ ముఖచిత్రాన్ని పరిశీలించినట్లయితే ఇతర భారతీయ భాషా రచయితలు (ఇంగ్లీషులో రచనలు చేసేవారితో సహా) అందరికంటే మలయాళీ రచయితలు ఆదరణ కలిగిన, విశిష్ట రచయితలుగా రూపొందారు. భారతీయ ఇంగ్లీష్ రచయితలు విదేశాల్లోనూ, దేశంలోనూ కీర్తి గడిచినప్పటికీ కేరళలోనూ, మలయాళీలలోనూ మలయాళీ రచయితలు పొందినంత ఆదరణ, ఆమోదం, గుర్తింపు పొందలేకపోయారు. మలయాళీ రచయితలు కుల, మత, రాజకీయ అడ్డంకులను అధిగమించి గౌరవాన్ని, ప్రేమను పొందగలిగారు. మూడు మతాల ప్రజల శాంతియుత సహజీవనం కేరళ ప్రత్యేకత. ఇటీవల దీనిపై పెద్ద దాడి జరిగి, ఈ ఆలోచన సాహిత్యం పట్ల సామాజిక దఅక్పథానికి కూడా విస్తరించిందనటంలో అతిశయోక్తి లేదు. కులం విషయంలో కూడా అదే జరిగింది. ఇది ప్రజల హఅదయాలను కలుషితం చేసింది. కాగా దుర్మార్గమైన వదంతులను వ్యాపింపచేయడమే ఈ కుల నాయకులనబడే వారి ప్రత్యేకత. సాహిత్యంలో కూడా కుట్రలు, కుహకాలు ఉన్నప్పటికీ చివరికి వీటన్నింటికంటే సంఘటిత, లౌకిక, ప్రజాస్వామిక విలువల ఆధారిత ఏకీభావనే నిలుస్తున్నది.

బహుశా మలయాళీ సాహిత్యాన్ని వారి సమాజంలో ప్రముఖ స్థానంలో నిలపటంలో మలయాళీల సఫలతకు వారి సంస్కృతి ఒక ఆసక్తికరమైన కొలమానంగా నిలుస్తుంది. కానీ అలా చూడబడటం లేదు. కచ్చితంగా విద్య, సార్వజనీన అక్షరాస్యత దీనికి కారణం. బహుశా కేరళలో 10వ తరగతి వరకు స్కూల్ సిలబస్‌లో భాషకు, సాహిత్యానికి ప్రాధాన్యత ఇవ్వడం కూడా మరొక ముఖ్య విషయం కావొచ్చు. ఒకసారి తరగతి గది దాటితే కెమిస్ట్రీ లేక కామర్స్ మన మెదడులో పీఠం వేయకపోవచ్చు కానీ సాహిత్యం మాత్రం మెదులుతూనే ఉంటుంది. ఎందుకంటే అది గుర్తుంచుకోగల కథనాలను అల్లుతుంది. 1821లో వ్యాపార ప్రచురణలు మొదలైనప్పటినుంచి చదివే అలవాటు అంతర్భాగమైన సమాజంలో అది అలానే ముందుకు ప్రయాణిస్తూ రచయితలను, సాహిత్యాన్ని ఉల్లాసంగా నిలిపి ఉంచింది.

మలయాళీలు, వారి రచయితల మధ్య ఉన్న ప్రత్యేక సంబంధానికి మూలాలు చారిత్రక సంఘటనైన కేరళ పునరుజ్జీవనోద్యమం, సామాజిక, రాజకీయ, సాంస్కృతిక అంశాలపై అది చూపిన ప్రభావంలో ఉన్నాయి. క్రిస్టియన్ మిషనరీస్ ప్రాంతీయ పాలకులు, బ్రిటిష్ వలసవాద పాలకుల సహాయంతో ఆధునిక విద్యకోసం చేసిన ప్రయత్నం వల్ల సమాజంలో వచ్చిన వేగవంతమైన మార్పును ఆధ్యాత్మిక సంస్కర్త నారాయణ గురు, దళిత విమోచన నేత అయ్యంకాళి లాంటివారు కొనసాగించారు. ఈ మార్పు స్వాతంత్రోద్యమంతో బలపడి తదుపరి కమ్యూనిస్టు భావజాలంతో ప్రగతిశీల, విప్లవాత్మక రూపాన్ని సంతరించుకుంది. సమాజంలో వేళ్లూనుతూ (అభికేంద్ర బలంగా) ఉన్న ఈ మార్పుకు లౌకిక జ్ఞాన విస్ఫోటనం, దానిననుసరించి జరిగిన వరుస సాంఘిక, సాంస్కృతిక జాగఅతి మరింత బలాన్ని చేకూర్చి ఆధునిక కేరళ సంస్థాపనకు దోహదపడింది. ఈ మార్పులో భాగంగా ఉన్న రచయితలు తమ సృజనాత్మకతతోనే కాక, భూస్వామ్య సమాజ వ్యవస్థను ఎదుర్కోవడంలో ముందుపీఠిన ఉండటంతో ప్రజల మదిలో వారు స్థానం సంపాదించుకో గలిగారు. విద్య, సామాజిక మార్పు రెండూ కలిసి సమాజంలోని అన్ని తరగతుల్లో తాము నివసిస్తున్న సమాజం గురించి ఉత్సుకత కలిగి, అధ్యనం చేసి, సాహితీ మధురిమలు ఆస్వాదించే అన్ని రకాల చదువరులను ఉత్పన్నం చేశాయి.

1950లో కొట్టాయం సాహిత్య ప్రవర్ధక సహకరణ సంఘం ద్వారా ప్రపంచంలో మొదటి రచయితల సహకార సంఘం సాహితీ విఫణిని విస్తరించింది. ప్రాచుర్యం పొందిన రచయితలను ప్రముఖులుగా ప్రతిష్ట పొందిన రాజకీయ నాయకులు, సినీ హీరోలకు దీటైన, ఆకర్షణీయమైన స్థానంలో ప్రతిష్టింపచేసే విధంగా ఇది మీడియాను ప్రభావితం చేసింది. వైకోమ్ ముహమ్మద్ బషీర్, తకజి, శివశంకర పిళ్ళై, ఓ.వి.విజయన్, కమలాదాస్, సమకాలీన సాహితీ దిగ్గజం ఎం.టి. వాసుదేవన్ లాంటి వారు బహుశా ఆ తొలి తరపు ప్రముఖులు.

ఆసక్తి, ప్రశంస, చిన్న – పెద్ద, సంబద్ధ – అసంబద్ధమైన అనేక చర్యలు – రచయితల పట్ల సమాజంలో ఉన్న గౌరవాన్ని తెలియచేస్తాయి. చిన్నవే అయినా కొన్ని పారదర్శక మర్యాదలు పాటించటం రోజువారీ జీవితంలో భాగం. చిరునవ్వు, నమస్కారం, కొత్తవారిని కలిసినప్పుడు 'మిమ్మల్ని కలవటం సంతోషంగా వుంది' అని చెప్పటం లాంటివి. కిక్కిరిసిన రైలులో టికెట్ ఎగ్జామినర్ పిలుపు, 'ఎలా వున్నారు?' అనే బుకింగ్ క్లర్క్ పలకరింపు, ఊహించని విధంగా దారిన పోయేవారు అందించే ఆపన్న హస్తం, 'మీరు ఫలానావారు కదా, అవునా?' అనే పలకరింపులు సంక్షిప్తంగా, ఆహ్లాదంగా ఉంటాయి కదా? పోలీసు మాన్ చిరునవ్వు, 'నేను మీ పాఠకుడను' అనే ఆటో రిక్షా డ్రైవర్, ఒక కూలీ వీపుపై పెద్ద లగేజీని మోసుకెళ్తూ ఆగి 'రచనను తాను ఏవిధంగా ఆస్వాదించాడో' చెప్పినప్పుడు ఆనందమే కదా! మరీ ముఖ్యంగా అచేతనమైన, వాస్తవ ప్రపంచానికి అతీతంగా ఉండే ప్రభుత్వ ఆఫీసులో రచయితలకు లభించే స్పందన అద్వితీయం. హాస్యాస్పదమైన విషయమేమంటే చదువరులు ఎక్కువగా ఉండే ప్రదేశం అదే!

నైతిక నిఘా కపటదారులైన కేరళలోని ప్రధాన స్రవంతి సనాతనవాదులు, అందులో ప్రముఖ పాత్ర వహించే మీడియా రచయితల పట్ల సానుకూల దఅక్పథం చూపించడం గమనించదగిన మరొక దఅగ్విషయం. సాధారణంగా తమ అపరాధాలను సమర్ధించే రచయితల పట్ల మాత్రమే వారు ఇలాంటి సానుకూలతను లేక ఓర్పును ప్రదర్శిస్తున్నారు. రచయితల పట్ల గౌరవం విస్తృతంగా ఉంది. అనన్యమైన సాహితీ బహుమతులు, సాహితీ సభల వద్ద అత్యంత శ్రద్ధతో రచయితల ఉపన్యాసాలను ఆలకించే శ్రోతలు, ప్రపంచవ్యాపితంగా ఉన్న మలయాళీల నుంచి రచయితలకు అశేషమైన ఆహ్వానాలు, నిత్యం తాము ఎదుర్కొనే సమస్యలపై రచయితలు తమ అభిప్రాయాలు చెప్పాలని ప్రజలు కోరటం లాంటివి రచయితల పట్ల ఉన్న సద్భావనను తెలియచేస్తాయి.

ఈ సద్భావన కథా పరంపరకు బాధాకరమైన ముగింపును – మీడియాలో పతాక సన్నివేశాన్ని తలపించే సంస్మరణ ప్రకటనలు, క్షమించ వీలులేని పడికట్టు పదాలతో నిండిన, మిడిమిడి జ్ఞానంతో కూడిన బూటకపు పొగడ్తలు, ప్రముఖుల సందర్శనలు, కన్నీటి వీడ్కోలు, శవపేటికలో స్పష్టంగా కనిపించే దేహం, మండుతున్న చితి లాంటి – మాత్రం రచయిత ఎన్నటికీ చూడలేదు. ఇవన్నీ కొన్ని వివరాలు మాత్రమే! అంతిమ విశ్లేషణలో దేవుడి సొంత భూమిగా భావించే కేరళలో మలయాళ రచయిత అందమైన స్థానాన్ని పొందటం – లౌకిక విచక్షణతో కూడిన చదువరుల, వనరులు కల ప్రచురణకర్తల, సాహసవంతులైన పుస్తక విక్రేతల సమాహారంతో, అనుసంధానించబడిన గ్రంథాలయ వ్యవస్థతో కూడిన విశిష్ట సమాజం యొక్క ఉదార బహుమానం తప్ప వేరు కాదు.

**(ఏప్రిల్ 7న ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌లో వచ్చిన వ్యాసానికి పోపూరి అనంతలక్ష్మి గారి అనువాదం ఇది.)**

■



# తల్లివంటేనువ్వు..!

తెలుగు అనువాదం : **పి.శ్రీనివాస్ గౌడ్**
99494 29449

**అ**తను తన తల్లిని పూడ్చిన చోట
మోకాళ్ల మీద వంగి కూచొని
ఆ ప్రదేశాన్ని ఆరాధిస్తూ
తల వంచి అక్కడ మొలిచిన
ఒక పేరులేని
తెల్లటిపువ్వుని ముద్దాడాడు!

నువ్వు నా తల్లివమ్మా..
నీ గర్భంలో నవమాసాలు మోసి
నన్నీ లోకంలోకి తెచ్చావు
అంతులేని బాధలు పడి
నన్ను పెంచావు
ఆకలితో ఏడ్చినపుడు
గెనిసగెడ్డల ఆకులు ఉడికించి
కొబ్బరితో కలిపి ఉప్పు జల్లి
నాకు తినిపించావు
పొద్దునే లేచి
బారులో చిరుతిళ్లు అమ్మి
వచ్చే లేశపాటి లాభంతో
నా బట్టలు కుట్టించావు

తలకు నూనెబెట్టి
మెడ చుట్టూ 'పంచాయుధ'ని వేలాడేసి
చేయి పట్టుకొని
నన్ను బడికి తీసుకెళ్లేదానివి

ముళ్లపొదలు దుబ్బల వెంట తిరిగి
ఏరుకొచ్చిన వాటికి రంగులేసి
రకరకాల వైనాలుగా చాపలు అల్లి
ఈ విశ్వానికొక క్రమం వుందని
బాల్యంలోనే నేర్పించావు!

నీ దేహమొక అద్దంలా
నా మనసుని ఇప్పుడు
అద్దం పడుతుందని

అమ్మా.. నాకు తెలీదు


నీ కుంగిన కళ్లలో
సంతోషాన్ని గానీ, దుఃఖాన్ని గానీ
ఎన్నడూ నేను చూడలేదు

సుఖదుఃఖాలకు వెరవకుండా
నీ మనసుకి ప్రశాంతత పొందావా..?

డబ్బూ, పేరు, భవంతులు, కార్లు
ఎన్నో సంపాదించాను
కానీ వాటి ద్వారా నేను
మనశ్శాంతి పొందలేక పోయాను

అలాంటివి
నీకేం లేకపోయినా
నువ్వెప్పుడో
ఈ సత్యాన్ని గ్రహించావు కదూ..!

**– సింహళీ : మహాగమి శేఖర , శ్రీలంక కవి**
**ఆంగ్లం : మహింద పథిరన**




# 'మాట'కు పట్టం కట్టిన దీర్ఘకవిత

- వై.హెచ్.కె.మోహన్‌రావు
94401 54114

**స్వా**మి వివేకానంద అమెరికాలోని చికాగో నగరంలో జరిగిన విశ్వమత సమ్మేళనంలో రెండే రెండు మాటలతో కాలం కనురెప్పలను కదిలించారు. అప్పటివరకూ నడుస్తున్న ఒక సుషుప్తి లాంటి అవస్థ నుంచి మానవ వ్యవస్థను జాగృతం చేశారు. తన రెండు పదాలతో జగత్తునంతా వసుధైక కుటుంబంగా ఆవిష్కరించారు. ఒక సార్వజనీనమైన భావాన్ని వ్యక్తం చేశారు. నరేంద్రుని భూమిని చుట్టిన ప్రసంగనేతగా నిలబెట్టిన ఆ రెండు మాటలు ఆనాటి పృథివిలోని పత్రికలన్నిటికీ పతాక సన్నివేశాలయ్యాయి. రెండు నిమిషాల అవకాశాన్ని కల్పించానికే తటపటాయించిన ఆనాటి సభల నిర్వాహకులను ఆ రెండు మాటలే మహాసభలు జరిగిన అన్ని రోజులూ ప్రసంగ పాఠాలు వినిపించమని వివేకాను ప్రాధేయపడే దిశగా నడిపించాయి. అదీ మాట విలువ. మాటే ఒక కలువ. మాట విలువ ఎరిగినవారు చిన్ని నారాయణ రావు. మాటకు విలువల వలువ తొడిగినవారు ఆయన.

వచన కవిత్వ తీరుతెన్నులు గమనించినప్పుడు సాధారణంగా కవులు ఏదో ఇరవై నుంచి ముప్పయి, ఘనంగా ఒక యాభై వరుసలతో కవితను ముగించడం ఆనవాయితీ. దీనికీ బోలెడు ప్రసవ వేదన తప్పదు. ఈ స్థితిపైనే అనేక నానుడులు వచ్చాయి. ప్రారంభం పురిటి నొప్పులనీ, ముగింపు మరణ యాతననీ, ఇంకా నొప్పులతోనే ఉందా, నెలలు నిండలేదా! ఇంకా శిశువు బయట పడలేదా అంటూ చమత్కారాలు పేలుతుంటాయి. అటువంటి పరిస్థితులన్నింటినీ అధిగమించి నారాయణరావు ఏకంగా అరవై ఒక్క పుటల దీర్ఘకవితను సృజించారు. బహుశా ఆయన ఈ దీర్ఘ కవితను అలవోకగా రచించినట్లు అనిపిస్తుంది.

దీర్ఘకవిత రాయడం అంత వీజీ కాదు. ఒక సాహసం. అరుదుగా ఉంటారు ఈ ప్రక్రియను ఎంచుకునే కవులు. ఇరవై ముప్పయి వరుసల కవితకు వస్తువే విస్తృత పరిధిలో ఉండే విధంగా ఎంచుకుంటారు ఎవరైనా. అటువంటిది చిన్ని నారాయణరావు 'మాట' అనే ఒక పదాన్ని భూమికగా ఎంచుకుని ఇంత పెద్ద దీర్ఘ కవిత అల్లడం ఒక అద్భుతం. ఈ దీర్ఘ కవితను చిన్ని వారి పెద్ద కవితగా పేర్కొనవచ్చు.

ఈ కవన కదనంలో ఆయన మాట విశిష్టతనూ, ఔన్నత్యాన్నీ, వైదుష్యాన్నీ, విస్తృతినీ, వైశాల్యాన్నీ, మెత్తదనాన్నీ, మెతక వైఖరినీ, కరుకుదనాన్నీ, రక్షా, కక్షా వైనాలను బహు ముఖాలుగా విపులీకరించారు. మనిషిని నిలబెట్టేది పడగొట్టేదీ, అందలాన్ని ఎక్కించేది, అథఃపాతాళానికి నెట్టివేసేదే మాటేనంటూ ఆయన దాని విశ్వరూపాన్ని కళ్ళకు గట్టారు. మాటే మంచి చెడులను నిర్ణయిస్తుందనీ, అక్కున చేర్చేదీ, ఆవలకు విసిరేదీ కూడా

మాటేనంటూ పలు విధాలుగా మాట స్వభావాన్ని చిత్రీకరించారు. మనిషికీ మనిషికీ మధ్యన వారధి మాట అంటారు.

అందుకే ఈ 'మాట' దీర్ఘ కావ్యాన్ని ఆవిష్కరించిన భారత ఉప రాష్ట్రపతి 'మానవ జీవితంలో మాటకున్న ప్రాధాన్యతను తెలియజేస్తూ, అనుభవాల సమాహారంగా తీర్చిదిద్దినది ఈ పుస్తకం' అంటారు. 'మన మాటే మన వెంట నడిచే నిజమైన మిత్రుడు' అని ప్రకటించారు. అంత విశిష్టత సంతరించు కోవడం మూలంగానే ఈ తెలుగు దీర్ఘకవితా కావ్యం 'ది వర్డ్' శీర్షికతో ఇంగ్లీషులోకి అనువాదం అయింది. మనిషి జీవితంలో మాట ఎంతటి కీలకపాత్ర పోషిస్తుందో నారాయణరావు ఆవిష్కరించారంటూ కూడా వెంకయ్య నాయుడు కితాబిచ్చారు.

సమకాలీన సాహితీ లోకానికి బ్రాండ్ అంబాసిడర్ అయిన సుప్రసిద్ధ కవి కె.శివారెడ్డి వ్యాఖ్యానిస్తూ "నాకు తెలిసినంతవరకు 'మాట' మీద దీర్ఘకవిత గాని లేదా అటువంటి కావ్యం గాని ఎవరూ రాయలేదు. బహూశా ప్రపంచంలోని కవులు గాని, ఏ భాషలో గాని 'మాట' మీద ఒకటి రెండు కవితలు రాసిన సందర్భం ఉండొచ్చు గాని ఇలా దీర్ఘ కావ్యం రాసిన వాళ్ళు లేరు" అంటూ చిన్ని నారాయణ రావుపై ప్రశంసల జల్లు కురిపించారు.

తెలుగు కవిత్వంలో 'మాట' అనే అంశంపై దీర్ఘ కవిత మొదటిసారిగా రాసిన వారు చిన్ని నారాయణరావే.. అన్నమాట ఆయన రాసిన 'మాట' దీర్ఘ కవిత ద్వారా తెలుస్తుందని సుప్రసిద్ధకవి కీ.శే.డా॥ అద్దేపల్లి రామమోహనరావు నారాయణ రావును అభినందించారు. ఇంకా ఈ కావ్యంలో నారాయణరావు మాట ప్రాశస్త్యాన్ని వివరిస్తూ జనశ్రేణులను దరిచేర్చేదీ, ఒంటరిని చేసేది కూడా మాటేనంటూ వెల్లడిస్తారు. ఇందుకుగాను 'చిన్ని' వారు కవితాధోరణిలోనే అనేక ఉదాహరణలూ, ప్రమాణాలూ ధృవీకరించారు. ఇతిహాసాలూ, చరిత్ర, సమకాలీన విషయాలను అనేకం ఆయన మద్దతుగా నిలిపారు. మంత్రమై మాట ఓదార్పు నిస్తుందంటారు. జీవితాలను నిలబెడుతుందనీ, ఆత్మహత్యల సైతం నివారిస్తుందనే చాటుతారు.

ఎలాంటి పెట్టుబడులూ లేకుండా కేవలం మాటలతోనే నడిచే వృత్తులున్నాయి. ముఖ్యంగా ఏజెంటు ఏ రంగమైనా ఇందుకు మినహాయింపు కాదు. న్యాయవాద వృత్తి మొత్తంగా మాటపై ఆధారపడి నడిచే వృత్తి. అదే విధంగా విద్యారంగం. అలాగే రాజకీయాలు. ఇలా చెప్పుకుంటూ పోతే అనేకం. మంచి వక్త ఉత్తమ రాజకీయ నాయకునిగా రాణిస్తాడనేది నిర్వివాద అంశం. ప్రజాస్వామ్య నేటి వ్యవస్థను మాటే పరిపాలిస్తుందనేది సత్యం.

'మాట' గురించి 'చిన్ని' గారి మనస్సు ఆవిష్కరించిన వ్యాఖ్యానాలు గమనిస్తే అత్యంత ఉత్తమంగా అనిపిస్తాయి. "ప్రభాతాల వెల్లువ/ నిశ్శబ్దాన్ని ఛేదించే నాందీగీతం/ ఎగరేసిన దేశపుజెండా/ కడివెడు కష్టాల్ని చెరిపేసేది/ మంత్రమౌతుంది/ అనిర్వచనీయమైన/ చుక్కాని/ సమ్మోహనం/ కర్తవ్యరేఖ ఎన్నో వసంతాల పంట/ లక్ష్మణరేఖ/ ఊరడింపు/ గాంఢ్రింపు/ మార్గదర్శకం/ మేలుకొలుపు/ భావ ప్రకటన, అద్భుతశక్తి/ దివ్యఔషధం వంటి విశేషణాలతో విశాలంగా చెప్పుకొచ్చారు.

ఈ దీర్ఘకవితా కావ్యాన్ని ఆయన 18 ప్రకరణాలుగా విభజించుకుని, మాట గురించే గతంలో తాను రాసుకున్న 11 కవితలనూ, ద్వానాశాస్త్రి, శైలజామిత్ర ఈ కావ్యంపై వెలిబుచ్చిన సమీక్షలను కూడా అనుసంధానించారు. మొత్తం ఈ సంపుటిని తన మాతృమూర్తి 'చిన్ని రామ లక్ష్మమ్మ' గారికి అంకితం చేసి అమ్మపై అపారమైన ప్రేమను ప్రకటించుకున్నారు.

ఈ కావ్యానికి ముందుగా అభిప్రాయాలను రాసిన తుర్లపాటి కుటుంబరావు, బీరం సుందరరావు కవన ప్రక్రియలోనే వెలిబుచ్చారు. డా॥బీరం సుందరరావు అభిప్రాయాన్ని చూసినపుడు దీర్ఘకవిత చదివి పొంగిపోయినట్లు అర్థం చేసుకుంటాము. తన అభిప్రాయాన్ని కవితా ధోరణిలో ఏడు పుటలు ఆవిష్కరించారు. అద్దేపల్లి, వెన్నెలకంటి, శ్రీరామ కవచం సాగర్, అనుమాండ్ల భూమయ్య, కొలకలూరి ఆశాజ్యోతి, రాధేయ వంటి ప్రముఖ కవుల అభిప్రాయాలు కూడా నిక్షిప్తమై నారాయణరావు కవిత్వానికి గుమ్మానికి తోరణంలా శోభనిచ్చాయి.

131 పుటలతో చిన్ని నారాయణరావు 'మాట' శీర్షిక (టైటిల్)తో వెలువరించిన పొత్తంలో చిక్కని కవిత్వాన్నీ, చక్కని భావుకతనీ పండించారు. కవిత్వాన్ని ఇష్టపడే వారంతా తప్పకుండా చదువవలసిన దీర్ఘకవితా కావ్యం ఇది. రూ.150ల ధర కలిగిన ఈ పుస్తకం కోరువారు చిన్ని నారాయణరావు, 27-1-171, శ్రీనికేతం, ఆదిత్యనగర్, చిల్డ్రన్స్ పార్క్‌రోడ్, నెల్లూరు- 524002. చరవాణి నెం-94402 02942ను సంప్రదించొచ్చు.

■

# ఉక్కుసంకల్పం


- పసుమర్తి పద్మజావాణి



నింగికీ నేలకీ సరిహద్దు రేఖలాగా గోచరించే
తూర్పు కనుమల పచ్చదనం మీదకి
జలజలా రాలుతోన్న పూలరేకుల్లాంటి తన ప్రభాత కిరణాల్ని
ఆ ప్రాంగణంలో జల్లి సూర్యుడు మురిసిపోతూంటాడు
ఆ మహాద్వారం ముందు నిలబడినప్పుడు
ఆలయ శిఖరాన్ని దర్శించిన అనుభూతి
అగ్రభాగాన కొలువైన **'ఐ'** చిహ్నం
ఇండియాని దృఢతరం చేసేది నేనే అంటూ
నవరత్న స్టేటస్‌తో ఉక్కు నగరం ...
సుదూరంలో తరగలెత్తే సముద్రం ...
మా విశ్వశ్రేష్టమైన ఉక్కుని ఖండాంతరాలకి
నేనే మోసుకుపోతున్నానంటూ లైట్‌హౌస్
తలపాగాని సగర్వంగా సర్దుకుంటుంది!
అనివార్యంగా అర్పించిన 32 ఆత్మల అమృత బలిదానం ...
ఆ దారి వెంట వెళ్లే జనావళికి
ఒక గొప్ప స్ఫురణగా నిలుస్తుంది!

మనుష్యుల మధ్యా, ప్రకృతిలోని ప్రతి అణువునీ
స్పృశిస్తూ సాగే ఋతువుల మధ్యా ...
విశ్రాంతి ఎరుగక పనిచేసే ప్రచండ యంత్ర సంపన్నత
వేలాదిగా శ్రమైక జీవుల ఆరాట పోరాటాల్ని
పట్టించుకుంటూ, సమన్వయం సాధించుకుంటూ
అనుక్షణం ప్రగతిదారుల వెంట పరిగెత్తే అధికార్ల సమర్థత
పారిశ్రామిక వాడల్లో ఒంటినిట్టాడి గుడిసెల్లో
బతుకు సంఘర్షణల్ని ఒడిసి పట్టుకుంటూ కుటుంబాలు
ప్రతి ఉదయాన్ని ఒక నమ్మకంతో, ఒక భద్రతతో
ప్రారంభించగలిగే గుండె దిటవు, ఒక సమూహ
జీవనోత్సవాన్ని పట్టెడన్నంగా ఆ బడుగు జీవుల
ఆకలిని చల్లార్చే అన్నపూర్ణ ఈ ఉక్కునగరం
కార్యక్షేత్రం నించి నల్ల బంగారమయ్యే ఇనుప రజను
కోక్ ఓవెన్స్ నుంచి సింటర్ ప్లాంట్ మీదుగా
అనంతంగా ప్రజ్వలించే బ్లాస్ట్ ఫర్నేస్‌ల్లో అగ్నిస్నాతయై ...
స్టీల్ మెల్టింగ్ ప్లాంట్‌లో శుద్ధి చెంది
ఆరు మిల్స్‌లో ఆకారాలు దాల్చి ఒదిగిపోతూంటే
ఉక్కు ఒక సమున్నత ఆశయ సాధనావృత్తమే కదా!
ఆకాశమే హద్దుగా దూసుకుపోతూ కొంగొత్త సాంకేతికతల్ని
ఎప్పటికప్పుడు అన్వయించుకుంటూ
వ్యర్థాల్లోంచి సైతం విద్యుదుత్పాదనతో విస్తరిస్తూ
కరోనా విలయ విధ్వంస నేపథ్యంలో
దేశానికి ప్రాణవాయువులు అందిస్తోంది మన ఉక్కు
లక్షల కోట్ల టర్నోవరు, వేల కోట్ల లాభాల ఉక్కు సంకల్పంపై
ఎవరి ప్రయోజనాల కోసం ఇన్ని నిందలూ కుట్రలూ?
సువిశాల భారత సార్వభౌమత్వాన్ని
వ్యక్తిపూజకి సమర్పించే నీచ రాజకీయ వలయం
ఉక్కుని ఉక్కిరిబిక్కిరి కావిస్తుంటే
చూస్తూ ఊరుకుందామా?
ఉతికి ఆరేద్దామా?

■






# ప్రపంచీకరణపై దూసిన విమర్శ ఖడ్గం

**డా.ఎ. రవీంద్రబాబు**

**80086 36981**

**వ**ర్తమానంలో మనిషి తనకు తెలియకుండానే తన అస్తిత్వానికి దూరమవుతున్నాడు. ఎరుక లేకుండానే తనను తాను కోల్పోతున్నాడు. మానసిక, బౌద్ధిక జీవితాన్ని కూడా కొన్ని శక్తులు నిర్దేశిస్తుంటే, వాటి మధ్య తలమునకలై తెలియక, తెలుసుకోలేక ఆశలు, ఆశయాల వెంట పరుగులు పెడుతు న్నాడు. విరామం, ఆలోచన లేకుండా సామాజిక సాంస్కృతిక స్పృహ లేకుండా దైనందిన జీవితంతో యుద్ధం చేస్తున్నాడు. వస్తువ్యామోహం, యుద్ధప్రీతి, మానవ సంబంధాల విముఖత, చేతివృత్తుల పతనం, చైతన్యరహిత స్థితి, యాంత్రీకరణ, చిన్న సంస్కృతుల వినాశనం, మానవ వనరుల ఎగుమతి దిగుమతులు, అగ్రదేశాల స్వేచ్ఛా వ్యాపారం, సాంకేతిక విప్లవాలు, మేధో వలసలు, మానవ హక్కుల ఉల్లంఘన, దేశాల ఆర్థిక వ్యవస్థల అస్తవ్యస్తం, కార్పొరేట్ సంస్థల పెత్తందారీ తనం... వంటివి ఎన్నో మనిషి జీవితంపై నిత్యం ప్రభావితం చూపిస్తున్నాయి. సత్యం, ధర్మం, నీతి, వ్యక్తిత్వం, విలువలను నిర్దేశిస్తూ, మనిషిని శారీరకంగా, మానసికంగా పహరా కాస్తున్నాయి. ఈ నేపథ్యంలో మనిషి వర్తమానాన్ని, భవిష్యత్తును దర్శించాల్సిన ఒక అత్యవసర స్థితిలో ఉన్నాడు. సమాజ బహిర్ చైతన్య రూపమైన సాహిత్యం కూడా ఇందులో భాగమైపోయింది. కానీ కొందరు కవులు, రచయితలు తమదైన స్వీయ దృక్పథంతో చైతన్యశీలురుగా రచనలు చేస్తున్నారు. ఆ రచనలపై జరిగే చర్చ, విమర్శ, పరిశోధన ప్రగతిపథానికి కొత్త దారులు వేయడానికి ప్రయత్నిస్తున్నాయి.

1991లో మన దేశం నూతన ఆర్థిక విధానాలకు ద్వారాలు తెరిచింది. స్వేచ్ఛా వాణిజ్య విపణిలో తనదైన ఆర్థికస్థితిలో నిలదొక్కుకొనేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టింది. భిన్న సంస్కృతులు, భిన్న మతాలు, వైవిధ్యమైన జాతులు, నిచ్చెనమెట్ల కులాలు, భౌగోళిక అసమతుల్య ప్రాంతాలు, ఎన్నో భాషలున్న భారతదేశం ఈ విధానాల వల్ల మరింత జటిలమైంది. ప్రజల జీవితాల్లో పెను మార్పులు సంభవించాయి. దాంతో సాహిత్యానికి కొత్త వస్తువులు నేపథ్యాలయ్యాయి. జీవనలోతుల్లోని మూలాలను కవులు, రచయితలు పట్టుకొని ఆ మార్పుల దృష్టితో సాహిత్యాన్ని సృష్టించారు, సృష్టిస్తున్నారు. ప్రపంచం మొత్తాన్ని ఒకే చట్రంలో బంధించే ఈ నయా విధానాన్ని గ్లోబలైజేషన్, ప్రవేటీకరణ, ప్రపంచీకరణ, విశ్వీకరణ వంటి పేర్లతో పిలుస్తున్నారు. పాశ్చాత్య దేశాల్లోనే కాకుండా, మనలాంటి దేశాల్లోనూ దీనిని సమర్థిస్తూ, వ్యతిరేకిస్తూ వచ్చిన సాహిత్యంపై విమర్శ కూడా మొదలైంది. దాదాపు మూడు దశాబ్దాల సాహిత్యం, దాని నేపథ్యం, తాత్విక దృక్పథం, రాజకీయ ఆర్థిక శక్తుల ప్రభావం లాంటి వాటిపై విమర్శ, పరిశోధన జరుగుతూ వచ్చింది, వస్తోంది.

ఈ నేపథ్యంలోంచే వర్తమాన, సామాజిక, సాహిత్య చైతన్యంలో భాగమై తన కర్తవ్యాన్ని సామాజిక, సాహిత్య కార్యకర్తగా నిర్వర్తిస్తున్నాడు పసునూరి రవీందర్. విశ్వవిద్యాలయ పరిశోధకుడిగా, సాహిత్య విద్యార్థిగా దాదాపు పదేళ్ల కిందటే గ్లోబలైజేషన్ సాహిత్యంపై వచ్చిన విమర్శపై ఎం.ఫిల్ చేశాడు. ప్రపంచీకరణ పరిణామంలో వచ్చిన తెలుగు సాహిత్యాన్ని పరిచయం చేస్తూనే విమర్శ దృక్పథాన్నీ కచ్చితంగా పట్టుకున్నాడు. ఆ భావనాత్మక ఆలోచనా పరిధులు, అపరిమితుల నుంచి ఒక తాత్విక సిద్ధాంతాన్ని రూపొందించే ప్రయత్నం చేయడానికి పూనుకున్నాడు.

పరిశోధనను పరిచయం చేస్తూ మొదటి అధ్యాయంలోనే "గ్లోబలైజేషన్ దృష్టితో వచ్చిన సాహిత్యాన్ని రేఖామాత్రంగా పరిచయం చేసి, విమర్శ లోతుల్ని తడమడానికి ప్రయత్నిం చాను. ఒక సిద్ధాంత భూమికను రూపొందించడానికి ప్రయత్నం చేశాను" అని పుస్తకాన్ని పరిచయం చేసి పాఠకులకు, పరిశోధకులకు, విమర్శకులకు దిశానిర్దేశం చేశాడు. ఈ పరిశోధన అయిదు అధ్యాయాలుగా సాగించాడు. మొదటి అధ్యాయంలో పరిశోధనకున్న సామాజిక, సాహిత్య నేపథ్యాల సంబంధాన్ని క్లుప్తంగా వివరించాడు. విద్య, వైద్యం, వ్యవసాయం వంటి రంగాల్లో వచ్చిన మార్పు.. అది ప్రజల జీవనవిధానంపై చూపిన ప్రభావం.. ఆ ప్రభావాన్ని పత్రికలు

పట్టుకున్న తీరు.. ప్రపంచీకరణ నిరసన అనుకూల వాదాలను ఈ పరిశోధన చర్చిస్తుందని చెప్పాడు. ఇది పరిశోధనా గ్రంథానికే కాకుండా, పరిశోధకుని ప్రతిభకు, దృక్పథానికి కొలమానం లాంటిది. రెండో అధ్యాయంలో ప్రపంచీకరణను నిర్వచించే ప్రయత్నం చేశాడు. పాశ్చాత్యులు, దేశీయులు ఇచ్చిన నిర్వచనాలను కోడ్ చేసి, వాటిద్వారా ప్రపంచీకరణ స్వభావ స్వరూపాలను అంచనా వేశాడు. ప్రపంచీకరణ అంటే 'అమెరికనైజేషన్' అని హెన్రీ కిసింజర్ ఇచ్చిన నిర్వచనం, 'ఆర్థిక వ్యవస్థలు, ఫైనాన్స్ మార్కెట్లు, వాణిజ్యం, కార్పొరేషన్లు, ఉత్పత్తి, పంపిణి, వినియోగదారీ మార్కెటింగ్ రంగాలు, దేశాలు పరస్పరం ఆధారపడే ప్రక్రియ' అని హాజల్ హెండర్సన్ ఇచ్చిన నిర్వచనం వంటివి ప్రపంచీకరణ మూలాలను, దోపిడీ స్వభావాన్ని విశ్లేషిస్తున్నాయన్నాడు. దేశీయ విమర్శకులైన మేడిపల్లి రవికుమార్ ఇచ్చిన 'ప్రపంచంలోని మానవ జాతులన్నీ ఒక జాతిగా, ఒక దేశంగా, ఒకే ఆర్థిక సామాజిక సాంస్కృతిక చట్రం కింద కలిసి జీవించే పద్ధతిని ప్రపంచీకరణ', గుడిపాటి ఇచ్చిన 'తమ ప్రయోజనాలకు అనుగుణంగా వర్ధమాన దేశాల ఆర్థిక, రాజకీయ విధానాన్ని రూపొందించడానికి సంపన్న దేశాలు అనుసరిస్తున్న వ్యూహమే గ్లోబలైజేషన్' అనే నిర్వచనాల్లో ప్రపంచీకరణ అనుకూలత, వ్యతిరేకత వ్యక్తమవుతున్నాయని చెప్పాడు. ఇవి ఒక పరిశోధకునిగా రవీందర్ స్థాయిని తెలియజేస్తున్నాయి.

ప్రపంచీకరణను స్వేచ్ఛా వాణిజ్యంగా, కుట్రగా ఆర్థిక వ్యవస్థలను అభివృద్ధి చేసే ప్రక్రియగా, పేదదేశాలను ఆదుకునే విధానంగా, భిన్న సంస్కృతుల అనుసంధానంగా, దేశాల మధ్య ఆంక్షలను ఎత్తివేసే ప్రక్రియగా, ఏక ప్రపంచ భావనగా... చూడాలి అనే అంశాలను కూలంకషంగా, సూక్ష్మీకరించి చర్చించడంలో పరిశోధకుడి దృష్టి అర్థమవుతుంది. అయితే చర్చించిన అంశాలు ఏకీకృతమై, చర్విత చర్వణమైనట్లు కనిపిస్తుంది. ఒక విభాగంలోని అంశం మరో విభాగానికి బట్వాడా అయ్యాయి. అయినా 'సంస్కృతుల అనుసంధానమా?' విభాగంలో 'నూతన ఆర్థిక విధానాల ఫలితాలను, ఆదాయాలను అంది పుచ్చుకోవడంలో ముందున్న మధ్య తరగతి, ఉన్నత తరగతులు, మేధావులు... ప్రపంచీకరణ సునామీ వినాశనాన్ని కప్పిపుచ్చే ఉదారవాది పాత్ర పోషిస్తున్నాయి. ఆధునికత అంటే అమెరికీకరణగా నిర్వచిస్తున్నారు." వంటి విషయాలను సందర్భోచితంగా ప్రస్తావించాడు.

మూడో అధ్యాయాన్ని కవిత్వం, కథ, పాట, నవల, నాటకం, వాద వివాదాలనే నాలుగు భాగాలుగా చేసి ప్రపంచీకరణ నేపథ్యంతో వచ్చిన సాహిత్యాన్ని పరిచయం చేశాడు. కొత్తగా ఈ పుస్తకం చదివేవాళ్లకు ఇది బహుదా ఉపయోగం. ప్రపంచీకరణ సాహిత్యాన్ని కాలానుగుణంగా రెండు భాగాలు చేశాడు. 1991 నుంచి 2000 వరకు వచ్చిన సాహిత్యం, 2000 తర్వాత వచ్చిన సాహిత్యం. రచయితకున్న సామాజిక, చారిత్రక దృష్టితో ఆ కాలంలో ప్రపంచ దేశాల్లోనే కాదు తెలుగు సమాజంలో కూడా చోటుచేసుకున్న పలు సంఘటనలను, అవి తెలుగు సాహిత్యంలో ప్రతిఫలించిన తీరును క్లుప్తంగా వివరించాడు. పరిశోధనాత్మక అంశం దృష్ట్యా ఈ విశ్లేషణ రచయితకు ప్రపంచీకరణ వ్యతిరేక సాహిత్యంపై ఉన్న ఇష్టం, అభినివేశం, విస్తృత పరిచయాన్ని తెలియజేస్తుంది. ఈ ఉప అంశాలపై సూక్ష్మంగా, వివరణాత్మకంగా పరిశోధనలు జరగాల్సిన అవసరాన్ని కూడా ఇవి గుర్తుచేస్తున్నాయి. రవీందర్ కొందరు కవులు, రచయితల రచనలను క్లుప్తంగా అవసరం మేరకు పరిచయం చేశాడు. ఇవి పరిశోధనకు కావాల్సిన మౌలిక భావనలను అందిస్తున్నాయి. 'ప్రపంచీకరణ వాద వివాదాలు' అనే ఉప విభాగంలో పరిశోధకుడు చర్చకు పెట్టిన అంశాలు చాలా ప్రాధాన్యత సంతరించుకున్నవే. 'ముస్లిములను పాశ్చాత్య దేశాలు నేరస్తులుగా చూడడం వెనుక ప్రపంచీకరణ ప్రభావం, ఇస్లాం, ముస్లిం వాదాల వెనుక తాత్విక అవగాహన, ప్రపంచీకరణ నేపథ్యంలో శ్రీశ్రీ లాంటి కవుల మీద జరిగిన చర్చ, గ్లోబల్ సందర్భంలో స్త్రీవాదం, దళితవాదంలోని ఐక్యత, విభజన భాగాలు, కులవృత్తుల ప్రాధాన్యతతోపాటు ఆ వృత్తులను వీడి యువత విద్య, ఉద్యోగ అవకాశాల్లో ముందుకు వెళ్తున్న తీరును అర్థం చేసుకోవడం' లాంటివి కొత్త ఆలోచనలకు పునాది వేస్తున్నాయి.

నాల్గవ అధ్యాయం 'ప్రపంచీకరణ– సాహిత్య విమర్శ' పరిశోధనకు వెన్నెముక లాంటిది. ప్రపంచీకరణ విమర్శను 'ఆధిపత్య విమర్శ, ప్రతిఘటన విమర్శ, అస్తిత్వ నిరూపణ' అనే మూడు భాగాలుగా విశ్లేషించాడు పరిశోధకుడు. ప్రపంచీకరణ స్వభావాన్ని సమర్థించడం, బహుళజాతి సంస్థలు, సంపన్న వర్గాలు, ఉన్నత కులాల ప్రయోజనాలను కాపాడేదిగా ఈ విమర్శ ఉంటుందన్నాడు. ప్రతిఘటన విమర్శ సామ్రాజ్యవాదాన్ని, వర్ధమానదేశాలపై అగ్రరాజ్యాలు సాగిస్తున్న దోపిడీని విమర్శించే తీరుకు సంబంధించిందన్నాడు. మూడో విమర్శ ప్రపంచీకరణను సామ్రాజ్యవాద కుట్రగానే కాకుండా, పెట్టుబడుల సంచయంగా చూస్తుందని, దాన్ని ప్రతిఘటించడానికి శ్రామిక వర్గాలు, కిందికులాల ఐక్యత, జాతుల సమూహ పోరాటం అవసరమన్న భావన వ్యక్తమవుతుందని చెప్పాడు. వీటన్నింటిలోని మౌలిక భావనలు, చర్చిస్తున్న


అంశాల ప్రధానంగా ప్రపంచీరణ విమర్శను ఏడు భాగాలుగా విభజించాడు పరిశోధకుడు. 1. సామ్రాజ్యవాద నియంత్రణ 2. సామ్రాజ్యవాద సంస్కృతి పరివ్యాప్తి 3. వృత్తుల విధ్వంసం 4. కుటుంబ విధ్వంసం – మానవ సంబంధాల విచ్ఛిత్తి 5. స్థానీయత 6. యుద్ధోన్మాదం 7. వస్తు వ్యామోహం. ఇవన్నీ ప్రపంచీకరణ వ్యతిరేక సాహిత్యంలో కనిపిస్తున్న అంశాలు. విమర్శకులు గుర్తించి చర్చించిన అంశాలు. గుడిపాటి, అంబటి సురేంద్రరాజు, ప్రసేన్, అయిలయ్య, రాచపాళెం చంద్రశేఖర రెడ్డి, కె.శ్రీనివాస్, ఎన్.వేణుగోపాల్, ఎస్వీ.సత్యనారాయణ, బి.ఎస్.రాములు, జ్వాలాముఖి, కడియాల రామ్మోహనరావు, మేడిపల్లి రవికుమార్ వంటి విమర్శకులు ప్రపంచీకరణ గురించి వ్యక్తం చేసిన అభిప్రాయాలను పరిశోధకుడు కూలంకషంగా అర్థం చేసుకున్నాడని చెప్పొచ్చు. వారి విమర్శ లోతులను గుర్తించి వారి అభిప్రాయాల్లోని అంతఃసూత్రాన్ని విశ్లేషించాడు. ఇవి పరిశోధనపై అతడి నిబద్ధత, మెథడాలజీ, అవగాహన, విశ్లేషణాత్మక తీరుకు నిదర్శనం.

"మాతృభాషలు మృతభాషలుగా మారబోయే విషాదాన్ని సాహిత్యకారులు అడ్డుకోవడానికి సంకల్పించారు. అయితే విమర్శకుడు ఈ విషయంపై చేసే కృషిని ఒకే కాలంలో రెండు ప్రయోజనాలుగా భావించాడు. స్థానిక భాషా సంస్కృతుల్ని రక్షించుకోవడానికి ప్రపంచీకరణను ప్రతిఘటించడమే ప్రధాన ఆయుధంగా, మార్గంగా భావించాడు. దీని ద్వారా సామ్రాజ్యవాద సంస్కృతికి అడ్డుకట్ట వేయడం ఒక ప్రయోజనమైతే స్థానిక భాషా సంస్కృతుల్ని కాపాడుకోవడం మరొక ప్రయోజనంగా విమర్శకులు భావించారు" అని ప్రపంచీకరణ విమర్శలోని గొప్పతనాన్ని పసికట్టాడు రవీందర్. విమర్శ గుర్తించిన మరో విషయాన్ని ప్రస్తావిస్తూ "అస్తిత్వ ఉద్యమాలు అనేక సామాజిక సమస్యలకు పరిష్కారాన్ని చూపిస్తాయని విమర్శకులు అభిప్రాయపడ్డారు. ముంచుకొస్తున్న సామ్రాజ్యవాద సంస్కృతికి ప్రత్యామ్నాయంగా అస్తిత్వ ప్రధానమైన సంస్కృతిని కాపాడుకోవడం అవసరం అనుకున్నారు. అప్పుడు మాత్రమే అడుగంటుతున్న మానవ సంబంధాలను, విలువలను నిలబెట్టుకోగలమని విమర్శకులు భావించారు"ని ప్రతిపాదించాడు. తెలంగాణ అస్తిత్వ ఉద్యమాన్ని, ఆ సాహిత్యాన్ని ప్రపంచీకరణతో ముడిపెట్టి "విశాల వేదికను నిర్మించే ఏ ప్రయత్నమైనా విఫలం అవుతుంది. అందుకే స్థానిక నిర్దిష్ట గుర్తింపు ఉద్యమాలు తగిన పోరాటాన్ని, ప్రతిఘటనను నిర్మిస్తాయి. అలా ఒక సజీవ చైతన్యంతో వచ్చింది తెలంగాణ సాహిత్యం" అన్నాడు. ఈ అధ్యాయంలోనే పరిశోధకుడు తన అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తూ.. "విడివిడి ప్రయత్నాల వల్ల ఒక సాహిత్య సిద్ధాంతం రూపొందాల్సిన అవసరం ఉంది. అందుకు అవసరమైన ప్రతిపాదన ఈ క్రమంలోనే ఆకృతి పొందాలి" అని ప్రతిపాదించాడు. ఇది అతడి దూరదృష్టికి, తార్కిక ఆలోచనకు నిదర్శనం. అయితే విమర్శను, సృజనాత్మక సాహిత్యాన్ని కలగలిపి చెప్పిన తీరు ఈ అధ్యాయంలో కొంత పరిశోధనాత్మక తీరును ఇబ్బంది పెడుతుంది.

"ప్రపంచీకరణ సాహిత్య సిద్ధాంతం' అనే చివరి అధ్యాయంలో పరిశోధకుడు ఒక కొత్త సిద్ధాంత రూపకల్పనకు అవసరమైన భూమికను సిద్ధం చేశాడు. సాహిత్య సిద్ధాంతానికి, విమర్శకు ఉన్న తేడాను చర్చించి, ప్రపంచీకరణకు సంబంధించిన సాహిత్య సిద్ధాంతం ఏర్పడడానికి అవసరమైన ప్రాతిపదిక సిద్ధమైందన్నాడు. ప్రపంచీకరణ వల్ల కుల వ్యవస్థలో మార్పులను ఆహ్వానించే వాళ్లు దీనిని కొంతవరకు స్వాగతిస్తున్నారని, దీనిని సాహిత్యేతర అంశంగానే కాకుండా రాజకీయ అంశంగా కూడా చూడాలన్నాడు. తర్కబద్ధమైన సూత్రీకరణతో సిద్ధాంతాన్ని నిర్మించుకోవాలంటూ 'సామ్రాజ్యవాద దోపిడి వ్యతిరేకత, స్థానిక జాతిరాజ్యాల స్వయం ప్రతిపత్తి, సాంస్కృతిక స్వావలంబన, మానవ సంబంధాల పరిరక్షణ' భూమికతో తాత్విక సాహిత్య సిద్ధాంత నిర్మాణానికి ఈ పరిశోధకుడు పూనుకున్నాడు.

"మానవ జీవితంలోని సకల పార్శ్వాలను ప్రపంచీకరణ ప్రభావితం చేస్తున్న తీరు, వివిధ అస్తిత్వ సాహిత్యాల్లో ప్రపంచీకరణ ప్రదర్శన, ప్రపంచీకరణకు వ్యతిరేకంగా బహుళ గుర్తింపులను సమీకరించేది, కళాత్మకంగా అర్థం చేసుకోవడం, అస్థిరమవుతున్న సంస్కృతులకు నైతిక, రాజకీయ సంఘీభావం, మార్క్సిజం ఎరుకతో చారిత్రక, గతితార్కిక పద్ధతిలో దిశానిర్దేశం చేయడం, ప్రపంచీకరణను పునరుద్ధరించాలి, కీర్తించాలన్న వాటిని వ్యతిరేకించాల"న్న ప్రతిపాదనలు చేశాడు. అయితే ఇవి సైద్ధాంతిక నిర్మాణానికి సరిపోతాయా లేదా అన్నది విమర్శకులు, పరిశోధకులు తేల్చాలన్న భావాన్ని కూడా వ్యక్తం చేశాడు రవీందర్.

ప్రపంచీకణ సాహిత్యం, విమర్శ అనేవి కొనసాగుతున్న అంశాలు. వర్తమానంలో ముగింపులేని విషయాలు. ఈ క్రమంలో ప్రపంచీకరణ సాహిత్య విమర్శను పూర్తిగా పరిపుష్టం చేయడం సాధ్యమయ్యే పనికాదు. కొనసాగింపునకు కావాల్సిన సూత్రాలను అందించగలం. ఈ పనిని పసునూరి రవీందర్ పరిశోధనాత్మకంగా చేశాడు. సామాజిక సాహిత్య విమర్శల మధ్య ఉన్న ఇరుసును పట్టుకొని, భవిష్యత్తు పరిశోధకులకు కావాల్సిన ముడి సరుకునే కాదు, ఛాయాచిత్రాన్ని కూడా గీసి చూపించాడు. ■




# కఠిన సత్యాలు కౌలూరి నానీలు

- ఎమ్వీ రామిరెడ్డి
98667 77870

**నా**నీల ప్రక్రియకు శ్రీకారం చుట్టిన రోజు ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ ఎన్.గోపి గారు కూడా అనుకొని ఉండరు... తన సృజనకు మరెందరో పట్టం కడతారని, చాలామంది కవులు నానీలతో ప్రేమలో పడతారని! అంచనాలకు మించి ఆ ప్రక్రియ ప్రాచుర్యం పొందింది. అనేకమంది కవుల కలాలకు పని కల్పించింది. ఒకదశలో పుంఖానుపుంఖాలుగా నానీలు పుట్టుకొచ్చాయి. అదే సమయంలో 'మంది ఎక్కువైతే...' సామెతలాగా నానీలు బరువు తగ్గిపోయి గాలిలో తేలిపోయాయి. కవి కసరత్తులో ఏమాత్రం లోపమున్నా ఆ భావప్రకటన 'అభావ ప్రకటన'గా మారిపోతుంది.

కానీ, కొందరు కవులు మాత్రం సీరియస్‌గా తీసుకున్నారు. అద్భుతమైన నానీలకు ప్రాణం పోసి, పాఠకుల ఒడిలో పెట్టారు. వారిలో కౌలూరి ప్రసాదరావు ఒకరు. వచన కవిత్వం, బాలల కథలతోపాటు నానీలకూ సాన పెట్టారు. ఆయన ప్రచురించిన 'నానీల ప్రసాదం' సంపుటిని ఓ రాత్రివేళ అత్యంత అనాసక్తంగా చదవటానికి ఉపక్రమించాను. నాకు తెలియకుండానే పేజీలు తరిగిపోయాయి. నానీలు నిశ్శబ్దంగా నా అంతర్లోకాల్లో గిరికీలు కొట్టసాగాయి.

ఎవరి అనుభవాన్ని వారు అక్షరబద్ధం చేసినప్పుడు, ఆ రాతలో నిజాయితీ ఉంటుంది. నిజం ఉంటుంది. ఆ బాధ లేక సంతోషం తాలూకు మౌలిక భావన అత్యంత సహజంగా ఆవిష్కృతమవుతుంది. ఈ ప్రాథమిక సూత్రానికి కట్టుబడిన కవి కౌలూరి... బస్ కండక్టర్‌గా తన జ్ఞాపకాలకే నానీల రెక్కలు తొడిగారు.

**"పెద్ద వాహనం/ చేతినిండా డబ్బుచ్చే జాబ్**
**జోస్యం ఫలించింది/ కండక్టరయ్యా".**

బస్సులో రకరకాల మనస్తత్వాలున్న మనుషులు ప్రయాణిస్తుంటారు. ప్రయాణం పొడవునా అరుపులూ కేకలూ సహజం. ఛలోక్తులు పేలుతుంటాయి. చిత్రమైన సంభాషణలు నడుస్తుంటాయి. ఆ క్రమంలో ఎదురైన ఓ పిల్ల గడుసుతనాన్ని కవి ఓ నానీలో చమత్కారంగా అమర్చారు.

**"ఆ పిల్ల/ భలే బేరగత్తె**
**బస్ టికెట్ 'పదం'టే/**
**'ఏడు'కి రాదా? అంది"**

సందర్భాలను సమయోచితంగా కవితారచనకు వాడుకునే కవి ఉపరితల వాతావరణ చిత్రణకే పరిమితమవుతాడు. కానీ, కౌలూరి విధినిర్వహణకూ సృజనాత్మక తపనకూ అభేదం పాటిస్తారు. అదే తన అదనపు శక్తిగా అర్హత సాధిస్తారు. కాబట్టే...

**"ఒకప్పుడు/ వాళ్ళు ప్రయాణికులే**
**రాస్తున్నాగా/ అక్షరాలుగా మారారు"** అని తాను సొంతం కవిగా రూపాంతరం చెందిన పరిణామాన్ని అక్షరీకరించారు. పనిలో పనిగా "చావు రాకుండా/ అమృతమియ్యి దేవుడా" అని కోరుకుంటే విధాత "కరుణించాడు/ కవిత్వమిచ్చాడు" అని మురిసిపోతారు.

ప్రసాదరావు నేలను వదిలి సాము చెయ్యలేదు. ఊహాలోకాల్లో విహరించలేదు. అమాంతం అంతెత్తున ఆకాశంలోకి కాయం పెంచలేదు. తనను తాను తగ్గించుకున్నారు. ఒదిగి ఉండాల్సిన ఆవశ్యకతను గుర్తించారు. ఆ స్పృహలోంచే...

**"సముద్రమంత/ పెద్ద కవిని కాదు**
**చెలమలోనూ/ నీళ్ళుంటాయి గదా!"** అని వినమ్రంగా చెప్పుకొన్నారు. అట్లా అని, తన విస్తరణకు పరిమితులు విధించుకోలేదు. బస్సు కిటికీల్లోంచి బయటి ప్రపంచాన్ని అనేక కళ్లతో పరిశీలించారు. లోకం పోకడలను మనసులో రికార్డు

చేసుకున్నారు. గాలి, నేల, చెట్టు, పుట్ట, కొండ, బండ అన్నిటినీ తన సృజనతో అలంకరించారు...

**"నక్కని తొక్కితేనే/ సరిపోదు/**
**దుక్కిని దున్నితేనే/ కలిసొస్తుంది".**
**"గాలి ఊసులతో/ చెట్టు తలూపింది**
**కొండ స్పందించలేదు/ రాతిగుండె".**

మనసు ముఖ్యమా? శరీరం ముఖ్యమా? ప్రేమ ముఖ్యమా? పేగు ముఖ్యమా?

**"మనసు ముఖ్యమని/ మిస్సిండియాకు చెప్పకు**
**చర్మం కాదంటే/ చచ్చినా ఒప్పదు".**
**"ప్రేయసికి/ కొండమీది కోతినిస్తావా?**
**సర్లే! ముందు/ తల్లికి గుడిసె చూడు".**

సాంకేతిక సదుపాయాలు వెల్లువెత్తి, సజల నేత్రాల చిరునామా చెరిగిపోతున్న అత్యాధునిక కాలప్రవాహంలో మనిషి కొట్టుకుపోతున్నాడు. వస్తువులతో పీకల్లోతు ప్రేమలో కూరుకుపోయి ఆత్మీయ పలకరింపు అదృశ్యమవుతున్న గాలివాటుకు ఎదురీదుతున్నాడు. ఈ విచిత్ర వాతావరణాన్ని నాలుగు ముక్కల్లో నాలుగు నానీల్లో చెప్పారు ప్రసాదరావు...

**"పుస్తకం/ హస్తభూషణం ఒకనాడు**
**సెల్యులర్/ సర్వభూషణం ఈనాడు".**
**"కూడికూత/ కుక్క అరుపు తెలుస్తున్నాయి**
**మనిషి మాటే/ అర్థమవట్లేదు".**
**"తెలివుంది/ కలిమీ బలమూ ఉంది**
**కాస్తంత మనసుంటే/ ఎంత బాగుండును".**
**"నిష్కారణంగా/ ఏ జంతువూ వేటాడదు**
**సరిగ్గా చూడు/ మానవ మృగమే".**

మరోవంక, తన మీద తనకు నమ్మకం సన్నగిల్లుతున్న జబ్బుతో మనిషి జీవనం కుదేలవుతోంది. గాల్లో గీతల్ని, ఆకాశంలో మబ్బుల ఆకారాల్ని ఆసరా చేసుకుని తియ్యటి కలలు కనటం ఎంత అమాయకత్వమో చెబుతున్నారు...

**"రాశిఫలాల్లో/ ఆకస్మిక ధనలాభం**
**రోడ్డుపై దొరికింది/ రూపాయి బిళ్ల".**

'మంచి' అనే పదం మన ప్రపంచం నుంచి పారిపోయిన అరుదైన గ్రహం కాదు. ఇష్టపూర్వకంగానే మనం దానికి దూరమవుతున్నాం. ఏదో చేయబోతే ఏదో అయిందట... వంటి సామెతల్ని సాకుగా చూపుకొంటూ మన చుట్టూ భద్రమైన సరిహద్దులు నిర్మించుకుంటున్నాం.

**"మంచి చేస్తున్నావా?/ అడ్డంకులొస్తాయి**
**సూర్యచంద్రులకైనా/ గ్రహణాలున్నాయి"** అంటూ నగ్నసత్యాన్ని చెబుతున్నారు.

**"భుజాలు/ నొప్పిగా ఉన్నాయా?**
**చెప్పుడు మాటలు మోస్తే/ అంతేగా మరి!"** అంటూ భుజాలు తడుముకునేవాళ్లను హేళన చేస్తున్నారు.

**"బెల్టు షాపు వాడిని/ జైల్లో పెట్టారు**
**ఊచల వెనుక/ కూర్చున్నాడు"** అంటూ ఇప్పుడు ఊరూరా దర్శనమిస్తున్న అక్రమ దృశ్యాన్ని అక్షరాలతో రూపు కడుతున్నాడు. కంటికి కనిపించని వైరస్ ఒకటి ఇవాళ ప్రపంచానికి కంటిమీద నిద్ర లేకుండా చేసింది. ఇంతకీ అది ఎక్కడి నుంచి వచ్చింది? ఏ రూపంలో ఉంటుంది? ఇదిగో చూడండి...

**"రాత్రి చింతచెట్టు కింద/ ఉక్కిరి బిక్కిరి**
**దెయ్యం కాదు/ కార్బన్ డై ఆక్సైడ్".**

అంతులేని ఆశల్ని గుండె నిండా మోసుకుంటూ మనిషి సహజ వనరుల్ని ధ్వంసం చేస్తున్నాడు. సహజత్వానికి తూట్లు పొడుస్తున్నాడు. పరీక్షనాళికల్లో కృత్రిమ రుతువుల్ని సృష్టించుకుని మురిసిపోతున్నాడు. ఆ విషయాన్ని గొప్పగా చెప్పిన నానీ...

**"కోకిలకి అనారోగ్యం/ కచేరీ రద్దు**
**మావి చిగురుపై/ పురుగు మందులు".**

♦ ♦ ♦

కొలూరి నానీల్లో విసుర్లున్నాయి. విన్నపాలున్నాయి. విమర్శలున్నాయి. జీవన సత్యాలున్నాయి. మానవ సంవేదనలున్నాయి. ఐహిక మర్మాలున్నాయి. సరదాగా కనిపించే ఏ నానీ పొట్ట విప్పి చూసినా కఠిన సత్యాలు ఆవిష్కృతమవుతాయి.

**"ప్రతిదానికీ/ బాధ పడుతున్నావా?**
**తీసుకోని అప్పుకి/ వడ్డీ కట్టినట్టే".**
**"దొరవారి/ పటుత్వానికి**
**లేహ్యంగా మారింది/ పాపం! ఊరపిచ్చుక".**
**"గుడ్డివాడనకు/ మనో నేత్రముంది**
**కళ్ళున్నా కబోదివే/ జ్ఞాననేత్రం లేదు".**
**"సోదె'ని నమ్మను/ ఐనా చెప్పించుకున్నా**
**ఆమె కళ్లలో/ ఆకలి బాధ చూసి".**
**"అందరినీ స్టడీ చేశా/ నన్ను తప్ప**
**ఇక తప్పలేదు/ నాలోకి నా ప్రయాణం".**
**"వర్షం వెలిశాక/ పుస్తకం చిరిగింది**
**ఎన్ని పడవలో/ వీధి నదిలో".**


గంభీరస్వరాన్ని గుట్టుగా భద్రపరచిన ఏ నానీని తవ్వి చూసినా అపరిమిత లోతులు అగుపిస్తాయి.

గోపి గారు రాసిన ముందుమాట ఈ సంపుటి విలువను మరింత పెంచింది. నానీల ప్రక్రియను తనకు పరిచయం చేసిన మెట్టా నాగేశ్వరరావు గారికి ఈ పుస్తకం అంకితమివ్వటం కవి చిత్తశుద్ధికి నిదర్శనం. ■



## శ్రామిక శక్తికి జేజేలు పలికిన

# కార్మిక కవనం



[illegible]

[illegible]

SAHITYA PRASTHANAM ■ SAMPUTI - 2 ■ SANCHIKA - 8 ■ KRISHNA ■ May 2021
RNI NO.APTEL/2004/18396 ■ Postal Regd. No.VJ/187/2020-22 PAGES : 68
Date of Posting : 1st & 2nd of Every Month ■ Date of Publication : 27.4.2021


# సుందరయ్య విజ్ఞాన కేంద్రం ప్రచురణలు

రెండు తెలుగు రాష్ట్రాలలో ప్రధానంగా వ్యవసాయ రంగంలో, ఆర్థిక, సామాజిక రంగాలలో మార్పుల గురించి విస్తృతంగా చర్చ చేయటం ప్రచురించిన గ్రంథాలు.



ఎంపిక చేసిన 15 పుస్తకాలు. అన్ని పుస్తకాల విలువ రూ. 1205/-.
ఇప్పుడు 600/- చెల్లిస్తే రిజిస్టర్ పోస్టులో పంపుతాం.
ప్రజాశక్తి బుక్‌హౌస్, గూగుల్ పే, ఫోన్‌పే నెం : 9291603475

## ప్రజాశక్తి బుక్‌హౌస్

27-1-64, కారల్‌మార్క్స్ రోడ్, గవర్నర్‌పేట, విజయవాడ - 2, ఫోన్ : 0866 - 2577533
**బ్రాంచీలు :** విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి, గుంటూరు, కాకినాడ,ఏలూరు, విజయనగరం, ఒంగోలు, నెల్లూరు, కర్నూలు, అనంతపురం


If Un delivered please return to: Prasthanam, C/o M.B. Vignana kendram, 27-30-4, 3rd Floor Akulavari veedhi, Governorpet, Vijayawada - 520002. Ph: 0866-2577248, Cell: 94900 99057